సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 104

బుధవారం 5-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



చాంపియన్ భారత్

తొమ్మిదోసారి 'శాఫ్' టైటిల్ సొంతం.. ఫైనల్లో కువైట్‌పై గెలుపు. -12లో



చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్

బీసీసీఐ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా భారత మాజీ ఆల్‌రౌండర్. -12లో



ఉగ్రపోరులో ద్వంద్వ ప్రమాణాలొద్దు

ఉగ్రవాద కార్యకలాపాలను కఠినంగా అణచివేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలు వద్దని ప్రధాని మోదీ హితవు పలికారు.

వివరాలు 6లో ▶



ఇజ్రాయెల్ భారీ సైనిక ఆపరేషన్

పాలస్తీనా ఉగ్రవాదులను ఏరివేయడమే లక్ష్యంగా వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ సేనలు విరుచుకుపడుతున్నాయి.


వివరాలు 6లో ▶



భారత కాన్సులేట్‌పై దాడి

అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై ఖలిస్తానీ మద్దతుదారులు దాడి చేశారు. నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు.

వివరాలు 6లో ▶



అమెరికాలో మళ్లీ పేలిన తూటా..

అమెరికాలో టెక్సాస్, ఫిలడెల్ఫియాల్లో జరిగిన కాల్పుల ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా మరో 10 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

10న ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు



గత నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఈ నెల 10న వెల్లడించేందుకు ఇంటర్ బోర్డ్ సన్నాహాలు చేస్తోంది. మూల్యాంకన ప్రక్రియ పూర్తయిందని, రెండురోజుల్లో క్రాస్‌చెక్ అయిపోతుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

- వివరాలు 3లో ▶

విద్యుత్ కోత పెడితే .. డిస్కంలకు వాతే



విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు విధించడానికి వీల్లేదని డిస్కంలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. సరైన కారణాలు లేకుండానే ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తే సంబంధిత డిస్కంల నుంచి పరిహారం కోరే హక్కును వినియోగదారులు కలిగి ఉన్నారని స్పష్టం చేసింది.

- వివరాలు 5లో ▶

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రోనాల్డ్ రాస్



జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ అదనపు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమితులయ్యారు.

- వివరాలు 3లో ▶

కమల దళపతి కిషన్‌రెడ్డి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల అప్పగింత

బండి సంజయ్ స్థానంలో నియమించిన అధిష్టానం

- చర్చోపచర్చల అనంతరం జాతీయ నాయకత్వం కీలక నిర్ణయాలు
- నడ్డా ఉత్తర్వుల మేరకు ఆదేశాలు జారీ
- మార్చేముందు బండితో జాతీయ అధ్యక్షుడి మంతనాలు
- కేంద్ర మంత్రివర్గంలో చోటుపై రెండ్రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం
- నడ్డాతో సమావేశమైన ఎంపీ సోయం





ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై గత కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఊహాగానాలు, ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ బీజేపీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. బండి సంజయ్ స్థానంలో.. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న గంగాపురం కిషన్‌రెడ్డిని రాష్ట్ర పార్టీ చీఫ్‌గా నియమించింది. ఇదే సమయంలో పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు అప్పగించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం మధ్యాహ్నం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించిన బండిని త్వరలోనే కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతుండగా, దీనిపై మరో రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

అనుభవం, అణకువ ప్రామాణికంగా..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడి మార్పు సహా పలు కమిటీల నియామకంపై బీజేపీ అధిష్టానం గడిచిన నెల రోజులుగా చర్చోపచర్చలు కొనసాగించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లు ఈ అంశాలపై దృష్టి పెట్టారు. రాష్ట్ర నేతల అభిప్రాయాలు

మిగతా 2వ పేజీలో ▶



బాబూలాల్



సునీల్ జాఖడ్

బీజేపీ రాష్ట్ర శాఖలకు కొత్త సారథులు

2024 లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని అధికార బీజేపీ సంస్థాగతంగా కీలక మార్పులు చేపట్టింది. పంజాబ్ బాధ్యతలు సునీల్ జాఖడ్‌కు, జార్ఖండ్ బాధ్యతలు బాబూలాల్ మరాండీకి అప్పగించింది.

- వివరాలు 6లో



ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా

దగ్గుబాటి పురందేశ్వరి

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి 10 లో

సమర్థవంతంగా సమన్వయం!

ఇదే అంచనాతో కిషన్‌రెడ్డికి రాష్ట్ర బీజేపీ బాధ్యతలు 2 లో



మంగళవారం హైదరాబాద్‌లో అల్లూరి జయంతి వేడుకల్లో విల్లు ఎక్కుపెట్టిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అల్లూరి పోరాటం దేశానికి స్ఫూర్తిదాయకం

చిన్న వయస్సులోనే దేశం కోసం అమరుడైన వీరుడు సీతారామరాజు: రాష్ట్రపతి

- 'తెలుగు వీర లేవరా.. దీక్షబూని సాగరా..' పాటను గుర్తు చేసిన ద్రౌపదీ ముర్ము
- మహాత్మాగాంధీ మెచ్చిన నాయకుడు అల్లూరి: సీఎం కేసీఆర్
- అల్లూరి త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయి: గవర్నర్ తమిళిసై
- ఘనంగా అల్లూరి 125వ జయంతి ముగింపు వేడుకలు

సాక్షి, హైదరాబాద్: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం, ఆయన దేశభక్తి అసమానమైనదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. పీడిత ప్రజల పక్షాన పోరాడి అతి చిన్న వయస్సులోనే అమరుడైన అల్లూరి సీతారామరాజు జీవితం యువతకు స్ఫూర్తిదాయకం అని వ్యాఖ్యానించారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని, ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడమే మనమంతా ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, క్షత్రియ సేవా సమితి సంయుక్త

మిగతా 2వ పేజీలో ▶

> "బ్రిటిష్ బానిస బంధాల్లో చిక్కుకుని భరతజాతి నలుగుతున్న వేళలో విప్లవ జ్యోతిలా అవతరించిన వీర యోధుడు అల్లూరి. గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన మహా యోధుడు. భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, ఆజాద్ చంద్రశేఖర్ వంటి గొప్ప పోరాట యోధుల సరసన మన తెలుగు జాతిని నిలబెట్టిన గొప్పవీరుడు. - సీఎం కేసీఆర్

ఆరిజిన్ బయో..

రూ. 330 కోట్ల పెట్టుబడి

- జీనోమ్ వ్యాలీలో తయారీ యూనిట్ ఏర్పాటుకు నిర్ణయం
- మంత్రి కేటీఆర్‌తో సంస్థ సీఈవో, డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ భేటీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ కేంద్రంగా వైద్య చికిత్సలో కీలకమైన థెరాప్యూటిక్ ప్రొటీన్లు, యాంటీబాడీస్ తదితరాల తయారీకి సంబంధించి అత్యాధునిక వసతులతో కూడిన అభివృద్ధి, తయారీ యూనిట్‌ను రూ. 330 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలని ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ నిర్ణయించింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఆరిజిన్

మిగతా 5వ పేజీలో ▶



మంగళవారం హైదరాబాద్‌లో మేడిన్ తెలంగాణ వైద్య ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

'మేడిన్ తెలంగాణ' వైద్య ఉత్పత్తులు

హైదరాబాద్‌లోని మెడికల్ డివైజెస్ పార్కులో తయారీ

- 3 సంస్థల ఉత్పత్తులను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్
- ఇందులో దేశంలో, ప్రపంచంలోనే తొలి ఉత్పత్తులు
- వైద్య ఉపకరణాల నాణ్యతను పరీక్షించేందుకు 6 సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూ

5 లో

కుమ్మక్కుపై కొరడా!



ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందాపై ఉన్నత విద్యామండలి దృష్టి

టాపర్లతో మిలాఖత్ ఆరోపణల నేపథ్యంలో నిర్ణయం

- జాతీయ కాలేజీల్లో సీట్లు పొందిన వారి వివరాల సేకరణ
- ఎంసెట్ సీటు ఆఖరి వరకు ఎందుకు రద్దు చేసుకోవడం లేదు?
- ఆధార్ లింక్ ద్వారా జోసాతో క్రాస్ చెక్ చేయనున్న అధికారులు
- ప్రాథమిక ఆధారాలు లభిస్తే విద్యార్థి సీటు బ్లాక్ చేసేలా చర్యలు
- త్వరలో విధివిధానాల రూపకల్పన

3 లో

20న కొల్లాపూర్‌కు ప్రియాంక..?



అక్కడే కాంగ్రెస్‌లో చేరనున్న జూపల్లి, కూచుకుళ్ల

- ప్రియాంక సభలో మరో 'బిగ్ ప్రామిస్'
- మహిళా ఓటర్లే లక్ష్యంగా భారీ ప్రకటన చేయించే ప్లాన్
- ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, నామినేటెడ్ పదవుల్లో 33 శాతం రిజర్వేషన్ హామీలు ఇచ్చే చాన్స్?

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం వేదికగా లక్షలాది మందితో జనగర్జన సభ నిర్వహించి కొత్త జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ మరో భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఈ నెల 20న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సభ నిర్వహించాలని భావిస్తోంది. ఖమ్మం సభకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా రాగా, కొల్లాపూర్ సభకు ప్రియాంకాగాంధీ హాజరయ్యే అవకాశముంది. ఈ మేరకు కొల్లాపూర్ సభకు హాజరు కావాలని కోరుతూ ప్రియాంకా గాంధీకి రాష్ట్ర కాంగ్రెస్ పక్షాన టీపీసీసీ అధ్యక్షుడు

మిగతా 3వ పేజీలో ▶

ఎంబీబీఎస్ కన్వీనర్ సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకే..

100% సీట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

- తెలంగాణ వైద్య కళాశాలల ప్రవేశ నిబంధనలకు సవరణ
- కొత్తగా వచ్చిన 36 మెడికల్ కాలేజీల్లో అమలు
- రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 520 సీట్లు



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ చదవాలనుకునే రాష్ట్ర విద్యార్థులకు శుభవార్త. తెలంగాణ రాష్ట్ర వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, ఆర్టికల్ 371డీ నిబంధనలకు లోబడి అడ్మిషన్ రూల్స్‌ను సవరించారు. దీని ప్రకారం

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

ప్రధాని వరంగల్ షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈనెల 8న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. శనివారం (8న) ప్రత్యేక విమానంలో ప్రధాని ఢిల్లీ నుంచి బయలుదేరి ఉదయం 9.50కి హకీంపేట విమానాశ్రయంలో దిగుతారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10.35కి వరంగల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఉదయం 10.45 నుంచి 11.20 వరకు వరంగల్‌లో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనడంతోపాటు వివిధ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15కి వరంగల్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.10 గంటలకి తిరిగి హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు.

కిషన్‌రెడ్డి బీజేపీకి లక్కీహ్యాండ్: అర్వింద్



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పరిణితి చెందిన రాజకీయవేత్త అని, కిషన్‌రెడ్డి బీజేపీకి లక్కీ హ్యాండ్ అని, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తెలంగాణవ్యాప్తంగా దూకుడుగా వెళ్తారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పార్టీని గెలిపించడానికే అధినాయకత్వం పలు నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తామంతా కలిసి పనిచేస్తామని, పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని చెప్పారు. 2024లో మూడోసారి మోదీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బండి సంజయ్ తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. తప్పు చేసిన వారిని, అవినీతి చేసిన వారిని జైలులో వేస్తామని మోదీ హామీ ఇచ్చారని, దీనికంటే మంత్రి కేటీఆర్‌కు ఇంకా ఏ హామీ కావాలంటా.. అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ విషయంలో రాజకీయ జోక్యం ఉండదని చెప్పారు. తాను ఒక్కదాన్నే జైలుకు వెళ్లనని, అందరినీ తీసుకువెళ్తామని అందరితో కవిత చెప్పున్నారని పేర్కొన్నారు. పీసుగు లాంటి కాంగ్రెస్ పార్టీ ఎవరినో పార్టీలోకి చేర్చుకుంటే అధికారంలోకి వస్తుందా అని ప్రశ్నించారు.

కేసీఆర్ కోరిక మేరకే కిషన్‌రెడ్డికి అధ్యక్ష పదవి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కోరిక మేరకే కిషన్‌రెడ్డికి బీజేపీ అధ్యక్ష పదవి లభించిందని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. ఇటీవలి పర్యటనలో రాష్ట్రమంత్రి కేటీఆర్, కేంద్రమంత్రి అమిత్‌షాను కలిసిన తర్వాతే వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తికి బీజేపీ అధ్యక్ష పదవి ఇప్పించుకున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ...కిషన్‌రెడ్డి నియామకం, బండి సంజయ్ తొలగింపు ద్వారా బీజేపీకి బీసీలపై ఉన్న ప్రేమను చెప్పకనే చెప్పిందన్నారు. గత మూడేళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన సంజయ్‌ను తొలగించడం బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పట్ల బీజేపీకి ఉన్న నిజమైన ఉద్దేశాన్ని తెలియజేస్తోందని చెప్పారు.

కె.కేశవరావుకు కృతజ్ఞత లేదు

సాక్షి, హైదరాబాద్: ఒక్కసారి కూడా ప్రజాక్షేత్రంలో గెలవలేని కె.కేశవరావుకు మంత్రి పదవి, రాజ్యసభ ఎంపీ, పీసీసీ అధ్యక్ష పదవులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ, గాంధీ కుటుంబం గౌరవించాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డి చెప్పారు. కానీ, కృతజ్ఞత మరచి రాహుల్‌గాంధీని విమర్శించిన బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్ని పదవులు అనుభవించిన తర్వాత కేశవరావు కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు.

ఇదంజగత్








అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ● నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చైర్మన్ పద్మశ్రీ ఏవీఎస్ రాజును సన్మానిస్తున్న రాష్ట్రపతి ముర్ము, సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ● అల్లూరి సీతారామరాజు విగ్రహ దాత అల్లూరి సీతారామరాజుకు జ్ఞాపికను అందిస్తున్న రాష్ట్రపతి ● హకీంపేట ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలుకుతున్న కేసీఆర్

అల్లూరి పోరాటం దేశానికి స్ఫూర్తిదాయకం

▶ మొదటి పేజీ తరువాయి

ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు ఉత్సవాలను మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్రపతి తొలుత అల్లూరి ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి అర్పించారు. మన్యంలోని గిరిజనులకు ఇళ్లు కట్టించిన పద్మశ్రీ ఏవీఎస్ రాజు, అల్లూరి సీతారామరాజు 30 అడుగుల విగ్రహాన్ని ఇచ్చిన దాత అల్లూరి సీతారామరాజులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. భీమవరంలోని అల్లూరి స్మృతివనాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన త్రీడీ చిత్రాన్ని ప్రదర్శించారు. కాగా తెలుగులో 'అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు' అంటూ రాష్ట్రపతి తన ప్రసంగాన్ని ప్రారంభించారు.

అల్లూరి దేశభక్తిని యువతకు తెలియజేయాలి

'దేశ ప్రజలందరి తరఫున అల్లూరి సీతారామ రాజుకు నివాళులర్పించడం గౌరవంగా భావిస్తున్నా. అల్లూరి గొప్ప దేశభక్తిని యువతకు తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. భారత స్వాతంత్య్ర ఉద్యమంలో సర్దార్ భగత్‌సింగ్ ఏవిధంగా ఆత్మగౌరవానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచారో..అదే రీతిలో దేశ ప్రజలకు అల్లూరి సైతం ఎప్పటికీ గుర్తుంటారు. స్వాతంత్య్ర సంగ్రామంలో భాగంగా అల్లూరి చేసిన పోరాటాలు భవిష్యత్ తరాలకు సైతం స్ఫూర్తిగా నిలిచేలా ఉన్నాయి. పర్వతాల్లో, అడవుల్లో ఉండే గిరిజనుల్లో స్వాతంత్య్ర స్ఫూర్తిని రగల్చడం తోపాటు వారిని యుద్ధవీరులుగా తీర్చిదిద్దారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై తెలుగులో రూపొందించిన ఓ సినిమా కోసం ప్రముఖ కవి శ్రీశ్రీ రాసిన 'తెలుగు వీర లేవరా..దీక్షబూని సాగరా..' గీతం తెలుగు ప్రాంతంలోని చిన్నారులకు సైతం సుపరిచితం. బ్రిటిష్ సైన్యాన్ని పలుమార్లు ఓటమిపాలు చేయడంతోపాటు స్థానికులపై బ్రిటిష్ అధికారుల అరాచకాలపై అల్లూరి యుద్ధభేరి మోగించారు. సామాజిక అసమానతలపై అల్లూరి చేసిన పోరాటం యావత్ దేశానికి స్ఫూర్తిదాయకం. ప్రజల కష్టనష్టాలను తన కష్టాలుగా భావించిన గొప్ప నాయకుడు అల్లూరి. ప్రజల హక్కుల కోసం, స్వాతంత్య్రం కోసం పోరాడుతూనే ఆయన వీరమరణం పొందారు. బ్రిటిష్ అధికారులు ఎంత హింసించినా మన్యం ప్రజలెవరూ ఆయన జాడ చెప్పలేదు. అంతలా ఆయన జననాయకుడయ్యారు. అలాంటి గొప్ప నాయకుడిని ఎప్పటికీ గుర్తుంచుకోవడం దేశ ప్రజలందరి బాధ్యత..' అని రాష్ట్రపతి చెప్పారు. 'జై అల్లూరి సీతారామరాజు' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

తెలుగు వీరుడి గురించి చెప్పేందుకు తెలుగులో ప్రసంగం: గవర్నర్

తెలుగు వీరుడు అల్లూరి కీర్తిని చెప్పేందుకు తాను పూర్తిగా తెలుగులోనే ప్రసంగిస్తున్నట్టు గవర్నర్ తమిళిసై తెలిపారు. 'అల్లూరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం ఆయనకు మనం ఇచ్చే గొప్ప నివాళి. ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయి. సీతారామరాజు వంటి గొప్పవారి చరిత్రలు చెప్పుకున్నప్పుడు ప్రజాస్వామ్యం విలువ మరింత తెలుస్తుంది. స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో మన్యం ప్రజల్లో స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తిని రగల్చడంతో పాటు వారిని యుద్ధవీరులుగా తీర్చిదిద్దిన నాయకుడు అల్లూరి. గిరిజనుల అభివృద్ధికి వివిధ పథకాలు అమలు చేస్తున్నందుకు ప్రభుత్వాలను అభినందిస్తున్నా..' అని తమిళిసై పేర్కొన్నారు.

సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఉండే వీరుడు: కిషన్‌రెడ్డి

'చరిత్రను ఆవిష్కరించే మహనీయుల్లో అల్లూరి సీతారామరాజు ఒకరు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు విస్మరించలేని తెలుగు వీరుడు. యావత్ ప్రపంచానికి తెలుగు కీర్తిని చాటిన శూరుడు. గత ప్రభుత్వాలు విస్మరించినా.. అల్లూరిని దేశం గుర్తు చేసుకునేలా ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా ఏడాదిపాటు నిర్వహించేలా చర్యలు తీసుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీలకు తెలుగువారందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా..' అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అల్లూరి 125వ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించిన కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు పేరిచర్ల నాగరాజు, కార్యదర్శి నానిరాజు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కేసీఆర్ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ తరఫున కిషన్‌రెడ్డి రాష్ట్రపతికి విల్లు, బాణాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతికి హకీంపేటలో గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వాగతం పలికారు.

గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన మహాయోధుడు: సీఎం కేసీఆర్

'అహింసా సిద్ధాంతాన్ని ప్రవచించిన మహాత్మా గాంధీ సైతం.. 'అల్లూరి సీతారామరాజును నేను ప్రశంసించకుండా ఉండలేను' అని చెప్పినట్టు పలు రికార్డుల్లో ఉంది. ఎక్కడైతే పీడన, దోపిడీ జరుగుతుందో అక్కడ దైవాంశ సంభూతులైన మహానుభావులు జన్మిస్తారన్న భగవద్గీత సందేశాన్ని నిరూపించేలా అల్లూరి సీతారామరాజు జీవితం ఉంటుంది. బ్రిటిష్ బానిస బంధాల్లో చిక్కుకుని భరతజాతి నలుగుతున్న వేళలో విప్లవ జ్యోతిలా అవతరించిన వీర యోధుడు అల్లూరి. గడ్డిపరకలను గడ్డపారలుగా మార్చిన మహాయోధుడు. 26 ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన తెలుగు జాతి వీరుడు. భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, ఆజాద్ చంద్రశేఖర్ వంటి గొప్ప పోరాట యోధుల సరసన మన తెలుగు జాతిని నిలబెట్టిన గొప్పవీరుడు. చివరకు చనిపోతూ కూడా ఒక్క అల్లూరి మరణిస్తే..వేలాది మంది అల్లూరి సీతారామరాజులు ఉద్భవిస్తారంటూ స్ఫూర్తిని చాటారు. హీరో కృష్ణ నిర్మించిన అల్లూరి సీతారామరాజు చిత్రంలో ప్రముఖ కవి శ్రీశ్రీ రాసిన 'తెల్లవారి గుండెల్లో నిదురించిన వాడా..మా నిదురించిన పౌరుషాగ్ని రగిలించిన వాడా..' అన్న పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. తెలంగాణ ఉద్యమ సమయంలో కారులో ప్రయాణించేటప్పుడు ఎక్కువసార్లు ఈ పాట వినేవాడిని. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, మంత్రి కిషన్‌రెడ్డికి తెలుగువారందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా..' అని సీఎం కేసీఆర్ అన్నారు.

గవర్నర్, సీఎం మాటామంతి

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్ మధ్య పలు అంశాలపై అంతరం నెలకొన్నప్పటికీ మంగళవారం వారిద్దరూ మాట్లాడుకుంటూ కనిపించడం సర్వత్రా ఆసక్తి రేపింది. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం హైదరాబాద్ వచ్చిన సందర్భంగా దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ విమానాశ్రయంలో తమిళిసై, సీఎం కేసీఆర్ మాట్లాడుకుంటూ కనిపించారు. రాష్ట్రపతి ప్రత్యేక ఎయిర్‌ఫోర్స్ విమానం రాక కోసం ఎయిర్‌పోర్టులో వేచి ఉన్న సమయంలో తమిళిసై, కేసీఆర్ ఏదో అంశాన్ని చర్చిస్తున్నట్లు కనిపించింది. రాష్ట్రపతికి స్వాగతం పలకడానికి సీఎం కంటే ముందే గవర్నర్ విమానాశ్రయానికి రావడం, ఆమె కూర్చున్న పక్కనే ఉన్న సోఫాలో సీఎం కూడా కూర్చొని మాట్లాడుకోవడం గమనార్హం.

ఇన్‌చార్జిగా భూపేంద్రయాదవ్?

- బీజేపీ ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్ స్థానంలో నియమించే అవకాశం
- అధ్యక్ష మార్పు అనంతరం నడ్డాతో భూపేంద్ర భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బీజేపీని గద్దెనెక్కించాలనే దృఢసంకల్పంతో ఉన్న ఆ పార్టీ అధిష్టానం అసెంబ్లీ ఎన్నికల వ్యూహానికి పదునుపెడుతోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను మార్చి ఆయన స్థానంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించిన అధిష్టానం మరో కీలక మార్పు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ట్రబుల్‌షూటర్‌గా పేరున్న కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్‌ను రంగంలోకి దించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న తరుణ్ ఛుగ్‌ను తొలగించి ఆయన స్థానంలో భూపేంద్ర యాదవ్‌ను పంపిస్తారని ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై పట్టున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయనను క్రియాశీలం చేయనున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తర్వాత భూపేంద్ర నాలుగో స్థానంలో ఉన్నారు. యూపీ, బిహార్, హరియాణాల్లో భూపేంద్ర యాదవ్ రచించిన వ్యూహాలు పార్టీ విజయానికి బాటలు వేశాయి. 2019 ఎన్నికల్లోనూ దేశవ్యాప్తంగా బీజేపీకి ఎక్కువ సీట్లు రావడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై మరో రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నడ్డాతో భేటీ..

రాష్ట్ర అధ్యక్ష మార్పు ప్రకటన వెలువడిన సమయంలో భూపేంద్రయాదవ్ ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉన్నారు. ప్రకటన వెలువడటానికి కొద్దిగంటల ముందు జేపీ నడ్డాతో బండి సంజయ్ భేటీ అయిన సమయంలో కూడా భూపేంద్రయాదవ్ ఉన్నారు. ఈ సమయంలోనే రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతలపై చర్చ జరిగినట్లుగా తెలుస్తోంది. సుమారు గంటపాటు నడ్డా, యాదవ్ తెలంగాణ రాజకీయాలపై గంటపాటు చర్చించుకున్నట్లుగా సమాచారం.

సమర్థవంతంగా సమన్వయం!

ఇదే అంచనాతో కిషన్‌రెడ్డికి బీజేపీ బాధ్యతలు

- కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో పార్టీలో స్తబ్ధతపై అధిష్టానం దృష్టి
- బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్‌ను సమర్థంగా ఎదుర్కొంటారనే ఈటలకు కీలక పదవి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఓసీ, బీసీ సామాజికవర్గాల వారీగా సమతూకం పాటిస్తూ బీజేపీ తాజా నియామకాలు జరిగాయని చెబుతున్నారు. పార్టీలోని సీనియర్లు, కొత్తగా చేరిన నేతలు, పాతతరం నాయకులు, కార్యకర్తలు అందరినీ సమర్థవంతంగా సమన్వయం చేస్తారనే అంచనాతోపాటు, పార్టీ అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన అనుభవం పరిగణనలోకి తీసుకుని కిషన్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. ఎన్నికల వేళ అధికార బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్ వ్యూహాలు, కార్యాచరణను, రాజకీయాలను సమర్థంగా ఎదుర్కొంటారనే భావనతో పాటు వివిధ వర్గాల ప్రజల్లో పట్టును పరిగణనలోకి తీసుకుని ఈటల రాజేందర్‌కు ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించారని అంటున్నారు. మరో నాలుగైదు నెలల్లోనే ఎన్నికలు జరగనున్నందున రాష్ట్రపార్టీని పూర్తిస్థాయిలో సమాయత్తం చేసేందుకు మరిన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం కూడా ఉందని సమాచారం.

పార్టీలో స్తబ్ధత, అసంతృప్తి నేపథ్యంలో..

కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో రాష్ట్ర పార్టీలో స్తబ్ధత నెలకొంది. మరోవైపు నేతల మధ్య సమన్వయ లేమి, రాష్ట్రనాయకత్వం తీరుపై నాయకుల్లో అసంతృప్తి పెరగడం వంటివి చోటు చేసుకున్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో అయోమయం, గందరగోళం నెలకొంది. దీనికి తోడు గత కొంతకాలంగా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యవహారశైలిపై పలువురు అసంతృప్త నేతలు జాతీయ నాయకత్వానికి ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ముఖ్యనేతలతో సమన్వయం లేకపోవడం, వారికి తగిన ప్రాధాన్యత, గుర్తింపునివ్వకపోవడం తదితర అంశాలను అధిష్టానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే కొందరు ముఖ్యనేతలు గ్రూపులు, వర్గాలను మెయింటెన్ చేయడం, ఎవరికి వారు ఇష్టారీతిన వ్యాఖ్యానాలు, పరస్పర విమర్శలు, ఆరోపణలకు దిగడాన్ని బీజేపీ అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే గత కొద్దిరోజులుగా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు, జాతీయ కార్యవర్గసభ్యులు, ఇతర నాయకులతో అగ్రనేతలు అమిత్‌షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్, శివప్రకాష్ దశల వారీగా సంప్రదింపులు జరిపారు. సమస్యలన్నీ అధిగమించేందుకు ఏమి చేయాలన్న దానిపై అభిప్రాయాలు సేకరించారు. ఈ నేపథ్యంలోనే అధ్యక్షుడి మార్పు, ఇతర నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. కర్ణాటకలో బీజేపీ నాయకులు ఎవరికి వారే యమునే తీరే అన్నట్టుగా వ్యవహరించడం, సమన్వయ లేమి కారణంగా ఎన్నికల్లో తీరని నష్టం జరగడాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి గడ్డు పరిస్థితి ఎదుర్కోకూడదనే భావనతో తాజా మార్పులకు నాయకత్వం శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డిని, ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటలను నియమించవచ్చని కొన్నిరోజులుగా జరుగుతున్న ప్రచారం చివరకు వాస్తవ రూపం దాల్చింది.

తనదైన ముద్ర వేసినా...

మూడేళ్ల మూడునెలలకు పైగా రాష్ట్ర అధ్యక్ష పదవిలో కొనసాగిన బండి సంజయ్ తనదైన ముద్రను బలంగానే వేశారని పార్టీ నేతలు కొందరు చెబుతున్నారు. 'రాష్ట్ర పార్టీలో ఫుల్‌జోష్‌ను నింపడంలో సఫలీకృతమయ్యారు. బీఆర్ఎస్ పాలనపై, సీఎం కేసీఆర్ తీరుపై, ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉద్రేకపూరిత ప్రసంగాల ద్వారా అధికార పార్టీకి బీజేపీయే ప్రత్యామ్నాయ చర్చ ప్రజల్లో జరిగేట్టు చేశారు. ప్రజాసంగ్రామ యాత్ర పేరిట పాదయాత్ర చేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు..' అని అంటున్నారు. అయితే ఎప్పుడూ తానే ఫోకస్‌లో ఉండాలనే సంజయ్ ప్రయత్నం.. ముఖ్యనేతల్లో అసంతృప్తికి కారణమయ్యిందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా సంజయ్‌పై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో పాదయాత్ర ఒక్కటే ఎందుకు మోటర్‌సైకిల్ యాత్రలు, జీపు యాత్రలు, ఇతరత్రా రూపాల్లో ప్రజల వద్దకు వెళ్లాలంటూ అమిత్‌షా సూచించారు. ఆ తర్వాత కూడా ఒకట్రెండు విడతల పాదయాత్రలు సాగడం, వాటిలోనూ సంజయ్ తీరు మారకపోవడం, ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో.. మొత్తం రాష్ట్రాన్ని పాదయాత్రల ద్వారా కవర్ చేయడం సాధ్యం కాదంటూ ప్రజాసంగ్రామ యాత్రకు హైకమాండ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. మూడేళ్ల పదవీ కాలం ముగిశాక ఆయనను కొనసాగిస్తున్నట్టు అధికారిక ప్రకటన చేయలేదు. కానీ నాయకత్వ మార్పు జరిగేదాకా ఆయనే కొనసాగుతారనే సంకేతాలు ఇచ్చింది. అయితే రాష్ట్రంలో ప్రస్తుత పరిణామాలు, పార్టీ పరిస్థితి, నేతల్లో పెరుగుతున్న అసంతృప్తిని పరిగణనలోకి తీసుకుని గడువు ముగిసిన దాదాపు నాలుగు నెలలకు రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై నిర్ణయం తీసుకుంది.

కమల దళపతి కిషన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార బీఆర్ఎస్‌ను ఢీ కొట్టాలంటే మార్పు చేర్పులు అవసరమని కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి సూచించారు. రాష్ట్ర నాయకత్వంపై తమ అసంతృప్తిని కొందరు అగ్రనేతల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే సమయంలో నేతల మధ్య సమన్వయ లేమిని జాతీయ నాయకత్వం పరిగణనలోకి తీసుకుందని, సంజయ్‌ను తప్పించాలనే నిర్ణయానికి వచ్చిందని సమాచారం. కాగా ఈటల రాజేందర్, డీకే అరుణ సహా మరొకొందరి పేర్లు పరిశీలించిన బీజేపీ అధిష్టానం చివరికి పార్టీలో సుదీర్ఘ అనుభవం, అణుకువ, విధేయతలు ప్రామాణికంగా తీసుకుని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. యువ మోర్చా రాష్ట్ర, జాతీయ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించడం, మూడుసార్లు ఎమ్మెల్యే ఉండటం, గతంలోనూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయడం, ఎంపీగా గెలిచి కేంద్రమంత్రిగా ఉండటం, అన్నింటికన్నా ముఖ్యంగా తెలంగాణలో బలంగా ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కిషన్‌రెడ్డి వైపే అధిష్టానం మొగ్గ చూపింది. అయితే కిషన్‌రెడ్డిని కేంద్ర మంత్రిగా కొనసాగిస్తారా? లేక తొలగిస్తారా? అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీలో జోడు పదవుల వ్యవహారం లేనందున ఆయన్ను కేంద్ర కేబినెట్ నుంచి తొలగిస్తారని ప్రచారం జరుగుతున్నా దీన్ని ఎవరూ ధ్రువీకరించడం లేదు. దీనిపైనా రెండు, మూడురోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

నడ్డాతో సంజయ్ భేటీ

రాష్ట్ర అధ్యక్షుడి మార్పు సహా పలు ఇతర అంశాలపై చర్చించేందుకు అధిష్టానం పెద్దల పిలుపు మేరకు ఢిల్లీకి వచ్చిన బండి సంజయ్ మంగళవారం మధ్యాహ్నం పార్టీ జాతీయ కార్యాలయంలో జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలోనే అధ్యక్ష పదవికి సంజయ్ రాజీనామాను తీసుకున్నారు. కొత్త అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి ఎంపికకు గల కారణాలు, ముున్ముందు పార్టీలో, కేంద్ర పదవుల్లో కల్పించే ప్రాధాన్యం, ఇతర అంశాలను సంజయ్‌కు నడ్డా వివరించారు. కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో చోటు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నా దీనిపై స్పష్టత రాలేదు. భేటీ అనంతరం సంజయ్ మీడియాతో మాట్లాడకుండానే అక్కడినుంచి వెళ్లిపోయారు. ఇక అదే సమయంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు సైతం నడ్డాతో భేటీ అయినట్లు తెలిసింది. ఎస్టీ సామాజికవర్గం నుంచి ఆయనకు కేబినెట్‌లో చోటు దక్కుతుందని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్న సమయంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

అన్నీ పరిగణనలోకి తీసుకుని ఈటలకు బాధ్యతలు

రాష్ట్ర అధ్యక్ష పదవికి తొలినుంచీ బలమైన పోటీదారుగా ఉన్న ఈటల రాజేందర్‌ను అత్యంత కీలకమైన ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా బీజేపీ నియమించింది. రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడం, అందులోనూ అత్యంత కీలకమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారవడం, సీఎం కేసీఆర్‌ను ఎదిరించి పార్టీలోంచి బయటకు వచ్చి పోరాడుతున్న నేతగా పేరుండటం, అన్ని పార్టీలు, వర్గాలు, తెలంగాణ ఉద్యమ సంఘాలతో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం ఈటల ఎంపికకు కలిసొచ్చిందని చెబుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకునే ఎన్నికల ప్రచార బాధ్యతలు, వ్యూహాల ఖరారు, అభ్యర్థుల ఎంపిక అంశాలపై పట్టు ఉండే ఎన్నికల నిర్వహణ కమిటీ బాధ్యతలు ఆయనకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

పగ్గాల మార్పుకే మొగ్గు?



బీజేపీలో పగ్గాల మార్పుపై గతంలోనే సాక్షి ప్రచురించిన కథనం

శభాష్ అనేలా పనిచేస్తాం

కేసీఆర్ బలం, బలహీనతలు తెలుసు: ఈటల



సాక్షి, హైదరాబాద్: తనపై విశ్వాసముంచి బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీ, జేపీ నడ్డా, కేంద్రమంత్రి అమిత్ షా, జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌లకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు. 'తెలంగాణ అంతరంగం, సమస్యలు తెలిసినవాడిని. కేసీఆర్ బలం, బలహీనతలు తెలుసు. ఒక కార్యకర్తగా నా బాధ్యత తను సంపూర్ణంగా నిర్వహిస్తా. కిషన్‌రెడ్డి సీనియర్ నాయకులు.. ఆయనతో కలిసి పని చేస్తాం' అని ఈటల పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు నడ్డా, అమిత్ షా తెలంగాణ గడ్డ మీద బీజేపీ జెండా ఎగురేయాలని నేషనల్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లోనే అంకురార్పణ చేశారన్నారు. బండి సంజయ్ నాయకత్వంలో నాలుగు ఎన్నికల్లో గెలిచాం..తెలంగాణలో గెలిస్తే బీజేపీ.. లేదంటే బీఆర్ఎస్ గెలిచింది తప్ప కాంగ్రెస్ గెలవలేదు. బీఆర్ఎస్‌ను ఓడించే సత్తా ఒక్క బీజేపీకి మాత్రమే ఉంది. బీఆర్ఎస్ గెలిస్తే ఒక కుటుంబానికి లాభం. బీజేపీ గెలిస్తే ప్రజలకు లాభం. దేశానికి ఒక ఓబీసీ ప్రధానిని అందించిన పార్టీ బీజేపీ. అధిష్టానం మా మీద పెట్టిన విశ్వాసాన్ని శక్తి వంచన లేకుండా నిలుపుకుంటాం. కిషన్‌రెడ్డితో కలిసి శభాష్ అనే విధంగా పని చేస్తాం' అని ఈటల స్పష్టం చేశారు.

స్వయం కృషితో అంచెలంచెలుగా..

గంగాపురం కిషన్‌రెడ్డి ప్రస్థానం

సాక్షి, హైదరాబాద్: గంగాపురం కిషన్‌రెడ్డి.. స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగిన నేత. బీజేపీ అగ్ర నాయకత్వం మోదీ, అమిత్‌షా, నడ్డాలకు అత్యంత విశ్వసపాత్రుడిగా, మోదీ, అమిత్‌షాలకు సన్నిహితుడిగా పేరు గడించారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో ఎంపీ అయ్యారు. మోదీ కేబినెట్‌లో హోంశాఖ సహాయ మంత్రి పదవిని చేపట్టారు. తర్వాత కేబినెట్ మంత్రిగా ప్రమోషన్ పొంది పర్యాటక, సాంస్కృతిక శాఖ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు.

సామాన్య రైతు కుటుంబంలో జన్మించి..

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ అనే గ్రామంలో 15 మే 1964 మే 15న ఓ సామాన్య రైతు కుటుంబంలో కిషన్‌రెడ్డి జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గంగాపురం స్వామిరెడ్డి, ఆండాళమ్మ. కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో ఉన్నత పాఠశాల విద్యాభ్యాసం, పాతపట్నంలో ఇంటర్, కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఐటీడీలో టూల్ ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేశారు. 17 ఏళ్ల వయసులో తాను చదువుతున్న ఉన్నత పాఠశాల అధ్యక్షుడిగా గెలుపొందారు. విద్యార్థి దశలోనే జయప్రకాష్ నారాయణ్ స్ఫూర్తితో జనతా పార్టీలో చేరారు. 1980లో బీజేపీలో చేరి 1994 వరకు 15 ఏళ్లు రాష్ట్ర బీజేపీ కార్యాలయంలోనే నివాసం ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. యువమోర్చాలో కిందిస్థాయి మొదలుకుని జాతీయ అధ్యక్షుడి వరకు ఎదిగారు. 1994లో యువమోర్చా జాతీయ కార్యదర్శిగా అమెరికా ప్రభుత్వ ఆహ్వానం మేరకు నాడు గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న నేటి ప్రధాని మోదీతో కలిసి 45 రోజుల పాటు ఆ దేశంలో పర్యటించారు. 2004 నుంచి 2019 వరకు వరుసగా మూడుసార్లు హిమాయత్‌నగర్, అంబర్‌పేట్ శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టారు. 2019 ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై పార్లమెంటులో అడుగు పెట్టారు.

10న ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: గత నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఈ నెల 10వ తేదీన వెల్లడించేందుకు ఇంటర్ బోర్డ్ సన్నాహాలు చేస్తోంది. మూల్యాంకన ప్రక్రియ పూర్తయిందని, రెండురోజుల్లో క్రాస్‌చెక్ అయిపోతుందని, ఆ తర్వాత సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కి అప్‌లోడ్ చేస్తామని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఈ ఏడాది మే నెలలో వెల్లడించిన ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో 1.50 లక్షల మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. వీళ్లంతా ఫెయిలైన సబ్జెక్టుకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష రాశారు. ఫెయిలైన వారితోపాటు మార్కులు పెంచుకునేందుకు ఇంప్రూవ్‌మెంట్ రాసిన వాళ్లు మొత్తం 4.50 లక్షల మంది ఉన్నారు. రెండేళ్లకు కలిపి 10 లక్షల పేపర్లకు మూల్యాంకనం నిర్వహించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాలు వెల్లడయితే తప్ప, విద్యార్థులు డిగ్రీ సీట్లకు నిర్వహించే దోస్త్, ఇంజనీరింగ్‌కు నిర్వహించే ఎంసెట్‌లో పాల్గొనే వీలుండదు. ఇప్పటికే దోస్త్ రెండు దశలు పూర్తయింది. ఎంసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ అయిపోయింది. ఈ నేపథ్యంలో త్వరగా ఫలితాలు వెల్లడించాలని సన్నాహాలు చేస్తున్నామని ఇంటర్ పరీక్షల విభాగం అధికారి జయప్రదాభాయ్ తెలిపారు.

11లోపు ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు కూడా ఈ నెల 11లోపు వెల్లడించనున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రశ్నపత్రాల మూల్యాంకనం పూర్తయిందని, ఫలితాల వెల్లడికి సంబంధించిన ప్రక్రియకు సిద్ధమవుతున్నట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 71,738 మంది టెన్త్ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. ఇందులో ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌లో అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది.



మంగళవారం హుస్సేన్ సాగర్ వేదికగా హైదరాబాద్ సెయిలింగ్ వీక్ ప్రారంభమైంది.
ఈ సందర్భంగా సెయిలింగ్ చేస్తున్న క్రీడాకారులు..

కొన్ని అధ్యాయాలకు ముగింపు లేకున్నా ముగించాల్సి వస్తుంది..

పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా తర్వాత బండి సంజయ్ ఉద్వేగభరిత ట్వీట్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా తన స్థానంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించడంతో బండి సంజయ్ ఉద్వేగభరితమైన ట్వీట్ చేశారు. 'మన జీవితాల్లో కొన్ని అధ్యాయాలకు ముగింపు లేకున్నా ముగించాల్సి వస్తుంది' అంటూ పేర్కొన్నారు. తన పదవీకాలంలో ఒక వేళ ఎవరినైనా అనుకోకుండా బాధపెట్టి ఉన్నప్పటికీ అన్యదా భావించకుండా అందరి ఆశీస్సులను కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. తనది బాధాకర కథ కానందున సంతోషంగా ఉన్నానని.. తనపై దాడులు, అరెస్టుల సమయంలో నేతలంతా అండగా నిలిచి తనకు మధురానుభూతులు మిగిల్చారన్నారు. కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా తాను చేసిన పోరాటంలో అరెస్టులు, దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఎదురొడ్డి నిలబడ్డ బీజేపీ కార్యకర్తలందరికీ హ్యాట్సాఫ్ తెలుపుతున్నానన్నారు. సుఖదుఃఖాల్లో కార్యకర్తలంతా తన వెంట నిలిచారని... తాను సైతం ఎల్లప్పుడూ వారిలో ఒకడిగా ఉన్నానని బండి సంజయ్ పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి సారథ్యంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానన్నారు.

అవకాశం ఇచ్చిన అగ్రనేతలకు ధన్యవాదాలు...

తనలాంటి సాధారణ కార్యకర్తకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసే గొప్ప అవకాశం ఇచ్చినందుకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్, శివప్రకాశ్, తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్, అరవింద్ మీనన్‌లకు బండి సంజయ్ ధన్యవాదాలు తెలిపారు. కాగా, బండి సంజయ్‌ను పదవి నుంచి తప్పించడాన్ని తట్టుకోలేక బీజేపీ ఖమ్మం టౌన్ ఉపాధ్యక్షుడు గజ్జెల శ్రీనివాస్ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.

బీజేపీ పరిణామాలపై నాయకుల స్పందనలు ఇలా...

- 'బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా నియమితులైన జి.కిషన్‌రెడ్డికి అభినందనలు... బండి సంజయ్ నాయకత్వంలో పార్టీ బాగా పనిచేసింది. కిషన్‌రెడ్డి నేతృత్వంలో అధికారాన్ని సాధిస్తుంది'
  – దుబ్బాక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు
- బండి సంజయ్ మార్పు బాధాకరమే అయినా, పార్టీ మరింత మంచి బాధ్యతను ఆయనకు అప్పగిస్తుందని భావిస్తున్నా.
  – బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి
- బండి మార్పుపై కార్యకర్తలు భావోద్వేగాలకు గురికావొద్దు. ఎవరూ ఎలాంటి చర్యలకు దిగొద్దు. సంజయ్‌కు పార్టీనాయకత్వం సముచిత గౌరవం కల్పిస్తుంది.
  – బీజేపీ నేత, తమిళనాడు సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకరరెడ్డి

ఢిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డి...

హంపిలో జరగనున్న జీ–20 సమావేశాల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం బెంగళూరుకు వెళ్లేందుకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చివరకు ఢిల్లీ పయనమయ్యారు. ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో పాటు బుధవారం కేంద్ర కేబినెట్ భేటీ నేపథ్యంలో అక్కడకు వెళ్లినట్టు పార్టీవర్గాల సమాచారం. తెలంగాణ బీజేపీ అధ్యక్ష బాధ్యతలను అప్పగిస్తూ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో...దానిపై ఆయన మీడియాతో ఎలాంటి కామెంట్ చేసేందుకు ఇష్టపడలేదు. రెండు మూడు చోట్ల ఆయన స్పందన తెలుసుకునేందుకు ప్రయత్నించినా మౌనమే సమాధానమైంది.

బండి ఛాంబర్ ఖాళీ...ఆఫీస్ కారు అప్పగింత...

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా తనకు అందిన ఫార్చునర్ వాహనాన్ని పార్టీ కార్యాలయానికి బండి సంజయ్ తిప్పి పంపించారు. అదే విధంగా నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడి చాంబర్‌ను ఖాళీ చేశారు.

బండి అవినీతిపై విచారణ జరపాలి

పోలీసులకు కరీంనగర్ కార్పొరేటర్ ఫిర్యాదు

కరీంనగర్: బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు.. ఆ పార్టీ ఎంపీ బండి సంజయ్‌పై చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని బీఆర్ఎస్ కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్ సోహన్‌సింగ్ కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమల్‌జిత్‌కౌర్ సోహన్‌సింగ్ మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్ పుస్తెలు అమ్మి పోటీ చేశానని చెప్పారని.. ఇప్పుడు వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలన్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

'బీజేపీకి బీసీలు గుణపాఠం చెబుతారు'

కాచిగూడ (హైదరాబాద్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బలహీన వర్గాలను బలిచేస్తోందని.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి బలహీన వర్గాల ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు హెచ్చరించారు. ఆయా మంగళవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్ష స్థానం నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు.

క్లుప్తంగా...

నీట్ ఉచిత మెంటార్ షిప్ టెస్ట్

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యలో ప్రవేశానికి నిర్వహించే నీట్–2024కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత మెంటార్ షిప్ టెస్ట్ సిరీస్ అందిస్తున్న మెటామైండ్ అకాడమీ పోస్టర్‌ను కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. బైపీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంస్థ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8522958575 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

ఇగ్నో ప్రవేశాల గడువు 15 వరకు పొడిగింపు

నాంపల్లి (హైదరాబాద్): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 విద్యా సంవత్సరానికి వివిధ రకాల ప్రోగ్రాములైన సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ ప్రోగ్రాములో చేరడానికి ప్రవేశ గడువు పొడిగించినట్లు ఇగ్నో హైదరాబాదు ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ కె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందాలని సూచించారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్ 9492451812, 040–23117550 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

ఐఓపీఆర్ రీసెర్చ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా నీరజ



సాక్షి,హైదరాబాద్: భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ (ఐఓపీఆర్) రీసెర్చ్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్ ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఉద్యాన విజ్ఞాన డివిజన్ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. రైతులకు ఆయిల్ పామ్ సాగు లాభసాటిగా ఉండేందుకు అవసరమైన పరిశోధన, తదితర సాంకేతిక అంశాలను ఈ కమిటీ చర్చించనుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆయిల్ పామ్ సాగుకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు.

త్వరలో హెచ్‌ఆర్‌సీ చైర్మన్, సభ్యుల నియామకం

హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: వీలైనంత త్వరలో మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) చైర్మన్, సభ్యుల నియామక ప్రక్రియ ప్రారంభిస్తామని, కొద్ది రోజులు గడువిస్తే వివరాలు వెల్లడిస్తామని హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది. దీనికి అనుమతించిన న్యాయస్థానం విచారణను జూలై 21కి వాయిదా వేసింది. హెచ్‌ఆర్‌సీలో ఖాళీల కారణంగా దాదాపు 6 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి పరిష్కారం కావాలంటే భర్తీ త్వరగా చేపట్టాల్సి ఉందని, ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది అద్నాన్ మహమూద్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం.. జూలై 21 వరకు సమయం ఇస్తూ ఆదేశాలు ఇచ్చింది.

వాళ్లు ఓటర్లు కాదని పట్టించుకోరా: హైకోర్టు

మెంటల్ హెల్త్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయకపోవడంపై ఘాటు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: 'ఓటర్లు కాదని మానసిక అనారోగ్యంతో బాధపడే వారికి ఆరోగ్య సంరక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయరా' అని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్య చేసింది. 'చట్టప్రకారం కాకపోయినా.. మానవతా దృక్పథంలో ఆలోచించైనా ఆ కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు కదా' అని సూచించింది. మానసిక అనారోగ్యంతో బాధపడే వారి కోసం ఆరోగ్య సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చట్టంలోఉన్నా జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదని, వాటిని ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఇంటిగ్రేటెడ్ న్యూ లైఫ్ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎన్ఎస్ ఈడీ) హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణకు సదరు చట్టంలో ఏముంది? ఏం చెబుతోంది? గత జడ్జిమెంట్లు ఏమైనా ఉన్నాయా లాంటి వివరాలతో రావాలని పిటిషనర్ న్యాయవాదికి సూచించింది.

కుమ్మక్కుపై కొరడా!

ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందాపై ఉన్నత విద్యామండలి దృష్టి

- టాపర్లతో మిలాఖత్ ఆరోపణల నేపథ్యంలో నిర్ణయం.. జాతీయ కాలేజీల్లో సీట్లు పొందిన వారి వివరాల సేకరణ
- ఎంసెట్ సీటు ఆఖరి వరకు ఎందుకు రద్దు చేసుకోవడం లేదు?
- ఆధార్ లింక్ ద్వారా జోసాతో క్రాస్ చెక్ చేయనున్న అధికారులు
- ప్రాథమిక ఆధారాలు లభిస్తే విద్యార్థి సీటు బ్లాక్ చేసేలా చర్యలు
- త్వరలో విధివిధానాల రూపకల్పన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందాకు చెక్ పెట్టేందుకు ఉన్నత విద్యా మండలి కసరత్తు మొదలుపెట్టింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న టాపర్స్ జాబితాపై దృష్టి పెట్టనుంది. జేఈఈ ద్వారా జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పొంది, జోసా కౌన్సెలింగ్ ద్వారా వాటిల్లో చేరిన వారి వివరాలు సేకరించాలని యోచిస్తోంది. ఇదే విద్యార్థులు రాష్ట్ర ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొంది, చివరలో రద్దు చేసుకోవడం వెనుక కథేంటో తేల్చాలని నిర్ణయించింది. ప్రైవేటు కాలేజీలతో కుమ్మక్కయినట్లు బయటపడితే కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. దీనిపై ఇప్పటికే ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించిన మండలి త్వరలో ఇందుకు సంబంధించిన విధివిధానాలకు రూపకల్పన చేయనుంది.

ర్యాంకర్లకు కాలేజీల వల: జేఈఈ, ఎంసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన రాష్ట్ర విద్యా ర్థులు అటు ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగే కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నారు. ముందుగా రాష్ట్ర ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలవుతుంది. దీంతో డిమాండ్ ఎక్కువగా ఉన్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్, డేటాసైన్స్ వంటి కోర్సుల్లో తొలి విడత కౌన్సెలింగ్‌లోనే సీట్లు పొందుతున్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ కూడా చేస్తున్నారు. ఆ తర్వాత వీరికి జోసా కౌన్సెలింగ్‌లోనూ సీట్లు వస్తున్నాయి. వాటిల్లోనూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేస్తున్నారు. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా పొందిన సీటును రద్దు చేసుకోకుండా ఎంసెట్ కౌన్సెలింగ్ అన్ని దశలు అయిపోయే వరకు అలాగే ఉంచి చివర్లో రద్దు చేసుకుంటున్నారు. ఈ సీట్లను ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తున్నాయి. ఈ క్రమంలో ముందే ఎక్కువ డబ్బులకు మాట్లాడుకున్న వారికి కాలేజీలు సీట్లు కేటాయిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో టాప్ ర్యాంకర్లకు కూడా ముందే వల వేసి ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ మేరకు కొంత మొత్తం ముట్టజెబుతున్నారని విద్యార్థి, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రూ.కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నా యని, ఉన్నతాధికారులకు సైతం ఇందులో వాటాలు ఉంటున్నాయని ఆరోపిస్తున్నాయి. ప్రైవేటు కాలేజీల దందాపై ప్రతి ఏటా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ఈ తంతుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా నివేదికలు ఇస్తున్నాయి. దీంతో ఈ అడ్డగోలు వ్యాపారానికి చెక్ పెట్టాలనే నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వం.. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

ఏం చేయబోతున్నారు..?

- తొలిదశలోనే సీటు సాధించి చివరి కౌన్సెలింగ్ వరకూ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరని వారి వివరాలు సేకరిస్తారు. జాతీయ సంస్థలతో సమన్వయం చేసుకుని, జోసా కౌన్సెలింగ్‌లో వారికి సీటు ఎప్పుడొచ్చింది? ఎప్పుడు రిపోర్టు చేశారు? అనే వివరాలు సేకరిస్తారు. ఇదంతా విద్యార్థుల ఆధార్ నంబర్ ఆధారంగా చేయాలని భావిస్తున్నారు. విద్యార్థులకు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ద్వారా లబ్ధి చేకూరిందా అనేది నిగ్గు తేల్చేందుకు వారి బ్యాంకు ఖాతాలతో పాటు తల్లిదండ్రులు, బంధువుల బ్యాంకు ఖాతాలను కూడా చెక్ చేసే వీలుందని ఓ అధికారి తెలిపారు. ప్రాథమిక ఆధారాలు లభిస్తే తక్షణమే జాతీయ సంస్థలతో మాట్లాడి ఆ విద్యార్థి ఎక్కడ సీటు పొందినా బ్లాక్ చేయాలనే ఆలోచనలో అధికారులున్నారు. ఈ క్రమంలో కాలేజీలు, విద్యార్థులపై కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడ బోమని అధికారులు అంటున్నారు. కాలేజీల సీట్ల వ్యాపారంలో పావులు కావొద్దంటూ విద్యార్థులను హెచ్చరించేలా ప్రచారం సైతం చేసేందుకు మండలి సిద్ధమవుతోంది.

ఆరోగ్యశ్రీలో కేన్సర్‌కు వైద్య సేవలందించాలి

మంత్రి హరీశ్‌రావు ఆదేశం



శేరిలింగంపల్లి (హైదరాబాద్): ఆరోగ్యశ్రీలో పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో కేన్సర్‌కు వైద్య సేవలు అందించాలని, వాటి బిల్లులను కూడా తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన ఎథోస్ రేడియోథెరపీ సిస్టమ్‌ను ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...ఎథోస్ రేడియోథెరపీతో ఈ ప్రాంత ప్రజలకు అధునాత టెక్నాలజీతో కూడా వైద్య సేవలు అందడం సంతోషం అన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ విభాగంలో 300 బెడ్స్ అదనంగా జతచేశామని వివరించారు. అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో సామాజికసేవలో భాగంగా పేదలకు కేన్సర్‌కు వైద్యసేవలు అందించి ఆదుకోవాలని సీఓఓ డాక్టర్ ప్రభాకర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, అల్ల వెంకటేశ్వరరెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

20న కొల్లాపూర్‌కు ప్రియాంక?

▶ మొదటి పేజీ తరువాయి

ఎ.రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న ప్రియాంక సభ ఖరారైనట్టేనని, అధికారికంగా ప్రకటన చేయడమే తరువాయి అనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ప్రియాంక హాజరయ్యే సభలో మాజీమంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేశ్‌రెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. జూపల్లి చేరిక సభలో ప్రియాంకగాంధీ చేత కీలక ప్రకటనలు ఇప్పించేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఖమ్మం వేదికగా వృద్ధులు, వితంతువులు, ఇతర వర్గాల పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతూ హామీ ఇచ్చినట్టుగానే, కొల్లాపూర్ సభావేదికగా మహిళా ఓటర్లను ఆకర్షించే విధంగా భారీ ఎన్నికల హామీ ఇస్తామని, ఇందుకోసం నాలుగైదు అంశాలను పరిశీలిస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కర్ణాటక ఎన్నికల్లో ఇచ్చినట్టుగానే తెలంగాణలోనూ మహిళలకు ఉచిత బస్సుప్రయాణ హామీని ప్రకటించే అవకాశాలున్నాయని వారంటున్నారు. దీంతో పాటు పావలా వడ్డీరుణాల స్థానంలో మహిళలకు వడ్డీ లేని రుణాలిస్తామని, రూ.లక్ష వరకు ఈ రుణం ఇస్తామని, నామినేటెడ్ పదవుల్లో 33% మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీలను కూడా ఇప్పించే అంశాలను టీపీసీసీ ముఖ్య నేతలు పరిశీలిస్తు న్నారు. మొత్తం మీద ప్రియాంకాగాంధీ సభ ద్వారా మహిళలకు భారీ ఎన్నికల హామీని ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేస్తోంది.

ఎంబీబీఎస్ కన్వీనర్ సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకే..

▶ మొదటి పేజీ తరువాయి

2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లు 100 శాతం రాష్ట్ర విద్యార్థులకే రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. అంతకుముందు స్థానిక విద్యార్థులకు 85 శాతం మాత్రమే సీట్లు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వ్‌డ్‌గా ఉండేవి. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. తాజా నిర్ణయం వల్ల తెలంగాణ విద్యార్థు లకు ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు దక్కనున్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో ఉండే సీట్లన్నీ కన్వీనర్ కోటా సీట్లే కాగా, ప్రైవేటు కళాశాలల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటా కిందే భర్తీ చేయాల్సి ఉంటుంది.

పాత కాలేజీల్లోనే అన్ రిజర్వ్‌డ్ కోటా

తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు చేరువ చేయడంతోపాటు, తెలంగాణ విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలుంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరింది. నాడు తెలంగాణలో 2,850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే, ఇప్పుడు 8,340కి పెరిగాయి. అప్పటి 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కన్వీనర్ కోటా కింద 1,895 ఎంబీబీఎస్ సీట్లు (ప్రభుత్వ, ప్రైవేటు కలిపి)అందుబాటులో ఉండేవి. ఇందులో 15% అన్ రిజర్వుడు కోటా కింద 280 సీట్లు కేటాయించాల్సి వచ్చేది. వీటిని ఏపీ విద్యార్థులు సైతం దక్కించుకునేందుకు అవకాశం ఉండటంతో ఆ మేరకు తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోయేవారు. తాజాగా ఈ విధానంలో ప్రభుత్వం మార్పు లు చేసింది. అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేస్తూ నిబంధనలను సవరించింది. కొత్తగా వచ్చిన 36 మెడికల్ కాలేజీలకు అన్ రిజర్వుడు వర్తించకుండా చేసింది. దీంతో తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా లభిస్తాయి.

గతేడాది నుంచి బీ కేటగిరీలో 85 శాతం తెలంగాణకే...

ఇప్పటికే ఎంబీబీఎస్ బీ కేటగిరీ సీట్లలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందేలా చేయడం (లోకల్ రిజర్వ్) వల్ల రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 1,300 ఎంబీబీఎస్ సీట్లు లభించాయి. తాజా నిర్ణయంతో ప్రతి ఏటా మొత్తం 1,820 సీట్లు అదనంగా లభించనున్నాయి. 1,820 సీట్లు అదనంగా అంటే దాదాపు 20 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుతో సమానం. కాగా ప్రతి ఏటా కాలేజీల సంఖ్య పెరిగిన కొద్దీ అదనంగా లభించే సీట్లు పెరగనున్నాయి. కొత్త మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా 15 శాతం సీట్లు యథాతథంగా ఉంటాయి. దీనిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని ఎక్కడివారైనా మెరిట్ ప్రకారం అడ్మిషన్ పొందవచ్చు.

డాక్టర్ కల సాకారం చేసే నిర్ణయం

ప్రభుత్వం ఒకవైపు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తూనే, ఎక్కువ సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ విద్యార్థులు స్థానికంగా ఉంటూనే డాక్టర్ కల సాకారం చేసుకునేందుకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. సీఎం కేసీఆర్ ఆలోచనతో అమలు చేస్తున్న నిర్ణయాలు తెలంగాణ బిడ్డలను వైద్య విద్యకు చేరువ చేస్తున్నాయి. మొత్తం 1,820 మెడికల్ సీట్లు అదనంగా వచ్చేలా ప్రభుత్వం చేసింది.

– హరీశ్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా రోనాల్డ్ రాస్..

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రోనాల్డ్ రాస్

సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్థికశాఖ కార్యదర్శి డి.రోనాల్డ్ రాస్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆ పోస్టులో ఉన్న డీఎస్ లోకేష్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (అడిషనల్ సీఈవో)గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో రాస్ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అబ్కారీ శాఖ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం జాయింట్ సీఈవోగా బదిలీ కావడంతో ఆ స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న ఎండీ ముషరఫ్ ఫారూఖీ నియమితులయ్యారు.

బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమే

- కాళేశ్వరం ప్రాజెక్టుతో నిధులు వృథా
- పార్టీలో చేరికలు, టికెట్లపై అధిష్టానానిదే తుది నిర్ణయం: భట్టి



ఖమ్మం సహకారనగర్: బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌లా వ్యవహరిస్తోందని సీఎల్పీనేత మల్లు భట్టివిక్రమార్క విమర్శించారు. ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీస్ యంత్రాంగానికి ముందే తెలిసినా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు వెచ్చించినట్లు చెబుతుండగా, ఆ నిధులన్నీ వృథాగా మారాయని ఆరోపించారు. అదే రూ.28 వేల కోట్లతో ప్రాణహిత – చేవెళ్ల పూర్తిచేస్తే రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఎకరాలకు ఉపయోగం జరిగేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఎక్కడి నుంచి ఎన్ని ఎకరాలకు నీళ్లు వస్తాయో చెబితే బాగుండేదన్నారు. ఇక ఖమ్మం జిల్లాలో రూ.1,475 కోట్లతో ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులకు బదులు రూ.25 వేల కోట్లతో రీడిజైన్ చేసి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చారని మండిపడ్డారు. కాగా, జాతీయ స్థాయిలో సైతం బీజేపీయేతర పార్టీలన్నీ ఏకమవుతున్న క్రమంలో వాటిని విచ్ఛిన్నం చేసేందుకు అఖిలేశ్ యాదవ్‌తో కేసీఆర్ భేటీ అయ్యారని ఆరోపించారు. కాగా, పార్టీలో చేరికలపై అగ్రనాయకత్వం చర్చించి నిర్ణయాలు తీసుకుంటుందని.. షర్మిల అయినా మరెవరైనా ఇదే పరిస్థితి ఉంటుందని భట్టి తెలిపారు. ఇక టికెట్ల విషయంలోనూ అధిష్టానం చూసుకుంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నీకు ఏం జరుగుతుందనే భయం వద్దు. ఎవ్వరి మీదా ఆధారపడవద్దు. మన మొత్తం అస్తిత్వపు రహస్యం భయం లేకుండా ఉండటం.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 5 జూలై 2023

మూలానికి మందు వేయాలి!

ఒకటి కాదు రెండు కాదు... ఇప్పటికి ఎనిమిది రోజులు. ఫ్రాన్స్ తగలబడుతూనే ఉంది. ప్యారిస్‌కు సమీపంలో ట్రాఫిక్ సిగ్నల్ అతిక్రమించినందుకు కారు ఆపమన్నప్పుడు ఆపని పాపానికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని నేరానికి 17 ఏళ్ళ నల్లజాతి టీనేజర్‌ను ఓ పోలీసు అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చి చంపిన వీడియో ప్రజాగ్రహం పెల్లుబికేలా చేసింది. పాశవిక చర్యకు పాల్పడ్డ పోలీసుపై సరైన చర్య తీసుకోకపోవడం అల్లర్లకు దారి తీసినట్టు పైకి కనిపిస్తున్నా, లోలోపల ఫ్రాన్స్‌ను పీడిస్తున్న అనేక అంశాలున్నాయి. ఆఫ్రికన్, అరేబియన్ మూలాలున్న నల్ల జాతీయులు, నిరుపేదలు ఏళ్ళ తరబడిగా ఎదుర్కొంటున్న జాతివివక్ష ఇలా విస్ఫోటించింది. యువత వీధుల్లోకొచ్చి కార్లు తగలబెట్టి, బడులు, ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లపై దాడి చేసి, దుకాణాల్ని లూటీ చేసే పరిస్థితి తెచ్చింది. 2018 నాటి 'ఎల్లో వెస్ట్స్' నిరసనల తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌ను ఎన్నడెరుగని రాజకీయ సంక్షోభంలోకి నెట్టింది. శాంతిభద్రతల పునరుద్ధరణకు వేలాది భద్రతా సిబ్బందిని బరిలోకి దింపడం సరే కానీ, ఆర్థిక – సామాజిక అసమానతల కేంద్రంగా మారిన ఆ దేశం చేయాల్సిన అసలు పని వేరే ఉంది.

సంపన్న సాంస్కృతిక వారసత్వం, చైతన్యశీలతతో ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఫ్రాన్స్ ఇప్పుడు వీధుల్లోకి విస్తరించిన అసంతృప్తికీ, హింసాత్మక ప్రదర్శనలకూ కేంద్రమవడం గమనార్హం. ప్యారిస్ మొదలు అనేక చోట్లకు విస్తరించిన తాజా అల్లర్లే అందుకు నిదర్శనం. మెక్రాన్ సత్వరమే రంగంలోకి దిగి, పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అల్జీరియన్ సంతతికి చెందిన టీనేజర్ నహేల్ హత్య అంగీకారయోగ్యం, క్షమార్హం కాదంటూనే, మూక దాడులు, విధ్వంసం సైతం సమర్థనీయం కావన్నారు. ఆయన మాటలు పాలనా యంత్రాంగానికి దిశా నిర్దేశమే. అల్లర్లు అదుపులోకి వచ్చాక పాలకులకూ, ప్రజలకూ మధ్య చర్చకు ఆ మాటలు ఉపకరిస్తాయి. కానీ, మాటలొక్కటే సరిపోవు. 2011లో బ్రిటన్ నుంచి 2013లో అమెరికాలో 'బ్లాక్‌లైవ్స్ మేటర్' ఉద్యమం దాకా పాశ్చాత్య దేశాల్లో జాతివివక్ష పోలీసు దౌర్జన్యాలపై అల్లర్లు పదేపదే జరుగుతూనే ఉన్నాయనేది చరిత్ర పాఠం.

ఫ్రాన్స్‌లో పోలీసులు ఆదేశించినప్పుడు వాహనం ఆపకున్నా, బెదిరించినా ఆ వాహన చోదకుణ్ణి నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేసేందుకు చట్టాలు అనుమతిస్తున్నాయి. 2017లో చేసిన సవరణ అలాంటి అపరిమిత అధికారం పోలీసులకు కట్టబెట్టింది. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ఇలాంటి పోలీసు కాల్పులు, మరణాలు సంభవించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. గత ఏడాది ఇలాంటివి 13 జరిగాయట. ఇన్నేళ్ళలో ఈ బాధితుల్లో అత్యధికులు నల్లజాతి వారే. గీత దాటితే శిక్షించాల్సిందే కానీ, కాల్చి చంపేందుకు అనుమతించడం దారుణం. ఈ చట్టాన్ని ఫ్రాన్స్ తక్షణం రద్దు చేయాలి. పోలీస్ దౌర్జన్యం, పాలనాపరమైన దీర్ఘకాలిక నిర్లక్ష్యం, వర్గ అసమానతలనేవి ఇవాళ ఫ్రాన్స్ సహా ప్రజాస్వామ్య ప్రపంచంలో అనేక ప్రాంతాలను దీర్ఘకాలంగా పీడిస్తున్న అంశాలు. సత్వరం దృష్టి పెట్టాల్సిన సమస్యలు.

ఫ్రాన్స్‌లో పట్టణాలు, నగరాల చుట్టూ శివార్లలో అల్పాదాయ వర్గాల గృహసముదాయాలైన 'బాన్ల్యూ'లు ఉంటాయి. ఒకప్పటి ఫ్రెంచ్ వలస దేశాల శరణార్థులు ప్రధానంగా ఉండే ప్రాంతాలివి. ఈ శివారు నివాస సముదాయాల, అక్కడి పరదేశీయుల కష్టనష్టాలను నివారించడం కీలకం. 2021 నాటి అంచనా ప్రకారం ఫ్రాన్స్‌లో 10.3 శాతం మంది వలస జనాభానే. అత్యధికులు అల్జీరియా, మొరాకో, ట్యునీసియాల నుంచి వచ్చినవారు. ఫ్రాన్స్ శ్రామికశక్తిలో వీరిది ప్రధాన పాత్ర. అలాగే, దేశానికి వన్నె తెచ్చే ఫుట్‌బాల్‌లోనూ వీరి ప్రతిభ వెలుగులీనుతోంది. అయినప్పటికీ అనేక యూరోపియన్ దేశాల లానే ఫ్రాన్స్ సైతం ఈ వలసదారుల్ని తమలో కలుపుకోవడంలో విఫలమవుతోంది. చట్ట సంస్థలు ఇప్పటికీ వీరిని అనుమానంగానే చూడడం విచారకరం. ఆ మాటకొస్తే, ఈ శరణార్థుల సంక్షోభానికి మానవీయ పరిష్కారం కనుగొనడంలో దేశాలన్నీ విఫలమయ్యాయి. అది విషాదం.

జీవన ప్రమాణాలు ఉన్నతంగా ఉండే ఫ్రాన్స్‌లో సమాజంలో వేర్వేరు వర్గాల మధ్య అంతరాలూ అంతే ఎక్కువ. సంపద పంపిణీలో, అవకాశాల్లో భారీ తేడా నెలకొంది. నిరుద్యోగం, పెరుగుతున్న జీవన వ్యయం, లోకువగా చూస్తూ అణచివేయడం వగైరాలన్నీ వలసదారుల్లో ఆశాభంగం, ఆగ్రహం కలిగించి, అలజడి రేపుతున్నాయి. ఇవాళ ఫ్రాన్స్ సహా అనేక దేశాల్లో రాజకీయ, సామాజిక చీలికలకు ఇవి ప్రధాన కారణం. అణగారిన ప్రజలు సామాజిక అసమానత, ఆర్థిక అసంతృప్తితో తమ బాధల్ని పాలకుల దృష్టికి తీసుకురావడానికి అల్లర్లను సాధనంగా ఎంచుకుంటున్నారు. జాతి వివక్షతో పోలీసులు జరుపుతున్న దాష్టీకం మారాలని కోరుతున్నారు. సమాజంలో లోతుగా పాతుకు పోయిన ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. పౌర సమాజం, ప్రజలు సమగ్ర పరిష్కారానికి చేయూత నివ్వాలి.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలే మూలస్తంభాలనే పరిణత ప్రజాస్వామ్యమైన ఫ్రాన్స్‌లోనే పరిస్థితి తద్విరుద్ధంగా ఉండడం చేదు నిజం. అక్కడి పరిణామాలు ఇతర ప్రజాస్వామ్య దేశాలకు కనువిప్పు. వివిధ జాతులు, మతాలు, వర్ణాలు, వర్గాలతో వైవిధ్యభరితమైన ప్రజానీకమున్న దేశాలు ఆ విభిన్న ప్రజానీకపు అవసరాలు, ఆకాంక్షలకు తగ్గట్టు వ్యవహరించాలి. ప్రభుత్వ సంస్థల విధి విధానాలను అందుకు తగినట్టు మార్చుకోవాలి. పాలనలో దీన్ని తక్షణ ప్రాధాన్యంగా పెట్టుకోవాలి. లేదంటే, ఇవాళ ఫ్రాన్స్‌లో జరిగినట్టే రేపు తమ దేశంలో జరగదన్న గ్యారెంటీ ఏమీ లేదు. వివక్ష పెంచిన సామాజిక ఉద్రిక్తతలతో చేతులు కాలకముందే మేల్కోవడం వివేకవంతులైన పాలకుల లక్షణం!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.విదియ ప.1.04 వరకు,
తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.8.56 వరకు,
తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.12.37 నుండి 2.07 వరకు,
దుర్ముహూర్తం: ప.11.36 నుండి 12.31 వరకు,
అమృతఘడియలు: రా.9.34 నుండి 11.02 వరకు.

సూర్యోదయం: 5.33
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే ఆర్డినెన్స్

విశ్లేషణ



జస్టిస్ మదన్ బి లోకూర్

'ఢిల్లీ ఆర్డినెన్స్' పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ (సవరణ) చట్టం, 2023, ఢిల్లీలో పరిపాలనా రూపాన్ని మారుస్తుంది. ఈ ఆర్డినెన్స్, స్పష్టమైన కారణం లేకుండా, 'సేవలకు' సంబంధించి అధికారాలను వినియోగించుకునే వీలును ఢిల్లీ ప్రభుత్వానికి లేకుండా చేస్తోంది. దీనికి బదులుగా, ఇది భారత ప్రభుత్వానికి అపరిమిత అధికారాన్ని ఇచ్చింది. పైగా ఢిల్లీ ముఖ్యమంత్రిని, మంత్రులను రబ్బర్ స్టాంప్ కంటే తక్కువ స్థాయికి కుదించింది. దీంతో ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం చుక్కాని లేనిదిగా మిగిలిపోయింది. పైగా, ప్రజల అభీష్టం అనేది ఏ మాత్రం విలువ లేనిదిగా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ పాలన ఎలా ఉంటుందనేది ఆశ్చర్యంగానే ఉంది. అంబేడ్కర్, సుప్రీంకోర్టు అభిప్రాయాలను కలిపి చదివినట్లయితే, దురదృష్టవశాత్తు ఆర్డినెన్స్ రాజ్యాంగ నైతికతను విస్మరించిందని స్పష్టమవుతోంది.

బాబాసాహెబ్ అంబేడ్కర్ 1948 నవంబర్ 4న రాజ్యాంగ సభలో రాజ్యాంగ నైతికత గురించి ప్రసంగించారు. ఆయన ఇలా అన్నారు: ''ప్రజాస్వామ్య రాజ్యాంగం శాంతియుతంగా పనిచేయడానికి రాజ్యాంగ నైతికత వ్యాప్తి ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించినప్పటికీ, దానితో పరస్పరం అనుసంధానితమైన రెండు అంశాలను దురదృష్టవశాత్తు సాధారణంగా గుర్తించలేదు. ఒకటి, పరిపాలనా రూపానికి రాజ్యాంగ రూపంతో దగ్గరి సంబంధం ఉంది. రెండోది, దాని రూపాన్ని మార్చకుండా కేవలం పరిపాలనా రూపాన్ని మార్చడం ద్వారా రాజ్యాంగాన్ని వక్రీకరించగలగడం. ఇలా చేయడం ద్వారా రాజ్యాంగాన్ని అస్థిరపర్చి, రాజ్యాంగ స్ఫూర్తిని వ్యతిరేకించడం కచ్చితంగా సాధ్యమవుతుంది.''

ఇంత తొందరేల?

జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ (సవరణ) చట్టం, 2023, ఢిల్లీలో పరిపాలనా రూపాన్ని మారుస్తుంది. అలాగే ఇది రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేదు. ఆర్డినెన్స్ రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్ట్ నిర్ణయిస్తుంది. పైగా దాని ప్రస్తుత రూపాన్ని సవాలు చేసినప్పుడు, 1991లో జాతీయ రాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి కనీసం ఢిల్లీలో అమలులో ఉన్న పరిపాలనా రూపాన్ని అది అధిగమిస్తుందనడంలో సందేహం లేదు.

ఒక మార్పు తీసుకురావడంలో ఇంత తొందరపాటు అవసరమా? రాజ్యాంగం ఇచ్చిన అసాధారణ అధికారాన్ని వినియోగించుకోవాల్సిన తక్షణ అవసరం ఉందా? ఢిల్లీ ప్రభుత్వంతో కలిసి పనిచేసే అధికారుల నియామకం, నియంత్రణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వానికీ, భారత ప్రభుత్వానికీ మధ్య ఉన్న వివాదాన్ని, ఆర్డినెన్స్ ప్రకటించడానికి కేవలం ఒక వారం ముందు సుప్రీంకోర్టు పరిష్కరించింది. రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది.

అంతకుముందు, రెండు ప్రభుత్వాల మధ్య జరిగిన వివాదంలో, సుప్రీంకోర్టు (2018) రాజ్యాంగ నైతికతను ఈ పదాలలో ప్రస్తావించింది. ''రాజ్యాంగ నైతికత అనేది ఉన్నత స్థాయి సిబ్బందిపై, పౌరులపై ఒక ముఖ్యమైన తనిఖీ వ్యవస్థగా పనిచేస్తుంది. అపరిమితమైన శక్తిని కలిగివుండి, ఎటువంటి తనిఖీలు, నియంత్రణలు లేకపోతే ప్రజాస్వామ్య ఆలోచనకు విరుద్ధమైన నిరంకుశ పరిస్థితి ఏర్పడుతుంది. అదే మొత్తం ప్రజాస్వామ్య భావనకే విరుద్ధమైనది.''

కాలు చేతులు లేకుండా...

ఈ ఆర్డినెన్స్, స్పష్టమైన కారణం లేకుండా, 'సేవలకు' సంబంధించి అధికారాలను వినియోగించుకునే వీలును ఢిల్లీ ప్రభుత్వానికి లేకుండా చేస్తోంది. దీనికి బదులుగా, ఇది భారత ప్రభుత్వానికి అపరిమిత అధికారాన్ని ఇచ్చింది. పైగా ఢిల్లీ ముఖ్యమంత్రిని, మంత్రులను రబ్బర్ స్టాంప్ కంటే తక్కువ స్థాయికి కుదించింది.



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా

అంబేడ్కర్, సుప్రీంకోర్టు అభిప్రాయాలను కలిపి చదివినట్లయితే, దురదృష్టవశాత్తు ఆర్డినెన్స్ రాజ్యాంగ నైతికతను విస్మరించిందని స్పష్టమవుతుంది.

ఇతర నిబంధనలను చూస్తే, ఆర్డినెన్స్ ఢిల్లీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఒక అథారిటీని ఏర్పాటు చేసే వీలు కల్పిస్తుంది. దీనిని నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ అని పిలుస్తారు. ఈ అథారిటీకి పబ్లిక్ ఆర్డర్, పోలీస్, ల్యాండ్, అంటే భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని జాబితా పరిధిలోకి వచ్చే ఎంట్రీలు కాకుండా, ఢిల్లీ ప్రభుత్వ వ్యవహారాల్లో పనిచేస్తున్న గ్రూప్–ఏ అధికారులకు సంబంధించి హాస్యాస్పదమైన సిఫార్సులు చేసే అధికారాలు మాత్రమే ఉన్నాయి. అథారిటీకి ముఖ్యమంత్రి అధ్యక్షత వహించినప్పటికీ, సీనియర్ బ్యూరోక్రాట్‌లుగా ఉన్న మరో ఇద్దరు అధికార సభ్యులు ముఖ్యమంత్రిని తోసిరాజనవచ్చు.

అందువల్ల, ముఖ్యమంత్రి పేరుకు నామమాత్రపు అధిపతి. పైగా ఆయన ఢిల్లీ ప్రజల ఎన్నికైన ప్రతినిధి అయినప్పటికీ, ఆయన కేవలం సున్నాకు తగ్గించబడ్డారు. అంతే కాకుండా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరుకి అథారిటీ సిఫార్సును ఆమోదించాల్సిన అవసరం లేదు.

ప్రజాభీష్టం మాటేమిటి?

మరొక క్రూరమైన కోత ఏమిటంటే, సాక్షాత్తూ మంత్రుల మండలి అభిప్రాయాలను ఒక కార్యదర్శి నిరోధించగలగడం. అప్పటికి అమలులో ఉన్న చట్టానికి అనుగుణంగా మంత్రుల మండలి అభిప్రాయం లేకపోతే గనక, తానుగా ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకోగలిగే అధికారం ఈయనకు దఖలు పడింది.

పైగా ఆ అభిప్రాయాన్ని ఆయన తప్పనిసరిగా లెఫ్టినెంట్ గవర్నర్ దృష్టికి తెచ్చి, దానిమీద ఆయన నిర్ణయాన్ని తీసుకునే వీలు కల్పిస్తాడు. మరో మాటలో చెప్పాలంటే, మంత్రిమండలి తీసుకున్న నిర్ణయాల చట్టబద్ధతను పరీక్షించే ఇన్విజిలేటర్ లేదా ఎగ్జామినర్ పాత్రను కార్యదర్శి స్వీకరిస్తాడు. కాబట్టి ముఖ్యమంత్రి పాత్ర శూన్యంగా మారిపోవడమే కాకుండా, మంత్రి మండలి కూడా ఆ స్థాయికి దిగజారిపోతుంది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ పాలన ఎలా ఉంటుందనేది ఆశ్చర్యంగానే ఉంది.

ఆర్డినెన్స్ ద్వారా న్యాయం ప్రభావితం అవుతుందా? అవును, ఆర్డినెన్స్‌లోని సెక్షన్ 45 డి ప్రకారం, ఏదైనా కమిషన్, చట్టబద్ధమైన అధికార వ్యవస్థ, బోర్డు, కార్పొరేషన్‌లో ఎవరైనా ఛైర్‌పర్సన్, సభ్యుడు లేదా ఆఫీస్ బేరర్‌ను నియమించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అంటే తద్వారా భారత ప్రభుత్వానికి ఆ అధికారం ఉంటుంది. పర్యవసానంగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ఢిల్లీ మహిళా కమిషన్, ఢిల్లీ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, ఢిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ మొదలైన వాటితో సహా పాక్షిక–న్యాయ అధికారాలను అమలు చేసే చట్టబద్ధమైన సంస్థల నియామకాన్ని భారత ప్రభుత్వమే చేపడుతుంది. ఇది బాలల హక్కులు, స్త్రీల హక్కులు, రవాణా, నీరు, విద్యుత్ మొదలైన రంగాలకు విస్తరించింది. ప్రభావవంతంగా, ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వం చుక్కానిలేనిదిగా మిగిలిపోయింది. పైగా, ప్రజల అభీష్టం అనేది ఏమాత్రం విలువ లేనిదిగా మారిపోయింది.

ఆర్డినెన్స్ ఆమోదం పొందిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన ఏకగ్రీవ తీర్పును రద్దు చేయడమే ఆర్డినెన్స్ ఉద్దేశ్యం, లక్ష్యం అని చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఆర్డినెన్స్ ఢిల్లీ ప్రజలపై, దాని ఎన్నికైన ప్రజాప్రతినిధులపై, రాజ్యాంగంపై కూడా రాజ్యాంగ వంచన రూపంలో వచ్చింది.

ఈ మొత్తం కసరత్తు బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆవాహన చేసుకోవడం, ''ప్రజాస్వామ్య రాజ్యాంగం శాంతియుతంగా పనిచేయడానికి రాజ్యాంగ నైతికత విస్తరణ ఆవశ్యకతను'' అంగీకరించడంలో పొరబడ్డారా అనే ఆశ్చర్యానికి దారి తీస్తుంది.

వ్యాసకర్త సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మళ్లీ మొదలెట్టాలి



ఒక్కసారి బీజేపీ వెళ్లిపోతే, ఈ దేశం, దాని విలువల ప్రమాణాలు, దాని సంస్థలు అన్నింటినీ పునాది నుంచి నిర్మించుకుంటూ రావాల్సి ఉంటుంది. వాళ్లు ప్రతిదాన్నీ విషపూరితం చేశారు.
– అర్పితా ఛటర్జీ, సినిమా రచయిత్రి

నేరపూరితం



శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయం మీద శనివారం జరిగినట్టు తెలిసిన దాడి, దహన ప్రయత్నాలను యునైటెడ్ స్టేట్స్ తీవ్రంగా ఖండిస్తోంది. దౌత్య కార్యాలయాలు, విదేశీ దౌత్యవేత్తలకు వ్యతిరేకంగా జరిగే విధ్వంసం, లేదా హింస అమెరికాలో నేరపూరిత చర్య.
– మాథ్యూ మిల్లర్, అమెరికా విదేశాంగ ప్రతినిధి

వాడకూడని మాట



ఖలిస్తాన్ అనేదే లేనప్పుడు ఖలిస్తానీ అనే మాటను ఎలా వాడుతున్నారు? వాళ్లను అతివాదులు అనండి, మిలిటెంట్లు అనండి, వేర్పాటువాదులు అనండి. వాళ్లను ఏమైనా అనండి కానీ ఖలిస్తానీ అనొద్దు. అసంభవం అయినదానికి లేనిపోని చట్టసమ్మతి కల్పించవద్దు.
– అమిత్ పాండీలియా, కాలమిస్ట్

దార్శనికుడు



పాఠం చెప్పడం కోసం టాగూర్ నవల 'గోరా'ను మళ్లీ చదువుతున్నాను. కొన్ని వాక్యాలైతే ఇప్పటి కాలం గురించి భవిష్యత్ దర్శనం చేసి రాసినట్టుగా ఉన్నాయి. అతివాద హిందూయిజం, కుల విభేదాలు, సామాజిక సంస్కరణలు, లింగ రాజకీయాలు! తన కాలానికి ఎంతో ముందున్న మనిషి ఆయన.
– అమృతా ఘోష్, అసిస్టెంట్ ప్రొఫెసర్

వీటికీ రుజువులా?



అంటే... కొబ్బరినీళ్లు ఆరోగ్యానికి మంచివి కావు. పసుపు వేసిన పాలు ఆరోగ్యానికి మంచివి కావు: ఎందుకంటే దానికి 'రుజువులు' లేవు కాబట్టి! అలాగే డైట్ కోక్ ఆరోగ్యానికి చెడ్డది కాదు: ఎందుకంటే దానికి కూడా 'రుజువు' లేదు కాబట్టి! కొంతమంది కనీస ఇంగితం లేకుండా మాట్లాడుతుంటారు.
– శివమ్ దా, క్యాన్సర్ స్పెషలిస్ట్

ఖాళీ లేదు



ముస్లింలకు అద్దెలు ఇవ్వడానికి ఇష్టపడని వాళ్ల సంఖ్య భయపెడుతోంది, నిరాశ కలిగిస్తోంది. అది కూడా రాజధాని నగరంలోని కులీన ప్రాంతాల్లో. పైగా వీళ్లంతా బాగా చదువుకున్నవారు. బ్రోకర్లు, వాళ్ల సహాయకుల ద్వారా అద్దెకు దిగేవాళ్ల మతం ఏమిటో నిర్ధరించుకుంటారు. వాళ్ల నుంచి మనం వినేదల్లా 'సారీ' మాత్రమే!
– బిస్మీ తస్కీన్, జర్నలిస్ట్

అదీ కారణం



ముంబయికి మేము మారినప్పుడు ముస్లింలం అయిన కారణంగా ఇల్లు దొరకని విషయం పట్ల మా 'చాచీ'(చిన్నమ్మ) ఇప్పటికీ కోపంగా ఉంటుంది. అల్హాముదులిల్లాహ్ (అల్లాను శ్లాఘిస్తూ)! ఇప్పుడు మేము ఓనర్ల మయ్యాం. కానీ మేము కూడా అద్దెకు ఇవ్వడానికి హిందువులనే ఇష్టపడతాం. అద్దె సమయానికి వస్తుంది; ఆయుధాలు, మిలిటెంట్లు, మేకలు దాగివున్నాయేమో అనే భయం ఉండదు.
– యానా మీర్, మీడియా ప్యానెలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఎంతకాలం ఈ అన్యాయం?

అభిప్రాయం



శ్రీనివాస్ తిపిరిశెట్టి

కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను అర్హులైనవారందరికీ అందించడంలో విఫలమవుతోంది. ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వెనుకబడిన కులాల (బీసీ)వారిని ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీ)లుగా గుర్తించడంలో తగినంత శ్రద్ధ చూపడం లేదు. దీంతో రాజ్యాంగం, చట్టాలు ప్రసాదించిన హక్కును ఇప్పటికీ వేలాది వెనుకబడిన కులాలు పొందలేక పోతున్నాయి. ఆ మేర వారు మరింత వెనుకబడి పోతున్నారు. ఇంకో గుండెలు బరువెక్కే నిజం ఏమిటంటే... ఇలా కేంద్రం బీసీలుగా గుర్తించని కులాల్లో ఎక్కువ మంది ఆశ్రిత కులాలవారే. అంటే వీరు ఏదో ఒక కులం వారిపై ఆధారపడి బతుకుతూ ఉంటారు. ఊళ్ల వెంట తిరుగుతూ ఆయా కులాలవారి చరిత్ర, గోత్రాలు చెబుతూ... వారిచ్చే కొద్దిపాటి ధాన్యం, డబ్బులతో బతుకు వెళ్లదీస్తూ ఉంటారు. అంటే వీరు సంచార జాతులవారన్నమాట. కాలంతో పాటూ ఆచార, సంప్రదాయాలూ మారిపోవడంతో ఇప్పుడు కుల గోత్రాల చరిత్ర, వారి కథలు చెప్పించుకునేవారు తగ్గిపోవడంతో ఈ ఆశ్రిత కులాల వారు జీవనోపాధిని పూర్తిగా కోల్పోయారు. అందుబాటులో ఉన్న పనిచేసుకుంటూ అర్ధ సంచార జీవులుగా బతుకుతున్నారు. కులవృత్తికి దూరమైనా వీరికి ఉన్న సామాజిక, ఆర్థిక హోదాలు ఏమాత్రం మారలేదు.

ఇటువంటి కులాలవారు దేశంలో చాలా ఉన్నట్లే మన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ ఉన్నాయి. వాటిలో కొన్నే ఓబీసీ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. తెలంగాణలోని 40 కులాలతో కలిపి దేశవ్యాప్తంగా దాదాపు 3867 వెనుకబడిన కులాలకు కేంద్ర ఓబీసీ జాబితాలో చోటు దక్కలేదనేది ఒక అంచనా. నిజానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉండవచ్చు. ఓబీసీ జాబితాలో చోటు దక్కని తెలంగాణ రాష్ట్రానికి చెందిన 40 కులాల వారితో 2021 డిసెంబర్ 21 నుంచి 24 తేదీ వరకు 'జాతీయ బీసీ కమిషన్' ఢిల్లీ కార్యాలయంలో సంభాషించింది. ఆ సందర్భంగా ఈ కులాలనన్నిటినీ ఓబీసీ జాబితాలో చేరుస్తామనీ, ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను భారత సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖకు పంపుతామనీ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల బృందం హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఈ కులాలవారిని ఆ జాబితాలో చేర్చలేదు.

తెలంగాణలో బుక్క అయ్యవారు, గోత్రాల, బొందిలి, ఆరె మరాఠీ, ఆరె, అఘుముడియార్, సుంది, వారాల, సిస్టకరణ, వీరశైవ లింగాయత్, అచ్చుకట్లవారు, అద్దపువారు, బాగోతుల, బైలు కమ్మర, ఏనూటి, గంజికూటి, గౌడజెట్టి, కాకిపడిగల, పటంవారు, ఓడ్, సన్నాయిల, శ్రీ క్షత్రియ రామజోగి, బైకాని/తెరచీరల, తోలుబొమ్మలవారు, ఆహీర్ యాదవ్, గౌలి, కుల్లకడిగి, అత్తర్ సాయబ్‌లు, దోబీ ముస్లిం, పఖ్కీర్ సాయబ్‌లు, గారడీ ముస్లిం, గోసంగి ముస్లిం, గుడ్డెలుగులవారు, నాయీ ముస్లిం, లబ్బాయి పకీర్లు, తురుక కాశా, సరోళ్లవంటి కులాలకు కేంద్ర ఓబీసీ జాబితాలో చోటు దక్కలేదు.

పరిస్థితి ఇలా ఉంటే... ఓబీసీలను ఉపవర్గాలుగా వర్గీకరించడానికి నియమించిన 'జస్టిస్ రోహిణి కమిషన్' నివేదిక సమర్పించడానికి సిద్ధపడుతోంది. 2017 అక్టోబర్‌లో ఈ కమిషన్‌ను కేంద్రం నియమించింది. దీని కాల పరిమితిని ఇప్పటికే 14 సార్లు ప్రభుత్వం పొడిగించింది. చివరిసారిగా పొడిగించిన కాలం 2023 జూలై 31తో



ముగియనుంది.

మండల్ కమిషన్ సిఫార్స్ మేరకు కేంద్ర విద్యాసంస్థల్లో సీట్లు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు ఓబీసీలకు లభిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ అవకాశాన్ని అర్హులైన బీసీలు అందరూ అందుకున్నప్పుడే సరైన సామాజిక న్యాయం జరిగినట్లు. ప్రస్తుతం 2,633 కులాలు మాత్రమే కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయి. వీటిలోనూ కొన్ని కులాల వారే రిజర్వేషన్ ఫలాలు అధికంగా పొందుతున్నారని రోహిణి కమిషన్ పరిశీలనలో తేలింది. 2018లో కమిషన్ ఓబీసీ కోటాకింద భర్తీ అయిన 1.3 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో పొందిన సీట్లను విశ్లేషించింది. ఈ మొత్తం ఉద్యోగాలు, సీట్లలో 97 శాతం ఓబీసీలోని 25 శాతం ఉపకులాలవారే పొందారని తేలింది. ఇందులో 24.95 శాతం అవకాశాలు కేవలం 10 కులాలవారే పొందారని కమిషన్ కనుగొంది. ఓబీసీల్లో 37 శాతం కులాలు... అంటే 983 కులాలు అసలు ఒక్క అవకాశాన్నీ పొందలేదు. 994 ఉపకులాల వారు కేవలం 2.68 శాతం అవకాశాలు మాత్రమే పొందారు. అనేక ఓబీసీ కులాలవారిలో అర్హత సాధించిన వారు లేకపోవడంతో విద్యా సంస్థల్లోని సీట్లను జనరల్ కేటగిరీ వారికి కేటాయించారు. ఇటువంటి పరిస్థితుల్లో అసలు కేంద్ర జాబితాలో చోటు సంపాదించని సంచార జాతులు, ఆశ్రిత కులాల వారికి కేంద్రం సమకూర్చిన రిజర్వేషన్ ఫలాలు ఎలా అందుతాయనేది పెద్ద ప్రశ్న.

ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 130 బీసీ కులాలు ఉంటే కేవలం 90 కులాలు మాత్రమే కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 146 బీసీ కులాలు ఉంటే 108 కులాలు మాత్రమే ఓబీసీ జాబితాలో ఉన్నాయి. మిగిలిన కులాలు అన్యాయానికి గురవుతున్నాయి.

ఒక రాష్ట్ర ప్రభుత్వం బీసీలుగా గుర్తించి ఆ కులాల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి పంపి ఓబీసీ జాబితాలో చేర్చమని సిఫార్సు చేస్తే కేంద్రం చేర్చకపోవడం దారుణం. కేంద్రం రాష్ట్రాన్ని నమ్మకుంటే ఎలా? ఈ అన్యాయం ఇంకెన్నాళ్లు?

వ్యాసకర్త రాష్ట్ర అధ్యక్షులు, గోత్రాల సంఘం, తెలంగాణ I 99494 26536

జెన్ బౌద్ధం

'జెన్' అనేది మహాయాన బౌద్ధానికి చెందిన ఒక రూపం, ఒక శాఖ. జెన్ అనే పదం సంస్కృత పదం 'ధ్యాన' నుండి వచ్చింది. ధ్యాన చైనాలో 'చాన్'గా జపాన్‌లో 'జెన్'గా మారింది. ధ్యానం ద్వారా మనస్సు నిజమైన స్వభావాన్ని గ్రహించటం ఇందులోని ప్రధానాంశం. బుద్ధుడు జ్ఞానోదయాన్నీ, సంయక్ సంబుద్ధినీ పొందినప్పటి మనస్సు ప్రతి ఒక్కరిలో దాగి ఉంటుందనీ, దాన్ని తెలుసుకొని ధ్యానం అనే సాధన ద్వారా వెలికి తీయటమే జెన్ బౌద్ధం లక్ష్యమనీ చెప్తారు.

జెన్ బౌద్ధానికి చైనాలో మూల పురుషుడు 'బోధిధర్ముడు'. ఈయన పల్లవ రాజకుమారుడు. క్రీ.శ. 440లో కాంచీపురంలో జన్మించాడు. యౌవనంలో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. గురువు ఆదేశం మేరకు చైనా వెళ్ళి అక్కడ జెన్ బౌద్ధాన్ని



జ్యోతిర్మయం

ప్రవేశపెట్టాడు. బోధిధర్ముని రాకకు పూర్వమే ఒకటో శతాబ్దంలోనే చైనాలో బౌద్ధం వేళ్ళూనుకొని ఉన్నది. అయితే, చైనాలో బౌద్ధాన్ని ప్రవేశపెట్టిన వాళ్ళెవరికీ, బోధిధర్మునికి వచ్చినంత ఖ్యాతి రాలేదు. జెన్ బౌద్ధానికే కాదు, యుద్ధ కళగా ప్రాచుర్యం పొందిన 'కుంగ్–ఫూ'కు కూడా తొలి గురువు ఆయనే. ఇంతే కాదు, టీ పానీయాన్ని చైనాలో తొట్టతొలుత ప్రవేశపెట్టింది కూడా బోధిధర్ముడే అంటారు.

నిజానికి, జెన్ సంప్రదాయం బోధిధర్మునితో మొదలు కాలేదు. అది బుద్ధునితోనే ప్రారంభమయింది. ఓ రోజు సాయంత్రం సభలో బుద్ధుడు చేతివేళ్ళ మధ్య పువ్వుకాడను పుచ్చుకొని ఆ పువ్వును గుండ్రంగా తిప్పుతున్నాడు. అలా ఎందుకు తిప్పుతున్నాడో, దాని అర్థం ఏమిటో అక్కడ ఉన్న వాళ్ళెవరికీ అంతుబట్టలేదు. ప్రియ శిష్యుడు మహాకాశ్యపుడు ఒక్కడికే అర్థమయింది. గురుశిష్యుల మధ్య జరిగిన అవగాహనకు మాటల అవసరం లేకపోయింది. జ్ఞాన ప్రసరణకు మాధ్యమంగా అంతర్ దృష్టి పని చేసింది. ఆ విధంగా మహాకాశ్యపుడు జెన్ బౌద్ధానికి మొట్టమొదటి గురువు అనుకొంటే, బోధిధర్ముడు ఆ సంప్రదాయానికి చైనాలో మొదటి గురువు.

జెన్ తాత్విక చింతన జీవితంలోని అనేక పార్శ్వాలపై ప్రభావం చూపింది. చిత్ర లేఖనం, కవిత్వ రచన, తోటపని, పూల అమరిక – ఇలా అన్నీ కళాత్మకమైన చర్యలుగా గుర్తింపు పొందాయి. వాటిల్లో ముఖ్యంగా జెన్ కథలు... చైనా, జపాన్ దేశాల్లోని జెన్ గురువుల జీవితానుభవాల మీద ఆధారపడి చెప్పినవి. అవి కేవలం కల్పిత గాథలు కావు.

– దీవి సుబ్బారావు

క్లుప్తంగా...

తెలంగాణలోనూ శ్రీచైతన్య హవా

నీట్‌లో మొదటి స్థానం

సాక్షి, హైదరాబాద్: నీట్–2023 ఫలితాల్లో 720కి 720 మార్కులతో ఆలిండియా మొదటి ర్యాంకు, ఇటీవల విడుదలైన ఏపీ స్టేట్ ర్యాంకుల్లో మొదటి ర్యాంక్ (బి.వరుణ్ చక్రవర్తి)తో చరిత్ర సృష్టించిన శ్రీ చైతన్య... తెలంగాణలోనూ స్టేట్ మొదటి ర్యాంక్ (రఘురామ్ రెడ్డి) సాధించి తన విజయపరంపరను కొనసాగించింది. ఈసారీ రాష్ట్ర, జాతీయ వైద్య కళాశాలల్లో మొదటి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం వాటా శ్రీ చైతన్య దేనని నిరూపించారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్–డైరెక్టర్ సుష్మా చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులను సంస్థ అధినేత డాక్టర్ బి.ఎస్.రావు అభినందించారు.

మమత చిత్రానికి అంతర్జాతీయ గుర్తింపు



తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి తెలంగాణ మహిళా గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో ఫైన్‌ఆర్ట్స్ ఫొటోగ్రఫీ కోర్సు చదువుతున్న గుగులోతు మమతకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ విద్యార్థిని తీసిన గిరిజన మహిళ చిత్రం ప్రఖ్యాత ఇంటర్నేషనల్ ఫ్యాషన్ మ్యాగజైన్‌లో వోగ్ ఇటాలియాలో ప్రచురించినట్టు ప్రిన్సిపాల్ రజని తెలిపారు. ఈ సందర్భంగా మమతను ఆర్‌సీడీవో ఎస్.వెంకన్న, వైస్ ప్రిన్సిపాల్ సుధా సింధు, ఫొటోగ్రఫీ అధ్యాపకులు రఘు థామస్, భాస్కర్ అభినందించారు.

బీఆర్‌ఎస్ వర్సెస్ కాంగ్రెస్

- రాళ్లు, సీసాలతో పరస్పర దాడులు
- చిచ్చురాజేసిన ఖమ్మం సభ
- ఇరువర్గాల్లో ఏడుగురికి తీవ్రగాయాలు

కామేపల్లి (కారేపల్లి): ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల నడుమపోరు భగ్గుమంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయులు ఒకరిపై ఒకరు కారం చల్లుకొని, రాళ్లు, సీసాలు విసురుకుంటూ కర్రలతో దాడులకు పాల్పడి రణరంగాన్ని సృష్టించారు. పండితాపురం గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్‌తో పాటు ఆయన వర్గీయులు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడారు. కాంగ్రెస్‌లో చేరిన వీరు ఇటీవల జరిగిన సభకు వెళ్లడమేగాక గ్రామం నుంచి పలువురిని తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కొందరు మల్లిబాబు వర్గీయులు స్థానికంగా ఉన్న ఓ దాబాకు వెళ్లగా... బీఆర్‌ఎస్ నాయకులు వారు ఉన్న గదికి బయట గడియ పెట్టి కవ్వించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ వర్గీయులు ఫోన్‌లో తమ వారికి చెప్పగా సుమారు 40 మంది వెళ్లి పలువురి ఇళ్లపై రాళ్లు, సీసాలు విసిరేస్తూ కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇంతలోనే బీఆర్‌ఎస్ వర్గీయులు ప్రతిదాడికి దిగడంతో కాంగ్రెస్‌కు చెందిన మేకపోతుల మహేష్, బత్తుల నాగరాజు, రామచంద్రుకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, కాంగ్రెస్ వర్గీయులు మంగళవారం మళ్లీ దాడికి దిగడంతో బీఆర్‌ఎస్ వర్గీయులు ప్రతిఘటించారు. పరస్పర దాడుల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన చల్లా శేషు, చల్లా వెంకటనారాయణ, చల్లా అనిల్, అర్వపల్లి కోటమ్మకు తీవ్రగాయాలు కాగా వీరందరినీ ఖమ్మం తరలించారు. తీవ్రంగా గాయపడిన చల్లా శేషును హైదరాబాద్ తీసుకెళ్లారు. క్షతగాత్రులను సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ వేర్వేరుగా పరామర్శించారు.

‘మేడిన్ తెలంగాణ’ వైద్య ఉత్పత్తులు..

- హైదరాబాద్‌లోని మెడికల్ డివైజెస్ పార్కులో తయారీ.. మూడు సంస్థల ఉత్పత్తులను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్
- ఇందులో దేశంలో, ప్రపంచంలోనే తొలి ఉత్పత్తులు
- వైద్య ఉపకరణాల నాణ్యతను పరీక్షించేందుకు 6 సంస్థలతో ప్రభుత్వం ఎంవోయూ



మంత్రి కేటీఆర్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, ఆరు సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ డివైజెస్ పార్కులో హ్యూవెల్ లైఫ్ సైన్సెస్, ఈఎంపీఈ డయాగ్నొస్టిక్స్, బ్లూ సెమీ అనే సంస్థలు తయారు చేసిన ప్రపంచ స్థాయి, మేడిన్ తెలంగాణ ఉత్పత్తులను మంత్రి కేటీఆర్ మంగళవారం ఆవిష్క రించారు. ఇందులో ప్రపంచంలోనే తొలిసారి తయారైన ఉత్పత్తితోపాటు దేశంలోనే మొదటి రకం ఉత్పత్తి కూడా ఉండటం విశేషం. హ్యూవెల్ సంస్థ వివిధ రకాల ఇన్ఫెక్షన్లను పరీక్షించేందుకు దోహదపడే యూనీయాంప్ అనే పరికరంతోపాటు రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని కొలిచేందుకు వీలుగా హీమోమెజర్ అండ్ ఫెర్రిక్వాంట్ పరికరాలను తయారు చేసింది. ఇందులో యూనీయాంప్... సెంట్రల్ డగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) నుంచి అనుమతి పొందిన తొలి స్వదేశీ పరికరం కావడం గమనార్హం. అలాగే బ్లూ సెమీ సంస్థ సూది గుచ్చకుండానే బ్లడ్ గ్లూకోజ్ సహా 6 శరీర పారామీటర్ల గణాంకాలను 60 సెకన్లలో లెక్కించగల ఈవా అనే పరికరాన్ని రూపొందించింది. ఈ తరహా పరికరం ప్రపంచంలోనే మొదటిది. ఈఎంపీఈ సంస్థ స్వల్ప ఖర్చుతో కచ్చితత్వం, వేగంతో కూడిన టీబీ గుర్తింపు టెస్ట్ కిట్‌ను రూపొందించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆయా ఉత్పత్తులు రాష్ట్రంలో మెడ్‌టెక్ రంగం సమర్థతకు అద్దంపడుతున్నాయన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, వైద్య ఉపకరణాల తయారీ రంగానికి ఉన్న భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ఈ పార్కులో ఇప్పటివరకు రూ. 1,500 కోట్ల పెట్టుబడితో 7 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయనిచెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, టీ–వర్క్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరితోపాటు పలు సంస్థల సీఈఓలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వైద్య పరికరాల టెస్టింగ్, ప్రొటోటైపింగ్ సేవలు...

రాష్ట్రంలో వైద్య ఉపకరణాల తయారీకి సంబంధించిన మెడ్‌టెక్ రంగంలో ఉత్పత్తుల పరీక్ష, ప్రొటోటైపింగ్ సేవలను బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కులో ఉన్న కంపెనీలకు వైద్య పరికరాల టెస్టింగ్, ప్రొటోటైపింగ్ సేవలను అందించేందుకు ఐఎస్‌ఓ ధ్రువీకరణ పొందిన ఆరు సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు సమక్షంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ (టీఎల్ఎస్ఎఫ్)తో ఆర్‌సీసీ లేబొరేటరీస్, టీ–వర్క్స్, పాలమూరు బయో సైన్సెస్, విమ్‌టా ల్యాబ్స్, ఈసీఐఎల్, వివో బయోటెక్ లిమిటెడ్ ఎంవోయూపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా మెడ్‌టెక్ రంగం రాష్ట్రంలో బలోపేతం అవుతుందన్నారు. ఈ ఏడాది మొదట్లో జరిగిన బయో ఆసియా 20వ వార్షిక సదస్సులో భాగంగా జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి కేటీఆర్‌తో వివిధ సంస్థల సీఈఓలు నాణ్యత పరీక్షల తక్షణ అవసరాన్ని తెలియజేశారు. అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నాణ్యత పరీక్షల కోసం ఎంవోయూ కుదుర్చుకుంది.

ప్రమాణాలు పాటించేలా...

సిరంజీలు, ఎంఆర్ఐ స్కానర్లు, ఇంప్లాంట్లు సహా అనేక రకాల వైద్య ఉపకరణాల తయారీలో భిన్న సాంకేతికతను వినియోగిస్తుండటంతో పరికరాల పనితీరు, భద్రతకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంలో ఉత్పత్తుల నాణ్యత పరీక్షలు కీలకంగా మారుతున్నాయి. ప్రస్తుతం కుదిరిన ఒప్పందం ద్వారా వైద్య ఉపకరణాల ప్రమాణాలు, భద్రత, పనితీరు మదింపు జరుగుతుంది.

ఆరిజిన్ బయో.. రూ. 330 కోట్ల పెట్టుబడి

▶ మొదటి పేజీ తరువాయి

ఫార్మాస్యూటికల్స్‌కు పరిశోధన, అభివృద్ధి, తయారీ రంగంలో ప్రముఖ సంస్థగా పేరుంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, ఆరిజిన్ ఫార్మాస్యూటికల్స్ సీఈఓ అఖిల్ రవి మంగళవారం భేటీ అయ్యారు. తమ విస్తరణ ప్రణాళికలో భాగంగా జీనోమ్ వ్యాలీలో ఏర్పాటయ్యే ఈ యూనిట్ ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా మరో 60 నుంచి 70 మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అఖిల్ రవి వెల్లడించారు. హైదరాబాద్‌లో అద్భుతమైన మౌలిక వసతులు, మానవవనరులు ఉన్నందునే తాము పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. ఆరిజిన్ ఫార్మాస్యూటికల్ విస్తరణ ప్రణాళికలు, పెట్టుబడి బయో ఫార్మాస్యూటికల్ రంగంలో హైదరాబాద్ స్థానాన్ని బలోపేతం చేస్తుందన్న విశ్వాసాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు.

విద్యాభివృద్ధిపై చేతలు, మాటలకు పొంతనేది?

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల



సాక్షి, హైదరాబాద్: విద్యాభివృద్ధిపై సీఎం కేసీఆర్ చెప్పే మాటలకు, చేతలకు పొంతనే ఉండదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. ‘ఏటా అడ్మిషన్లు హైక్ అంటూ ఫేక్ కథలు అల్లారు. కానీ అడ్మిషన్లు లేక మూతపడుతున్న బడులు కేసీఆర్ పాలనకు చిహ్నాలు’అని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యకు కొమ్ముగాయడమే కేసీఆర్ ప్లాన్ అని ఆరోపించారు. రూ.5 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా వృత్తివిద్యను ఆగం చేశారని మండిపడ్డారు.

రాజగోపాల్‌రెడ్డితో పొంగులేటి, జూపల్లి భేటీ

- కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానం..
- వేచిచూసే ధోరణిలో స్పందించిన కోమటిరెడ్డి?

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆ పార్టీలో చేరనున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమయ్యారు. మంగళవారం అప్పా జంక్షన్ సమీపంలోని పొంగులేటి నివాసంలో వారు కలిసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి రావాలని పొంగులేటి, జూపల్లి కోరగా వేచిచూసే ధోరణిలో ఆయన స్పందించారని సమాచారం. ఖమ్మం సభ ముగిశాక కొల్లాపూర్ సభకు సిద్ధమవుతున్న పొంగులేటి, జూపల్లి... కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలవడం, పార్టీలోకి ఆహ్వానించారనే వార్తలు రావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజగోపాల్‌రెడ్డితోపాటు పలువురు నేతలను పొంగులేటి రహస్యంగా కలుస్తున్నారని సమాచారం. బీఆర్‌ఎస్, బీజేపీలలోని అసంతృప్త నేతలను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చే దిశగా పొంగులేటి పావులు కదుపుతున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే ధ్యేయంగా ఈ చర్చల పరంపర కొనసాగుతోందని పొంగులేటి సన్నిహితులు చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు నేతలు కొల్లాపూర్‌లో జరిగే జూపల్లి చేరిక సభలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని వారు చెబుతుండడం గమనార్హం.

ఎదురుకాల్పుల్లో నలుగురు మావోల మృతి?

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల శిబిరంపై పోలీసు బలగాలు దాడి చేశాయి. జిల్లాలోని ఇసల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారన్న పక్కా సమాచారంతో సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ, కోబ్రా 210వ బెటాలియన్ల బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇసల్నార్ సమీపంలోని అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణార్థం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు గాయపడ్డారు. అయితే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఘటనాస్థలం నుంచి మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, నిత్యావసరాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కూంబింగ్ ముమ్మరం చేసిన పోలీసులు.. గాయపడిన నలుగురు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

వార్ మెమోరియల్‌ను పోలినట్టు పాలమూరు శిల్పారామం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కొరియా వార్ మెమోరియల్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఆసియాలోనే ప్రఖ్యాతిగాంచిన దక్షిణ కొరియాలోని వార్ మెమోరియల్ ఆఫ్ కొరియాలో ఉన్న సైనిక కళాఖండాలను పోలిన విధంగా మహబూబ్‌నగర్ మినీ శిల్పారామాన్ని తీర్చిదిద్దుతామని ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం ఆ దేశ రాజధాని సియోల్‌లోని వార్ మెమోరియల్ ఆఫ్ కొరియాను సందర్శించారు. 1950 యుద్ధ సమయంలో దక్షిణ కొరియా రక్షణకు భారత్ అందించిన సహకారాన్ని గుర్తుచేసుకుంటూ ఏర్పాటు చేసిన స్మారక స్తూపాన్ని సందర్శించారు. యుద్ధ ట్యాంకులు, బీ–52 బాంబర్లతో సహా అనేక రకాల సైనిక కళాఖండాలను తాము తిలకించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ సైనిక మ్యూజియంలోని పలు కళాఖండాలను పోలిన వాటిని మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ కోత పెడితే.. డిస్కంలకు వాతే

- నిరంతర సరఫరా వినియోగదారుల హక్కు
- నిర్దేశిత గడువులోగా అన్ని సేవలందించాలి
- లేకుంటే వినియోగదారులకు పరిహారం ఇవ్వాలి
- డిస్కంలకు కేంద్ర విద్యుత్ శాఖ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు విధించడానికి వీల్లేదని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. సరైన కారణాలు లేకుండానే ఉద్దేశపూర్వకంగా విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తే సంబంధిత డిస్కంల నుంచి పరిహారం కోరే హక్కును వినియోగదారులు కలిగి ఉన్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యుత్ వినియోగదారుల హక్కుల నిబంధనలు–2020ను 2020 డిసెంబర్ 31న అమల్లోకి తెచ్చినట్టు పేర్కొంది. ఈ నిబంధనల పట్ల వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించడానికి గత కొన్ని రోజులుగా జాతీయ పత్రికల్లో వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తోంది. ఈ నిబంధనల ప్రకారం 24X7 విద్యుత్ సరఫరా పొందడం వినియోగదారుల హక్కు అని, ఒకవేళ కోతలు విధిస్తే వారికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. విద్యుత్ కనెక్షన్ జారీ, కనెక్షన్ తొలగింపు, రీకనెక్షన్, షిఫ్టింగ్, కేటగిరీ మార్పు, లోడ్ సామర్థ్యం మార్పు, బిల్లుల జారీ, వోల్టేజీ/బిల్లుల సంబంధిత సమస్యల పరిష్కారం తదితర సేవలను వినియోగదారులకు అందించేందుకు తీసుకోవాల్సిన గరిష్ట కాల వ్యవధులతో కూడిన మార్గదర్శకాలను ఈ నిబంధనల్లో పొందుపరిచినట్టు వెల్లడించింది. ఈ సేవల్లో జాప్యం జరిగితే వినియోగదారులకు పరిహారం చెల్లించక తప్పదని హెచ్చరించింది.

20 కోట్ల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

- అడవుల పునరుజ్జీవన కార్యక్రమం కూడా..
- గిరిజనుల అభ్యున్నతికే పోడు పట్టాల పంపిణీ
- అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



గిరిజనులకు పోడు పట్టా అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో వర్షాలు కురవగానే 20 కోట్ల మొక్కలు నాటుతామని అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు 272 కోట్ల మొక్కలు నాటినట్లు చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో మంగళవారం గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. వర్షాలు సకాలంలో పడటం లేదని.. వానలు కురవాలన్నా, మనం మంచిగా బతకాలన్నా మొక్కలు పెంచాలని.. చెట్లు నరకవద్దని విజ్ఞప్తి చేశారు. పోడు హక్కు పత్రాలు పొందిన వారి ఖాతాల్లో మరో ఎనిమిది, పది రోజుల్లో రైతుబంధు కూడా జమ అవుతుందన్నారు. ఇక అడవుల లోపలికి వెళ్లొద్దని, ఆ ప్రయత్నం చేయవద్దని అటవీ అధికారులకు సూచించారు. అటవీ అధికారులు పూర్తిస్థాయిలో ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తారని తెలిపారు. పల్చబడ్డ అడవుల్లో పునరుజ్జీవన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యేలు రేఖాశ్యామ్‌నాయక్, రాథోడ్ బాపురావు పాల్గొన్నారు.



రామడుగు: గాయత్రి పంపుహౌజ్ మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీరు

ఆరు మోటార్లతో ఎత్తిపోతలు

- లక్ష్మీ పంపుహౌస్‌లో రెండోరోజు కొనసాగిన ఎత్తిపోతలు
- సరస్వతీ బ్యారేజీకి 1.21 టీఎంసీ తరలింపు

కాళేశ్వరం/రామడుగు/ధర్మారం/రామగుండం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో ఆరు మోటార్లతో నీటిని ఎత్తిపోస్తున్నారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రాణహిత నది ద్వారా వస్తున్న నీటిలభ్యతతో మంగళవారం రెండో రోజు లక్ష్మీపంపుహౌస్‌లో 11 మోటార్లలోని 6 మోటార్లతో 12 పంపుల ద్వారా నీటిని డెలివరి సిస్టర్న్‌లో ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోసిన జలాలు గ్రావిటీకాల్వ ద్వారా అన్నారం (సరస్వతీ)బ్యారేజీకి తరలిపోతున్నాయి. ఒక్కో మోటార్ 2,119 క్యూసెక్కుల నీరు ఎత్తిపోయగా 6 మోటార్లతో సోమ, మంగళవారాల్లో 1.21 టీఎంసీల నీరు అన్నారం బ్యారేజీకి తరలించినట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే మోటార్లు రన్ చేయడానికి ఆదేశాలు ఉన్నాయి. నీటి లభ్యతను బట్టి మోటార్లతో ఎత్తిపోయడానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తెలంగాణలో వర్షాభావ పరిస్థితులతో గోదావరిలో ఎక్కడా నీరు లేదు. కాగా, మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది ద్వారా నీటి ఇన్‌ఫ్లో రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం 20 వేలకుపైగా క్యూసెక్కుల వరద కాళేశ్వరం మీదుగా మేడిగడ్డ (లక్ష్మీ)బ్యారేజీకి చేరుతుంది. దీంతో బ్యారేజీలో మొత్తం 85 గేట్లన్నీ మూసి ఉండగా, బ్యాక్‌వాటర్ పెరిగి కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్‌లో మోటార్లతో ఎత్తిపోస్తున్నారు.

గాయత్రి పంపుహౌజ్ నుంచి నీటి విడుదల

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద గాయత్రి పంపుహౌజ్ నుంచి రెండు మోటార్ల ద్వారా అధికారులు మంగళవారం సాయంత్రం నీటిని ఎత్తిపోస్తున్నారు. పంపుహౌజ్ నుంచి 1, 5వ బాహుబలి మోటార్లను అధికారులు ప్రారంభించి గ్రావిటీ కాలువ ద్వారా వరదకాలువలోకి విడుదల చేశారు. పంపుల ద్వారా వెళ్లే నీరు వరదకాలువ ద్వారా మిడ్‌మానేరులోకి చేరనుంది. అలాగే రామగుండం వద్దగల ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.



ఆర్టీసీ కల్యాణ మండపంలో కార్మికులను ప్రగతి చక్రం వార్షిక పురస్కారాలతో సత్కరించిన చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్, ఎండీ సజ్జనార్ తదితరులు

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల కృషి భేష్

టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): తెలంగాణ ఆర్టీసీలో నష్టాలను పూడ్చేందుకు కార్మికులు చేస్తున్న కృషి అభినందనీయమని, వారి కృషి వల్లే సంస్థ లాభాల బాటలోకి వస్తోందని టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్ పేర్కొన్నారు. ఆర్టీసీ కల్యాణ మండపంలో మంగళవారం టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి రథచక్రం వార్షిక పురస్కారాలను అందజేశారు. ఆర్‌ఎం, డిప్యూటీ ఆర్‌ఎం, డ్రైవర్, కండక్టర్లకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాజిరెడ్డి గోవర్దన్ మాట్లాడుతూ ఇప్పటికే కార్మికులకు ఏడు డీఏలు ఇచ్చామని మరో డీఏ ఇవ్వడంతోపాటు నూతన వేతన సవరణ ఒప్పందాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ కార్మికులు అంకితభావంతో పనిచేయడం వల్లే ఆర్టీసీ గాడినపడిందన్నారు. త్వరలో వరంగల్‌లో రూ.80 కోట్లతో, నిజామాబాద్‌లో రూ.30 కోట్లతో బస్టాండ్‌లను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

క్లుప్తంగా...

ఉమ్మడి పౌరస్మృతి అమలుకు టైమొచ్చింది

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

గువాహటి: దేశంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)ని అమలు చేయడానికి సమయం వచ్చిందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. యూసీసీని అమలు చేయాలని రాజ్యాంగ నిర్మాతలు సైతం అభిప్రాయపడ్డారని గుర్తుచేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ఇదే విషయం చెబుతోందని అన్నారు. మంగళవారం ఐఐటీ–గువాహటి 25వ స్నాతకోత్సవంలో జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగించారు. యూసీసీ అమలుకు ఎలాంటి అడ్డంకులు లేవని, ఇక జాప్యం చేయొద్దని పేర్కొన్నారు. అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని సూచించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యూసీసీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి పౌరస్మృతి మన దేశాన్ని ఐక్యంగా మారుస్తుందని అభిప్రాయపడ్డారు.

‘కులవ్యవస్థ’ పిల్‌ల కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: కులవ్యవస్థను పునర్విభజన చేయాలని, ప్రత్యామ్నాయ రిజర్వేషన్ విధానం రూపొందించడానికి వీలుగా క్రమంగా రిజర్వేషన్లను తొలగించాలని కోరుతూ దాఖలైన వేర్వేరు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. న్యాయవాది సచిన్ గుప్తా దాఖలు చేసిన పిటిషన్లను మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం విచారించింది. ‘‘రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం కులవ్యవస్థ పునర్విభజన నిమిత్తం ఓ విధానాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరడం చట్ట ప్రక్రియను దుర్వినియోగపరచడమే. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం. ఇటువంటి పిల్‌లను వెంటనే ఆపేయాలి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.25 వేలు చెల్లించాలని పిటిషనర్‌ను ఆదేశిస్తున్నాం. పిటిషనర్ రెండు వారాల్లో రశీదు సమర్పించాలి’’అని సీజేఐ చంద్రచూడ్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎం స్టాలిన్‌కు రెండు రోజుల విశ్రాంతి

సాక్షి, చెన్నై: తమిళనాడు సీఎం, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ చెన్నై అపోలో ఆస్పత్రి నుంచి మంగళవారం డిశ్చార్జి అయ్యారు. ఆయనకు కనీసం రెండు రోజులు విశ్రాంతి తప్పనిసరి అని వైద్యులు సూచించినట్టు తెలిసింది. ఇక సోమవారం సాయంత్రం స్టాలిన్ అపోలో ఆస్పత్రిలో జాయినైన విషయం తెలిసిందే. సాధారణ వైద్య పరీక్షల కోసమే ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వైద్యులు ప్రకటించారు. మంగళవారం ఉదయం 9.50 గంటలకు డిశ్చార్జి అయ్యారు. వైద్యుల సూచనల మేరకు సీఎం స్టాలిన్‌కు రెండు రోజులపాటు అన్ని కార్యక్రమాలను రద్దు చేసినట్లు సీఎంవో తెలిపింది.

సమయం ఆదియందు... మెల్లిగా సాగెను...!

ఎంతకూ రాని బస్సు కోసం అసహనంగా ఎదురు చూస్తున్నప్పుడో, చేస్తున్న పని పరమ బోరుగా అనిపిస్తున్నప్పుడో ఎలా ఉంటుంది? టైం అస్సలు సాగడం లేదని అనిపిస్తుంది. కదూ! కానీ ఆదియందు, అంటే బిగ్ బ్యాంగ్ జరిగి, ఆ మహా విస్ఫోటనం నుంచి ఈ మహా సృష్టి పురుడు పోసుకుంటున్న తొలినాళ్లలో సమయం నిజంగానే నింపాదిగా సాగేదట! ఎంతగా అంటే, ఇప్పటి వేగంలో అది కేవలం ఐదో వంతు మాత్రమేనని అంతరిక్ష శాస్త్రవేత్తలు తాజాగా సూత్రీకరించారు...!

- సాక్షి, నేషనల్ డెస్క్

సృష్టి తొలినాళ్లలో సమయ విస్తరణ (టైం డైలేషన్) తీరుతెన్నులపై సిడ్నీ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తాజాగా ఓ అధ్యయనం జరిపారు. కాసర్స్ అని పిలిచే సృష్టిలోకెల్లా అతి తేజోమయమైన, అత్యంత చురుకైన బృహత్ కృష్ణబిలాల సమూహాలను లోతుగా పరిశీలించారు. దాదాపు 1,230 కోట్ల ఏళ్ల క్రితం కాలం ఇప్పుడు సాగుతున్న వేగంలో కేవలం ఐదో వంతు వేగంతో నడిచేదని తేల్చారు.

ఇలా చేశారు: పరిశోధక బృందం తమ అధ్యయనానికి కాసార్స్‌ను కాలమానినిగా మార్చుకుంది. బిగ్ బ్యాంగ్ తరువాత దాదాపు 150 కోట్ల ఏళ్ల కాల పరిధిలోని మొత్తం 190 కాసర్స్ నుంచి వెలువడే దురిక్షీక్ష్య కాంతులను పరిశోధనలో వాడుకుంది. పలు తరంగదైర్ఘ్యాల్లో వాటి ప్రకాశాన్ని నేడు ఉనికిలో ఉన్న కాసర్స్‌తో సరిపోల్చారు. కాల ప్రవాహ గతిలో చోటు చేసుకునే కీలక నిర్దిష్ట మార్పుల్లో కొన్ని నేటితో పోలిస్తే అప్పట్లో కేవలం ఐదో వంతు వేగంతో జరిగేవని తేల్చారు.



‘కాలమనే కాన్సెప్ట్ మనకింకా పూర్తిగా అర్థమే కాలేదని చెబితే అతిశయోక్తి కాబోదు. కాలం తీరుతెన్నులు, పరిమితులు తదితరాల గురించి కూడా మనకు తెలిసింది బహు స్వల్పం. అందుకే టైం ట్రావెల్ (భూత, భవిష్యత్తులోకి వెళ్లగలగడం) వంటివి సాధ్యం కాదని చెబితే అది తొందరపాటే అవుతుంది’

– గెరైంట్ లెవిస్, అధ్యయన బృంద సారథి, సిడ్నీ యూనివర్సిటీ

కోటి సూర్య సమప్రభలు...

కాసర్స్ అని పిలిచే కాంతిపుంజ సమూహంలోని ఒక్కో కృష్ణ బిలం పరిమాణం అత్యంత భారీగా ఉంటుంది. ఎంతగా అంటే, కొన్ని కృష్ణ బిలాలు సూర్యుని కంటే ఏకంగా కొన్ని వందల కోట్ల రెట్లు పెద్దవి! అవి తమ పరిధిలోకి వచ్చిన ఎంతటి పదార్థాన్ని అయినా అనంత ఆకర్షణ శక్తితో లోనికి లాగేసి అమాంతంగా మింగేస్తాయి. ఆ క్రమంలో లెక్క లేనన్ని వెలుతురు పుంజాలను సృష్టి మూలమూలలకూ వెదజల్లుతుంటాయి. చుట్టూ అనంత కాంతి వలయాలతో వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి.

మళ్లీ పేలిన తూటా..

అమెరికాలో 8 మంది మృతి



ఫిలడెల్ఫియాలో ఘటనాస్థలిలో పోలీస్ వాహనాలు

ఫిలడెల్ఫియా: అమెరికాలో 24 గంటల వ్యవధిలోనే మరో రెండు కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి బాల్టిమోర్‌లో బ్లాక్‌పార్టీపై జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 28 మంది గాయాలపాలైన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి టెక్సాస్, ఫిలడెల్ఫియాల్లో జరిగిన కాల్పుల ఘటనల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా ఇద్దరు బాలురు సహా మరో 10 మంది గాయపడ్డారు. ఫిలడెల్ఫియాలోని కింగ్‌సెస్సింగ్‌లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించిన సాయుధుడు వీధుల్లో తిరుగుతూ కనబడిన వారిపైకి కాల్పులు సాగించాడు. సమాచారం అందుకుని పోలీసులు చుట్టుముట్టడంతో అతడు లొంగిపోయాడు. ఆగంతకుడి వద్ద నుంచి ఏఆర్ రైఫిల్, హ్యాండ్‌గన్ స్వాధీనం చేసుకున్నారు. అతడి కాల్పుల్లో అయిదుగురు చనిపోయారు. మరో ఇద్దరు 2, 13 ఏళ్ల బాలురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. మరో ఘటన..టెక్సాస్‌లోని ఫోర్ట్‌వర్త్‌లో స్థానిక ఉత్సవం కోమోఫెస్ట్‌లో పాల్గొన్న జనంపైకి గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 8 మంది గాయపడ్డారు.

ట్విట్టర్‌కు పోటీగా మెటా ‘థ్రెడ్స్’

లండన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్‌కు మరో సవాల్ ఎదురవనుంది. ట్విట్టర్‌ను ఢీకొట్టేందుకు మెటా తాజాగా థ్రెడ్స్ అనే యాప్‌ను సిద్ధం చేసింది. యాపిల్‌కు చెందిన యాప్ స్టోర్‌లో ఇది కనిపిస్తోంది. ట్విట్టర్‌లో మాదిరిగానే దీనిలోనూ టెక్ట్స్ రూపంలో మెసేజీలను లైక్ చేయవచ్చు. షేర్, కామెంట్ కూడా చేయవచ్చని యాప్ స్టోర్ లిస్టింగ్‌లోని స్క్రీన్‌షాట్‌ను బట్టి తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే ఈ విషయాన్ని మెటా అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. ఇది ఇన్‌స్టాగ్రామ్‌కు లింకై ఉన్న ‘టెక్ట్స్ బేస్డ్ కన్వర్జేషన్ యాప్’. ‘నేటి నుంచి రేపటి ట్రెండింగ్‌లో ఉండే అన్ని అంశాల వరకు చర్చించుకునే సమూహాల కోసమే థ్రెడ్స్’ అని మెటా తెలిపింది. ఇన్‌స్టాగామ్ యూజర్లు అదే అకౌంట్లతో కొత్త యాప్‌లోనూ కొనసాగవచ్చునని చెబుతున్నారు. దీనిపై మెటా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఎలాన్ మస్క్ గత ఏడాది ట్విట్టర్‌ను కొనుగోలు చేశాక చేపట్టిన పలు మార్పులపై యూజర్లు అసంతృప్తితో ఉన్న సమయంలో మెటా ‘థ్రెడ్స్’ను తేనుండటం గమనార్హం.

ఉగ్రపోరులో ద్వంద్వ ప్రమాణాలొద్దు

సీమాంతర ఉగ్రవాదానికి మద్దతిచ్చే దేశాలను విమర్శించాల్సిందే ● ఎస్సీఓ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలను కఠినంగా అణచివేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హితవు పలికారు. పాకిస్తాన్‌కు పరోక్షంగా చురకలు అంటించారు. కొన్ని దేశాలు ప్రభుత్వ విధానాల్లో భాగంగానే సీమాంతర ఉగ్రవాదానికి నిస్సిగ్గుగా మద్దతిస్తున్నాయని, అలాంటి దేశాలను విమర్శించడానికి ఎవరూ సంకోచించవద్దని సూచించారు. మంగళవారం షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) వర్చువల్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉగ్రవాదాన్ని, ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చే శక్తులను అణచివేయడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతికి ఉగ్రవాదం ఒక పెనుముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు తొలగిపోవాలంటే ఎస్సీఓ సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని, పరస్పరం సహకరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ అంతం చేయాల్సిందేనని మోదీ స్పష్టం చేశారు.

ఎస్సీఓలో సంస్కరణలకు మద్దతు

ప్రపంచ దేశాలన్నీ ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొంటున్నాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత పెద్ద సవాలుగా మారిందన్నారు. పొరుగు దేశాలతో వివాదాలు, అంతర్గతంగా ఉద్రిక్తతలు, మహమ్మారులతో ఎన్నో దేశాలు అల్లాడిపోతున్నాయని చెప్పారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఉమ్మడి ప్రయత్నాలు అవసరమని తెలిపారు. ఆసియా, ఐరోపా ఖండాల్లో శాంతికి, సౌభాగ్యానికి, అభివృద్ధికి ఎస్సీఓ అనేది ఒక కీలకమైన వేదికగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీఓ సభ్య దేశాలతో సహకారం మరింత పెంపొందించుకుంటామని అన్నారు. స్టార్టప్‌లు, నవీన ఆవిష్కరణలు, సంప్రదాయ వైద్యం, యువజనం సాధికారత, డిజిటలీకరణ వంటి రంగాల్లో ఇతర దేశాలతో సంబంధాలు పెంచుకుంటామని వెల్లడించారు. ఎస్సీఓలో సంస్కరణలు, ఆధునీకరణ ప్రతిపాదనకు తమ మద్దతు ఉంటుందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. షాంఘై సహకార సంస్థలో ఇరాన్ సైతం సభ్యదేశంగా చేరుతుండడం ఆనందంగా ఉందన్నారు. ఎస్సీఓ వర్చువల్ సదస్సులో పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధినేత పుతిన్‌తోపాటు కజకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాల నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఎస్సీఓ 2001లో షాంఘైలో ఏర్పాటయ్యింది. భారత్ 2005లో ఈ సంస్థలో పరిశీలక దేశంగా చేరింది. 2017లో పూర్తి స్థాయి సభ్యదేశంగా మారింది.



సదస్సులో మోదీ, పుతిన్, జిన్‌పింగ్, పాక్ ప్రధాని షరీఫ్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసి

ఆసియాలో కొత్త ప్రచ్ఛన్న యుద్ధం వద్దు: జిన్‌పింగ్

బీజింగ్: ఆసియా ప్రాంతంలో కొత్తగా ప్రచ్ఛన్న యుద్ధాన్ని సృష్టించేందుకు బయటి శక్తులు కుట్ర పన్నుతున్నాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పరోక్షంగా అమెరికాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఎస్సీఓ వర్చువల్ సదస్సులో మాట్లాడారు. ప్రాంతీయంగా శాంతిని కాపాడుకోవడానికి ఎస్సీఓ సభ్యదేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఉగ్రవాదంపై కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ... ఇటీవల జరిగిన సాయుధ తిరుగుబాటును రష్యా సమాజం మొత్తం ఒక్కటై వ్యతిరేకించిందని చెప్పారు. మాతృదేశాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా కంకణబద్ధులై ఉన్నారని తెలిపారు. వాగ్నర్ గ్రూప్ యత్నాలను ఆయన ప్రస్తావించారు.



ఈ తినుబండారం పేరు ‘ కీ లైమ్ పై’. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో మన్రో కౌంటీ ఏర్పాటై 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 13 అడుగుల వ్యాసంతో ఇలా భారీ ‘కీ లైమ్ పై’ తయారుచేశారు. ఇది ప్రపంచ రికార్డు సాధిస్తుందని భావిస్తున్నారు. గుడ్డు, పాలు, నిమ్మరసం తదితరాలను కలిపి లైవ్ పైని తయారు చేశారు.

బీజేపీ రాష్ట్ర శాఖలకు కొత్త సారథులు

ఎన్నికల వేళ బీజేపీ కీలక మార్పులు

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికలు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని అధికార బీజేపీ సంస్థాగతంగా కీలక మార్పులు చేపట్టింది. దీంతో, త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందంటూ కొన్ని రోజులుగా వస్తున్న ఊహాగానాలకు బలం చేకూరినట్లయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పార్టీకి కొత్త సారథులను నియమించింది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని, ఏపీ చీఫ్‌గా కేంద్ర మాజీ మంత్రి డి.పురందేశ్వరిని నియమించింది. అదేవిధంగా, పంజాబ్ బాధ్యతలు సునీల్ జాఖడ్‌కు, జార్ఖండ్ చీఫ్‌గా బాబూలాల్ మరాండీకి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు బీజేపీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్ బాధ్యతలను ఓబీసీ నేత ఈటెల రాజేందర్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపింది. మరికొద్ది నెలల్లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండగా అధికార భారత రాష్ట్ర సమితిని దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ఈ మార్పులు చేపట్టినట్లు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్థానంలో కేంద్ర మాజీ మంత్రి డి.పురందేశ్వరికి బాధ్యతలు అప్పగించింది. ఈమె యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. అలాగే, పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు దీపక్ ప్రకాశ్ స్థానంలో రాష్ట్ర కాంగ్రెస్ మాజీ చీఫ్ సునీల్ జాఖడ్‌కు పగ్గాలు అప్పగించింది. అదేవిధంగా, జార్ఖండ్‌లో గిరిజన నేత, సీఎం హేమంత్ సోరెన్‌ను ఢీకొట్టేందుకు అదే వర్గానికి చెందిన మాజీ సీఎం మరాండీని రంగంలోకి దించింది. మరాండీ తన జార్ఖండ్ వికాస్ మోర్చా(ప్రజాతాంత్రిక్)ను 2020లో బీజేపీలో విలీనం చేశారు.



బాబూలాల్



సునీల్ జాఖడ్

తల్లి కొడుతుంటే తట్టుకోలేక..

బీజింగ్: తల్లి కొడుతుంటే తట్టుకోలేని ఓ ఆరేళ్ల బాలుడు బాల్కనీలోకి వెళ్లి అయిదో అంతస్తు నుంచి కిందికి దూకేశాడు. దీంతో ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జూన్ 25వ తేదీన చైనాలోని అన్హుయి ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తల్లి కొడుతుండటంతో తాళలేని బాలుడు బాల్కనీలోని ఎయిర్ కండిషనర్‌పైకి చేరుకున్నాడు. అది చూసిన పొరుగువారు కొట్టడం ఆపాలని తల్లిని పదేపదే కోరారు. కిందపడతావు..లోపలికి రమ్మంటూ తల్లి కూడా బాలుడిని గద్దించింది. తీవ్రంగా భయపడిన బాలుడు మాత్రం ఎవరూ ఊహించని విధంగా అంత ఎత్తు నుంచి కిందికి దూకేశాడు. వెంటనే బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాణాపాయం లేదని, పలు చోట్ల ఎముకలు విరిగాయని డాక్టర్లు తెలిపారు. బాలుడు దూకుతున్న ఘటన వీడియోను పొరుగింటి వ్యక్తి చిత్రీకరించి చైనా వెర్షన్ ట్విట్టర్ ‘వీబో’లో అప్‌లోడ్ చేయగా కోటి మందికి పైగానే వీక్షించారు. అధికారులు మాత్రం.. బాలుడు బాల్కనీ నుంచి ఇంట్లోకి రావాలనే తల్లి కొట్టిందని, కానీ అతడు ప్రమాదవశాత్తు కింద పడి పోయి ఉంటాడని అంటున్నారు. వారి వైఖరిని నెటిజన్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు.



మాస్కోపై డ్రోన్ల దాడి యత్నం భగ్నం

ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేశామన్న రష్యా

మాస్కో: రష్యా రాజధాని మాస్కోపై దాడి చేసేందుకు ఉక్రెయిన్ సైన్యం డ్రోన్లను ప్రయోగించిందా? నిజమేనని చెబుతోంది రష్యా వైమానిక దళం. ఉక్రెయిన్ ప్రయత్నాన్ని భగ్నం చేశామని వెల్లడించింది. ఉక్రెయిన్ సైన్యం మంగళవారం ఐదు డ్రోన్లు ప్రయోగించిందని, వెంటనే ఈ విషయం గుర్తించి మాస్కోలో ఒక విమానాశ్రయాన్ని మూసివేశామని రష్యా ఆర్మీ తెలియజేసింది. మరికొన్ని విమానాలను దారి మళ్లించామని పేర్కొంది. మాస్కోలో గతంలోనూ పలుమార్లు డ్రోన్ దాడులు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. రష్యా కిరాయి సైన్యమైన వాగ్నర్ గ్రూప్ చీఫ్ ప్రిగోజిన్ తిరుగుబాటు యత్నం విఫలమైన తర్వాత డ్రోన్‌తో దాడి చేసేందుకు ఉక్రెయిన్ ప్రయత్నించడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్ సైన్యం ఐదు డ్రోన్లను ప్రయోగించగా, వాటిలో నాలుగింటిని కూల్చివేశామని, మరో డ్రోన్‌ను సురక్షితంగా కిందికి దింపామని రష్యా రక్షణ శాఖ తెలియజేసింది. ఈ దాడులతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని మాస్కో మేయర్ సెర్గీ సొబ్‌యానిన్ చెప్పారు. అయితే, ఈ వ్యవహారంపై ఉక్రెయిన్ ఇంకా స్పందించలేదు.

ఇజ్రాయెల్ భారీ సైనిక ఆపరేషన్

జెనిన్: శరణార్థుల శిబిరాల్లో మాటు వేసిన పాలస్తీనా ఉగ్రవాదులను ఏరివేయడం, వారి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా వెస్ట్‌బ్యాంక్‌పై ఇజ్రాయెల్ సేనలు విరుచుకుపడుతున్నాయి. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల క్యాంప్‌లో సోమవారం నుంచి విస్తృతంగా సోదాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం సైతం దాడులు కొనసాగాయి. దీంతో వేలాది మంది పాలస్తీనా శరణార్థులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. దాదాపు 4,000 మంది పాలస్తీనా శరణార్థులు బయటకు వెళ్లిపోయారని జెనిన్ నగర మేయర్ నిడాల్ అల్–ఒబిడీ చెప్పారు. మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇప్పటి దాకా 10 మంది మరణించారు. వారంతా ఉగ్రవాదులేనని ఇజ్రాయెల్ సైన్యం చెబుతున్నప్పటికీ ఇంకా నిర్ధారణ కాలేదు. పెద్ద సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని, జెనిన్ క్యాంప్‌లో మసీదు కింద ఉన్న సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. జెనిన్ క్యాంప్‌లో ఈ స్థాయిలో సైనిక ఆపరేషన్ జరుగుతుండడం గత 20 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ వాసులపై ఇటీవలి కాలంలో దాడులు జరుగుతున్నాయి. గతనెలలో జరిగిన కాల్పుల్లో నలుగురు మృతిచెందారు. అంతేకాకుండా పాలస్తీనా ఉగ్రవాదుల కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. దీంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూపై అంతర్గతంగా ఒత్తిడి పెరిగింది. తమ పౌరులకు ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదులను ఏరివేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ వెస్ట్‌బ్యాంక్‌లు పాలస్తీనా పౌరులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. జెనిన్ సిటీపై పాలస్తీనాకు చెందిన హమాస్ ఉగ్రవాదులకు గట్టిపట్టుంది. వెస్ట్‌బ్యాంక్, తూర్పు జెరూసలేం, గాజా స్ట్రిప్‌ను 1967లో జరిగిన యుద్ధంలో పాలస్తీనా నుంచి ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. వాటిని తిరిగి తమకు అప్పగించాలని పాలస్తీనా డిమాండ్ చేస్తోంది.



ఇజ్రాయెల్ సైనిక వాహనం వద్ద బాంబు పేలుడు దృశ్యం

భారత కాన్సులేట్‌పై ఖలిస్తానీల దాడి

ఖండించిన అమెరికా ప్రభుత్వం

న్యూయార్క్: అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై ఖలిస్తానీ మద్దతుదారులు దాడి చేశారు. కార్యాలయానికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించారు. ఇక్కడి కాన్సులేట్‌పై మార్చి 19వ తేదీన కూడా ఖలిస్తానీ వాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. తాజా ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దీనిని నేరపూరిత చర్యగా పేర్కొంది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై దాడికి సంబంధించిన వీడియోను ఖలిస్తానీ వాదులు ఈ నెల 2న ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ‘హింస హింసను ప్రేరేపిస్తుంది’ అంటూ అందులో ఉంది. కెనడా కేంద్రంగా పనిచేసే ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) చీఫ్ హర్దీప్ సింగ్ నిజ్జర్ మృతికి సంబంధించిన వార్తా కథనాలు అందులో ఉన్నాయి. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న నిజ్జర్ తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది. కెనడాలోని ఓ గురుద్వారా వద్ద ఉన్న అతడిని గత నెలలో దుండగులు కాల్చి చంపారు. కాగా, తాజా ఘటనపై అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సోమవారం ట్వీట్ చేశారు. ‘ఈ ఘటనను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోంది. దౌత్య కార్యాలయాలపై జరిగే దాడులు అమెరికాలో నేరపూరిత చర్యల కిందికి వస్తాయి’ అని పేర్కొన్నారు. దాడి ఘటన వీడియోను దక్షిణాసియాకు సంబంధించిన దియా టీవీ ప్రసారం చేసింది. ‘ఆదివారం 1.30–2.30 గంటల మధ్య భారత కాన్సులేట్‌కు నిప్పుపెట్టారు. వెంటనే ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. నష్టం స్వల్పం. సిబ్బందికి ఎటువంటి హాని జరగలేదు’ అని తెలిపింది. ఇలా ఉండగా, ఈ నెల 8న కాలిఫోర్నియాలోని బర్కెలీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత ఎంబసీ వరకు ‘ఖలిస్తాన్ ఫ్రీడం ర్యాలీ’ ఉంటుందని సోషల్ మీడియాలో ఒక పోస్టర్ షేర్ అవుతోంది.



కాన్సులేట్‌లో చెలరేగుతున్న మంటలు

అజిత్ పవార్‌కు చేదు అనుభవం

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీలికవర్గం నేత అజిత్ పవార్‌కు చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్ర సచివాలయం సమీపంలోని రాష్ట్రవాది భవన్‌ను పార్టీ వ్యవహారాల కోసం నూతన కార్యాలయంగా వాడుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. భవనాన్ని స్వాధీనం చేసుకోవడానికి అజిత్ పవార్ వర్గం నేతలు మంగళవారం అక్కడికి వెళ్లగా తలుపులకు తాళంవేసి ఉండడంతో నిరాశ చెందారు. కొందరు యువకులు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కానీ లోపలి గదులకు తాళాలు వేసి ఉండడంతో వెనుతిరిగి వెళ్లిపోయారు. రాష్ట్రవాది భవన్‌లో గతంలో మహారాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత అయిన అంబదాస్ దన్వే నివసించారు. ప్రభుత్వం మరో భవనం కేటాయించడంతో ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇలాఉండగా, అసలైన ఎన్సీపీ తమదేనని అజిత్, శరద్ పవార్ వర్గాలు వాదిస్తున్నాయి. ఏ వర్గంలో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు.

సెంథిల్ కేసులో హైకోర్టు భిన్న తీర్పులు

కేసును త్రిసభ్య ధర్మాసనం విచారించాలని సుప్రీం ఆదేశం

సాక్షి, చెన్నై: ‘క్యాష్ ఫర్ జాబ్స్’ఆరోపణలతో మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టు ద్విసభ్య బెంచ్ మంగళవారం భిన్న తీర్పులు వెలువరించింది. దీంతో, త్రిసభ్య ధర్మాసనాన్ని త్వరగా ఏర్పాటు చేసి, విచారణ ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మంత్రి సెంథిల్ అరెస్టు చట్ట విరుద్ధమంటూ ఆయన భార్య మేఘల హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. దీనిపై గత వారం జస్టిస్ నిషా బాను, జస్టిస్ భరత చక్రవర్తిల బెంచ్ ఎదుట వాదనలు ముగిశాయి. మంగళవారం వీరు పరస్పర విరుద్ధమైన తీర్పు ఇచ్చారు. మనీ లాండరింగ్ కేసులో కస్టడీ కోరే అధికారం ఈడీకి లేదని, ఈ పిటిషన్ చెల్లుబాటు అవుతుందని జస్టిస్ నిషా బాను తీర్పు వెలువరించారు. జస్టిస్ భరత చక్రవర్తి మాత్రం.. మేఘల దాఖలు చేసిన పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు. కస్టోడియల్ గడువును పెంచడంతోపాటు, అరెస్టులను చట్టబద్ధంగానే భావిస్తున్నామని తీర్పిచ్చారు. దీంతో, వారంలోగా త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, విచారణను త్వరితగతిన ముగించాలని సుప్రీంకోర్టు మద్రాసు హైకోర్టును ఆదేశించింది.

రాహుల్ గాంధీపై చర్యలు వద్దు

పరువు నష్టం కేసులో జార్ఖండ్ హైకోర్టు ఆదేశాలు

రాంచీ: గతంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి పేరు వ్యవహారంలో పరువు నష్టం కేసును ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి జార్ఖండ్ హైకోర్టు ఊరట కలిగించింది. ఈ కేసు విచారణ కోసం వ్యక్తిగతంగా రాంచీ కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుతానికి రాహుల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌కే ద్వివేదీ ఆదేశాలు జారీ చేశారు. పరువు నష్టం కేసులో తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ రాంచీ ఎంపీ–ఎమ్మెల్యే కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాహుల్ వేసిన పిటిషన్‌పై జార్ఖండ్ హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను ఆగస్టు 16వ తేదీకి వాయిదా వేసింది. 2019 ఏప్రిల్‌లో కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ప్రదీప్ మోదీ అనే వ్యక్తి రాంచీ కోర్టులో పరువు నష్టం దావా వేశారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రక్కు..

10 మంది మృతి, మరో 26 మందికి గాయాలు

ముంబై: అదుపుతప్పిన ఓ ట్రక్కు నాలుగు వాహనాలను ఢీకొట్టి, హోటల్‌లోకి దూసుకెళ్లిన ఘటనలో 10 మంది చనిపోయారు. ఈ ఘటన మహారాష్ట్రలోని ధులే జిల్లాలో చోటుచేసుకుంది. ముంబై–ఆగ్రా హైవేపై ఉన్న పలస్నేర్ గ్రామం వద్ద మంగళవారం ఉదయం ఓ ట్రక్కుకు బ్రేకులు ఫెయిలయ్యాయి. అదుపు తప్పి రెండు బైక్‌లు, ఒక కారు, మరో కంటెయినర్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. ఆపై రహదారి పక్కనే ఉన్న హోటల్‌లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో పది మంది చనిపోగా మరో 26 మంది గాయాలపాలయ్యారు.

సాక్షి కరీంనగర్
బుధవారం | 5 | జూలై | 2023



పత్తి రూ.7,150

జమ్మికుంట: మార్కెట్లో క్వింటాల్ పత్తి రూ.7,150 పలికింది. మార్కెట్‌కు తొమ్మిది వాహనాల్లో 108 క్వింటాళ్లను తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,050, కనిష్ట ధర రూ.7,000 పలికింది.



నీటిలో ముంచి.. ఊపిరి తీసి

కోరుట్ల: తన భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త వరదకాలువ నీటిలో ముంచి ఆమె ఊపిరి తీశాడు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
33.0/25.0

వాతావరణం

జిల్లాలో నేడు ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. ఎండ తీవ్రత తగ్గుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కరీంనగర్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా పాఠశాల నుంచి యూనివర్సిటీ స్థాయివరకు ప్రభుత్వ విద్య నిర్వీర్యమైందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు నిధులు కేటాయించడం లేదని, ఉపాధ్యాయుల భర్తీ అటకెక్కిందని మండిపడ్డారు. ప్రభుత్వం పథకం ప్రకారమే విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఈ ధర్నాలో నగర కార్యదర్శి విష్ణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు, వేణు, జోనల్ ఇన్‌చార్జీలు నితీశ్, శ్రీ వర్ధన్, సాయిప్రసాద్, అజిత్, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటం



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సైదాపూర్: సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాపోరాటాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుద్దెనపల్లి, ఎగ్లాస్‌పూర్, సోమారం గ్రామాల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అదానీ, అంబానీల కోసం, కేసీఆర్ ప్రభుత్వం భూస్వాములు, పెత్తందారుల కోసం పని చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒక్క పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయలేదన్నారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, వొడ్నాల వెంకటేశ్, కంది రవీందర్‌రెడ్డి, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

నలుగురిని కాపాడిన లేక్ పోలీసులు



కౌన్సెలింగ్ ఇస్తున్న లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: మానేరుడ్యాంలో దూకేందుకు యత్నించిన ఓ మహిళ, ముగ్గురు పిల్లలను మంగళవారం లేక్‌పోలీసులు రక్షించారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలానికి చెందిన సంపంగి కవిత(28), తన ఇద్దరు కూతుర్లు, కొడుకుతో కలిసి డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గస్తీలో ఉన్న లేక్‌పోలీసులు గుర్తించి కాపాడారు. లేక్ అవుట్‌పోస్టు ఆర్‌ఎస్‌ఐ ఏ.సురేశ్ సదరు మహిళ, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆర్‌ఎస్‌ఐ సురేశ్, హోంగార్డు అంజనేయులుకు రివార్డు ప్రకటించారు.

ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న డీఈవో

కరీంనగర్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, కలెక్టర్ ఆదేశానుగుణంగా ఆర్థిక అక్షరాస్యతపై జూన్ 27వ తేదీన మండలస్థాయిలో 336మందికి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి పొందిన 26మందికి మంగళవారం నగరంలోని ధన్గర్‌వాడీ ప్రభుత్వ పాఠశాలలో లీడ్ బ్యాంకు మేనేజర్, ఆర్‌బీఐ ఎల్‌డీవో, జిల్లా విద్యాధికారి సహకారంతో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7500, మూడో బహుమతిగా రూ.5వేలు అందజేశారు. 1వ బహుమతి సంతోష్, అశ్విత్ కుమార్(జెడ్పీహెచ్ఎస్ చొప్పదండి), రెండో బహుమతి ఎం.మేరీ ఏంజిల్, ఎం.ఐశ్వర్య(జడ్పీహెచ్ఎస్ చెల్మూర్), మూడో బహుమతి ఎస్.శ్రీజ వర్షిణి, సాత్విక్(జెడ్పీహెచ్ఎస్ రుద్రారం)లు అందుకున్నారు. విజేతలు ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎల్‌డీఎం ఆంజనేయులు, ఆర్‌బీఐ ఎల్‌డీవో పంకజ్ పాటిల్, డీఈవో జనార్దన్‌రావు, కేడీసీసీబీ ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొంచెం మోదం.. ఎంతో ఖేదం..!

- పార్టీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ది తిరుగులేని ముద్ర
- పాదయాత్రలు, అరెస్టులతో జాతీయస్థాయిలో చర్చ..
- బండిని తప్పించడంపై జిల్లా నేతల అసంతృప్తి
- త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి ఎంపీ బండి సంజయ్?
- చేరికల కమిటీ చైర్మన్‌గా ఇంతకాలం ఈటల కినుక
- చివరికి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో పార్టీలో కొంతకాలంగా సాగుతున్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. కరీంనగర్ ఎంపీగా పార్టీ అధ్యక్షుడిగా ఇంతకాలం బీజేపీకి తిరుగులేని విజయాలు అందించిన బండి సంజయ్ స్థానంలో కిషన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. జిల్లా నుంచి పెద్దలీడర్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పించినా.. మరో కీలక పదవి కూడా ఇదే జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను వరించింది. ఇంతకాలం చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటలను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి కల్పించింది. బండిని తప్పించడం, ఈటలకు పదోన్నతి కల్పించడం వంటి పరిణామాలతో పార్టీ, 'బండి' వర్గంలో తీవ్ర నిస్తేజం నెలకొనగా.. ఈటల వర్గంలో కొత్త ఉత్సాహం మొదలైంది. మొత్తానికి పార్టీలో జిల్లా నేతలకు పదవులు మారినా.. అధిష్టానం వద్ద పట్టునిలుపుకోవడంలో కరీంనగర్ నాయకులు మరోసారి సత్తా చాటుకున్నట్లయింది.

బండిని తప్పించడంపై నిరాశ..

బీజేపీకి కొత్త ఊపు తీసుకువచ్చిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఒక సంచలనం. సంఘ్ పరివార్ నేపథ్యమున్న బండి 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా అనూహ్య విజయం సాధించారు. 2020లో రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన బండి సంజయ్ పార్టీకి కొత్త జోష్ నింపారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలి ఉపఎన్నిక దుబ్బాకలో బండి సంజయ్ నేతృత్వంలో పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా విజయం సాధించి రికార్డు సృష్టించింది. అనంతరం బండి తన దూకుడును జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అదేస్థాయిలో కొనసాగించారు. ఏకంగా 46 కార్పొరేటర్ స్థానాల్లో కాషాయజెండా ఎగరేసి అధికార పార్టీకి చెమటలు పట్టించారు. 2021 హుజూరాబాద్ ఎన్నికలోనూ ఈటల రాజేందర్ గెలుపుతో బండి గ్రాఫ్ మరింత పెరిగింది. 2022 జనవరి 317 జీవోకి వ్యతిరేకంగా బండి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడం జాతీయస్థాయిలో చర్చ జరిగింది. ఇటీవల పదో తరగతి పేపర్ లీకేజీలు, భైంసా సభ సమయంలోనూ బండిని పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా కేడర్‌ను ఏకంచేశాయి. 2022 మునుగోడు ఉపఎన్నికల్లోనూ బీజేపీ చివరి వరకు పోరాడింది. ప్రజాసంగ్రామ యాత్రలతో కేవలం తన పార్లమెంటు సెగ్మెంటుకే కాకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించారు. అప్పటిదాకా 10 శాతంగా ఉన్న బీజేపీ ఓటు షేర్‌ను 34.5 శాతానికి పెంచారు.

త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి..

అదే సమయంలో బండి జిల్లాలో సీనియర్లను కలుపుకొనిపోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌ని నేటికీ నియమించకపోవడంపైనా పలు ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో పార్టీలో నగర అధ్యక్షుడిని నియమించకుండా ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ అంటూ జోన్లు విభజించి ఎవరికీ పట్టు దక్కనీయలేదని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో బండి నిర్ణయాలను సమర్థించే ఫాలోవర్లకు కొదవలేదు. బండిని అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియా హోరెత్తి పోతోంది. నగర పశ్చిమ డివిజన్ కార్యవర్గం రాజీనామా చేయడం గమనార్హం. రెండు మూడురోజుల్లో బండి సంజయ్‌ని కీలక పదవి వరించనుందని సమాచారం. కేంద్ర కేబినెట్‌లో బండికి చోటుదక్కనుందని పార్టీ వర్గాల సమాచారం.

ఫలించిన ఈటల మంత్రాంగం..!

జిల్లాలో సీనియర్ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది సుదీర్ఘ రాజకీయ అనుభవం. టీఆర్ఎస్‌లో చేరి అనతికాలంలో కేసీఆర్‌కు కుడిభుజంలా మారారు. తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పాత్ర ప్రజలందరికీ తెలిసిందే. 2004లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రస్థానంప్రారంభించిన ఈటల రాజేందర్ ఆపై వెనుదిరిగి చూసుకోలేదు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో రాష్ట్రంలో మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది తిరుగులేని రికార్డు. ఇందులో 2008, 2009, 2010లో ఏడాదికి ఒకసారి చొప్పున అసెంబ్లీకి గెలుస్తూ హ్యాట్రిక్ సాధించారు. 2021లో మరో ఉపఎన్నికలో విజయం సాధించి అత్యధిక ఉప ఎన్నికలు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సొంతంచేసుకున్నారు.

- 2021లో అనూహ్య పరిస్థితుల మధ్య టీఆర్ఎస్‌ను వీడిన రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఉపఎన్నికలో బీజేపీ నుంచి విజయం సాధించారు. బీజేపీలో చేరికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి రాజేందర్‌ను పార్టీ అధ్యక్షపదవి వరిస్తుందనుకున్నా.. జరగలేదు. ఈ క్రమంలో ఆయన అధిష్టానంపై ఒత్తిడి ప్రారంభించారు. బండికి వ్యతిరేకంగా సీనియర్లను కూడగట్టేందుకు యత్నించారు. ఒకదశలో పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. మొత్తానికి రాజేందర్ వ్యూహం ఫలించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ఈటల వర్గీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'సమీకృత' డిజైన్‌పై మేయర్ ఆగ్రహం

- గదులు చిన్నగా ఉంటే ఎలా అని కాంట్రాక్టర్లు, అధికారులపై అసంతృప్తి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్లోని కూరగాయల విక్రయాల గదుల డిజైన్ విషయంలో మేయర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కూరగాయలు విక్రయించే గదులు ఇరుగ్గా మారాయన్నారు. విక్రయించేవాళ్లు ఎక్కడ కూర్చుంటారు, కొనుగోలు చేసే వాళ్లు ఎలా తిరుగుతారంటూ అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులను తనిఖీ చేశారు. నగర ప్రజలకు హైజెనిక్ కండీషన్‌లో శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలనే లక్ష్యంతో నాలుగు సమీకత మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు మార్కెట్లను ఆగస్టులో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మేయర్ ఈ సందర్భంగా వివరించారు.

రోడ్డు వేయండి

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నగరపాలక సంస్థ ద్వారా రోడ్డు సౌకర్యం కల్పించాలని ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు మేయర్ సునీల్ రావును కోరారు. రోడ్డు నిర్మిస్తే రైతులకు, స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందని ఈ సందర్భంగా ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈ మహేందర్, డీఈ మసూద్ అలీ, బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల అశోక్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో తొలగిన ఇబ్బందులు

మిడ్‌మానేరు నుంచి ఎల్ఎండీకి నీటిని విడుదల చేస్తుండడంతో నగరంలో తాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం 3వ డివిజన్‌లో రూ.54 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పైప్‌లైన్ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అంబేద్కర్ రిజర్వాయర్‌లో సంప్ నిర్మాణం పూర్తిచేశామని అన్నారు. కిసాన్ నగర్ ప్రాంతంలోని 3,4,24,25,26 డివిజన్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈ మహేందర్, డీఈ మసూద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



బాలుడితో మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

రామడుగు/కరీంనగర్ అర్బన్/ కరీంనగర్‌టౌన్: ప్రతీఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామంలో మంగళవారం గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ అభియాన్ నిర్వహించారు. గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లల బరువు, ఆహారపు అలవాట్లు, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. బాలామృతంతో కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో సంధ్యారాణి, ఎంపీపీ కలిగేటి కవిత, డీఆర్‌డీవో పీడీ లెంకల శ్రీలతారెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండేలా చేపట్టిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ(ఎఫ్ఎల్‌సీ) కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. నగరంలోని ఈవీఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్‌సీ మంగళవారం పూర్తయింది. గరిమా అగర్వాల్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈవీఎంలను ముందుస్తుగా సిద్ధంగా ఉండేలా గత నెల 22 నుంచి ఈ నెల 4వరకు ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ సాగిందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, కరీంనగర్ ఆర్డీఓ ఆనంద్ కుమార్, ఎలక్షన్ డీటీ తహసీన్ సుల్తానా, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు వచ్చేలా చూడాలి

ఆరోగ్య మహిళా కేంద్రాలకు ఎక్కువసంఖ్యలో మహిళలు వచ్చేలా చూడాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మంగళవారం బుట్టి రాజారాంకాలనీ యూపీహెచ్‌సీ ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. చికిత్స కోసం వచ్చే మహిళలకు అన్ని పరీక్షలను టీ-డయాగ్నోస్టిక్ ద్వారా చేసి పూర్తి చికిత్సను అందించాలని అన్నారు. డీఎంహెచ్‌వో కె.లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో జువేరియా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే టీఎన్జీవో లక్ష్యం

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే టీఎన్జీవో సంఘం లక్ష్యమని సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రెజరీ ఎన్‌జీవో(టీఎన్జీవో అనుబంధం) ఉద్యోగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు కొండయ్య ఆధ్వర్యంలో జరిగింది. ట్రెజరీ ఉద్యోగులు పలు సమస్యలను ప్రస్తావించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి టీఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలు, పీఆర్‌సీ లేదా ఐఆర్ పెండింగ్ బిల్లులు ఇప్పించడానికి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించడానికి సంఘం కృషి చేస్తోందని వివరించారు. ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, ఏటీవో రాజయ్య, ఎస్‌టీవో దేవేందర్, టీఎన్జీవో నేతలు ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రాగి శ్రీనివాస్, మారుపాక రాజేశ్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, ఇరుమళ్ల శారద, సవిత పాల్గొన్నారు.

ఎట్టకేలకు..!

- మోడల్ స్కూళ్ల టీచర్ల బదిలీలు
- పదేళ్ల నిరీక్షణకు తెర
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



మోడల్ స్కూల్

కరీంనగర్: పదేళ్ల నిరీక్షణకు తెరపడింది. నియామకం అయిన నాటి నుంచి ఒకే పాఠశాలలో, ఒకే చోట పదేళ్లకు పైబడి పనిచేస్తున్నా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు పచ్చజెండా ఊపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ)లకు బదిలీలు జరుగనున్నాయి. ప్రిన్సిపాళ్లను రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని బదిలీ చేయనున్నారు. పీజీటీ, టీజీటీలను జోన్ యూనిట్‌గా బదిలీలు చేపట్టనున్నారు.

షెడ్యూల్ ఇదే

- 5 నుంచి ఈనెల 7వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 8న తుది ఖాళీల జాబితా వెల్లడి
- 16,17 బదిలీల మెరిట్ పాయింట్ల వెల్లడి
- 18,19 వెబ్ ఆప్షన్లకు అవకాశం
- 20,21,22 బదిలీల ఉత్తర్వులు
- 23 నుంచి 29వ తేదీ వరకు బదిలీలపై అప్పీళ్లు సమర్పించుట

వర్షం.. అన్నదాత హర్షం

- పత్తి, మొక్కజొన్న విత్తనాలకు ప్రయోజనం



కరీంనగర్ అర్బన్: కీలక దశలో వర్షం కురియడంతో కర్షకుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరో రెండు, మూడు రోజులు గడిస్తే పత్తి, మొక్కజొన్న విత్తనాలు మళ్లీ వేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో అన్నదాతలకు తీవ్రనష్టం కాగా మంగళవారం కురిసిన వర్షం సంతోషాన్ని నింపింది. జిల్లావ్యాప్తంగా వర్షం కురియగా పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రయోజనం చేకూరింది. జిల్లాలో 50వేల ఎకరాల వరకు పత్తి విత్తనాలు వేయగా 5వేల ఎకరాల వరకు మొక్కజొన్న విత్తనాలు వేయగా పత్తిలో అంతరపంటగా కందులు వేశారు. ఈ క్రమంలో గత పది రోజులుగా హెచ్చు ప్రాంతాల్లో వాన జాడ లేకపోవడంతో వేసిన విత్తనాలు జీవం కోల్పోయే పరిస్థితికి చేరాయి. మూడు రకాల విత్తనాలకు కలిపి సుమారు రూ.200కోట్ల వరకు ఖర్చు చేశారు. ఒకవేళ రెండ్రోజుల పాటు వర్షం పడకుంటే విత్తనాలు, దుక్కి వృథానే అయ్యేది. వరినారు పోసేందుకు రైతులు నారుమళ్లను సిద్ధం చేస్తున్నారు. బుధ, గురువారాల్లోనూ మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశముందని వాతావరణశాఖ ప్రకటించింది.

రాజీవ్ రహదారి రక్తసిక్తం

- ట్రాక్టర్ ఢీకొని ముగ్గురు యువకుల దుర్మరణం
- మరో వాహనం సైతం ఢీకొన్నట్లు అనుమానం
- మృతులది చిగురుమామిడి మండలం రామంచ
- రాంగ్‌రూట్ కారణంగా ప్రమాదం
- గ్రామంలో విషాదఛాయలు



అంజి (ఫైల్)



సంపత్ (ఫైల్)



అర్వింద్ (ఫైల్)

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని రాజీవ్‌రహదారి నెత్తురోడింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, మరో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన పైడిపల్లి అర్వింద్ (23) శివరాత్రి సంపత్ (21), శివరాత్రి ఆంజనేయులు (25) సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై తిమ్మాపూర్ మండలం రేణికుంట సమీపంలో రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్దకు వచ్చారు. సమీపంలోని దాబాలో భోజనం చేద్దామనుకున్నారు. కానీ.. దాబా మూసివేసి ఉండడంతో తిరిగి రామంచ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అర్వింద్ అక్కడికక్కడే మృతిచెందగా, అంజి , సంపత్ చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మరణించారు.

ఇసుక ట్రాక్టరేనా?

రేణికుంట సమీపంలోని మానేరువాగు నుంచి రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ వాగులో నుంచి రాజీవ్ రహదారిపైకి రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ ఢీకొన్న సమయంలో మరో గుర్తుతెలియని వాహనం కూడా బైక్‌ను ఢీకొన్నట్లు పోలీసు అనుమానిస్తున్నారు. నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ అజయ్, ఓనర్ మహేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు.

వారం రోజుల్లో దుబాయ్ వెళ్లాల్సి ఉండగా..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి అంజి ఇంటికి పెద్దవాడు అతని ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు మల్లయ్య, లక్ష్మి వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటారు. అంజి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి కుదరకపోవడంతో ఈనెల 24న తిరిగి దుబాయ్ వెళ్లాలనుకున్నాడు. టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఒక్కడే కొడుకు..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి సంపత్ ఒక్కడే కొడుకు. తల్లిదండ్రులు మహేందర్, రేణుక వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతుండగా, సంపత్ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడిపెట్టిస్తున్నాయి.



ప్రమాదస్థలంలో మృతుల ద్విచక్రవాహనం

డ్రైవర్‌గా పనిచేసిన అర్వింద్..

గుడ్డిపెల్లి అర్వింద్‌కు తమ్ముడు, చెల్లె ఉన్నారు. అతని తల్లిదండ్రులు రాజు, శైలజ. తండ్రి మహేందర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలిచివేశాయి.

గ్రామంలో విషాద ఛాయలు...

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడంతో గ్రామస్తులు విషాదంలో మునిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసి తిరిగిన స్నేహితులు చనిపోయారనే వార్త నమ్మలేకపోతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

అల్ఫోర్స్‌లో వివేకానంద వర్ధంతి



కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌లో స్వామి వివేకానంద వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి చిత్రపటానికి అల్ఫోర్స్‌ విద్యాసంస్థల చైర్మన్‌ డా.వి.నరేందర్‌ రెడ్డి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. నేటి యువతకు వివేకాందుడు స్ఫూర్తి అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు, గురువుల పట్ల అమితమైన ప్రేమ ప్రదర్శించే వివేకానందుడి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు.

డ్రోన్ల వినియోగంపై నిషేధం

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్‌, రిమోట్‌ కంట్రోల్‌ డ్రోన్స్‌, రిమోట్‌ కంట్రోల్‌ మైక్రోలైట్‌ ఏయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని ఈ నెల 31వరకు నిషేధించినట్లు కరీంనగర్‌ సీపీ సుబ్బారాయుడు తెలిపారు. ఉగ్రవాదులు, అసాంఘికశక్తులు వీటిని వినియోగించే అవకాశాలుండటంతో సదరు సాంకేతిక పరికరాల వినియోగాన్ని నిషేధించడం జరిగిందని అన్నారు. శుభకార్యాల కోసం ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.

సదరం షెడ్యూల్‌ విడుదల

కరీంనగర్‌టౌన్‌: ప్రతీనెల జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి సంబంధించి జూలై నెల షెడ్యూల్‌ను జిల్లా ఆసుపత్రి మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ కృష్ణప్రసాద్‌ మంగళవారం విడుదల చేశారు. ఈనెల 6న ఉదయం 11.30 నుంచి స్లాట్‌ బుకింగ్‌ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈనెల 10న ఆర్థో, 13న మానసిక రోగులు, 18న కంటి చూపు, 24న వినికిడి, మూగ చెవుడుకు సంబంధించిన వికలాంగుల నిర్ధారణ జరుగుతుందని వెల్లడించారు. శిబిరానికి హాజరయ్యే వారు మీసేవలో స్లాట్‌ బుక్‌ చేసుకున్న రసీదుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫోటో, ఆధార్‌ కార్డు జిరాక్స్‌ తీసుకొని సదరం క్యాంపుకు హాజరుకావాలని కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట: భూ వివాదంలో కులంపేరుతో దూషించి, చంపుతానని బెదిరించిన ఓ వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్పై రాధాకిషన్‌ మంగళవారం తెలిపారు. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మ్యాకమల్ల రవిని అతని భూమిపక్కన ఉన్న బండి నాగరాజు అనేవ్యక్తి భూ వివాదంలో కులంపేరుతో దూషించి, చంపుతానని బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రాధాకిషన్‌ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వంగ మోహన్‌గౌడ్‌ వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నాడు. మోకు జారడంతో కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నాడు.

బడికి నిధులు

- ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త హంగులు
- స్కూళ్ల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి
- జిల్లాకు రూ.1.84 కోట్లు విడుదల
- మౌలిక వసతులు, పనులకు ప్రాధాన్యం
- నేరుగా ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి డబ్బులు



ఒద్యారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల

కరీంనగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యలతో పాటు వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాలల గ్రాంటును మొదటివిడతగా స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ(ఎస్‌ఎంసీ) ఖాతాల్లోకి విడుదల చేసింది. జిల్లాలోని పాఠశాలల నిర్వహణకు రూ1.84 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పాఠశాలలు ప్రారంభమైన నెల రోజుల్లోపే 50శాతం నిధులు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 651 ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీ, మోడల్‌ స్కూళ్లు 23 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సంబంధిత నిధుల్లో రూ.92.40 లక్షలు తక్షణమే ఖర్చు చేసేందుకు అనుమతి ఇచ్చారు. చెల్లింపులపై పారదర్శకత ఉండాలని, ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు జరగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థుల సంఖ్య ప్రకారం

పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. గతంలో ఎస్‌ఎస్‌ఏ, ఆర్‌ఎంఎస్‌ఏ నిధులు వేర్వేరుగా వచ్చేవి. ఈ రెండింటినీ కలిపి సమగ్ర శిక్షగా మార్చి విలీనం చేశారు. 1–15 మంది విద్యార్థులుంటే రూ.12,500, 18 నుంచి వంద మంది ఉంటే రూ.25 వేలు, 101 నుంచి 250 మంది ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి వరకు ఉంటే రూ.75వేలు, వెయ్యి దాటితే రూ.లక్ష నిధులు మంజూరు చేశారు. వీటిలో తొలి విడతగా 50శాతం నిధులు ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి నేరుగా అందనున్నాయి. గత కొన్ని నెలలుగా పాఠశాలల ఆవరణలు శుభ్రం చేయించడం, శానిటైజేషన్‌, ఇతర వాటికి ఇచ్చిన నిధులు సరిపోక కొందరు ప్రధానోపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేశారు. మొదటి నెలలోనే 50శాతం నిధులు విడుదలకావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఇలా ఖర్చు చేయాలి

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్‌ఎంసీ కమిటీ అధ్యక్షుడి పేరున జాయింట్‌ ఖాతా ఉంటుంది. ఇందులో ఈ నిధులు జమ అవుతాయి. వచ్చిన నిధులతో పాఠశాలల మరమ్మతులు, ప్రయోగశాలలకు పరికరాలు, విద్యుత్‌ బిల్లులు, పరీక్షలు, జాతీయ పండగల నిర్వహణ, కంప్యూటర్ల మరమ్మతులు, టీవీ, ఆర్‌వోటీల మరమ్మతులు, డిజిటల్‌ తరగతుల నిర్వహణకు సంబంధించిన వాటికి ఖర్చు చేసుకోవచ్చు. వీటితో పాటు ఉపాధ్యాయులు వర్క్‌ షీట్లు తయారు చేసుకోవడం, పాఠశాలలు శుభ్రం చేయించడం, ప్రయోగశాలలకు పరికరాలు, విద్యుత్‌ బిల్లులు ఇతర వాటికి ఖర్చు చేసుకోవచ్చు.

నిధుల విడుదల శుభసూచకం



ప్రభుత్వ పాఠశాలలకు నెలరోజుల్లోనే 50శాతం స్కూల్‌ గ్రాంటు నిధులు, ప్రతి పాఠశాలకు పదివేల రూపాయల విలువ గల క్రీడా పరికరాలు కొనేందుకు నిధులు విడుదల చేయడం శుభసూచకం. జిల్లాకు 50శాతం నిధులు ఎస్‌ఎంసీ ఖాతాల్లోకి చేరనున్నాయి. ఈ నిధులతో పాఠశాల నిర్వహణకు సంబంధించి వినియోగించుకోవాలి. నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

– ఏనుగు ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం, ఒద్యారం

వివాదాస్పదంగా వినాయక విగ్రహం

- క్రీడాప్రాంగణంలో విగ్రహం ఏర్పాటు
- గోపాల్‌పూర్‌లో విచారించిన పోలీసులు
- గుప్తనిధుల కోసం తొలగించారని గ్రామస్తుల ఫిర్యాదు



వినాయక విగ్రహాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు



గ్రామస్తులతో విచారణ నిర్వహిస్తున్న ఎస్సై అశోక్‌

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం గోపాల్‌పూర్‌లో పురాతమైన వినాయక విగ్రహాన్ని మంగళవారం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని తొలగించారని స్థానిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం .. గోపాల్‌పూర్‌ చింతల చెరువులో కొన్ని వందల ఏళ్ల క్రితం పురాతమైన వినాయక రాతి విగ్రహం వెలసి ఉంది. ప్రతీ నెల సంకష్టమి రోజున స్థానికులు విగ్రహానికి పూజలు చేస్తుంటారు. గతేడాది వేదపండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహం ఉన్న చోటనే గుడి నిర్మాణం చేయాలని గ్రామస్తులు నిర్ణయించారు. నిధుల సమీకరణలో జాప్యం కావడంతో గుడి నిర్మాణం చేపట్టలేదు. మంగళవారం ఉదయం క్రీడాప్రాంగణంలో వినాయక విగ్రహం కన్పించడంతో గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సమాచారం అందుకున్న రూరల్‌ ఎస్సై అశోక్‌ విగ్రహం తొలగించిన ప్రాంతంతోపాటు క్రీడాప్రాంగణంలో ఉన్న విగ్రహాన్ని పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత కొందరు వ్యక్తులు క్రేన్‌ సాయంతో విగ్రహాన్ని తొలగించి క్రీడాప్రాంగణంలో పెట్టినట్లు ఎస్సైకి గ్రామస్తులు తెలిపారు. పురాతన విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి క్రీడా ప్రాంగణంలో ఎవరు ఏర్పాటు చేశారో తెలియక గ్రామస్తులు ఆందోళనచెందుతున్నారు. గుప్తనిధుల కోసం విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని స్థానిక నాయకులు, క్రీడాప్రాంగణంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా రూరల్‌ సీఐ ప్రదీప్‌కుమార్‌, తహసీల్దార్‌ నారాయణకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ మృతి



సైదాపూర్‌: కూతురు శాంతి పూజలకు డబ్బులు కావాలని తండ్రిని అడిగి, ఇవ్వనందుకు క్షణికావేశంలో పురుగుల మందుతాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెన్నంపల్లిలో మంగళవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అబ్బిడి సుమన్‌రెడ్డి(36)కి శ్రీలేఖతో డిసెంబర్‌ 2021లో వివాహం జరిగింది. వీరికి జూన్‌ 11, 2023 రోజున కూతురు జన్మించింది. కూతురు పుట్టిన సమయం ప్రకారం శాంతిపూజ చేయాలని జ్యోతిష్యులు సుమన్‌రెడ్డికి చెప్పారు. శాంతిపూజ ఖర్చులకు డబ్బులు కావాలని తండ్రి అబ్బిడి ఎల్లారెడ్డిని అడిగాడు. ఇప్పుడు లేవని, తర్వాత చేయిస్తామని ఎల్లారెడ్డి చెప్పాడు. డబ్బులు అడిగితే ఇవ్వడంలేదని మనోవేదనకు గురయ్యాడు. క్షణికావేశంలో జూన్‌ 29న సాయంత్రం ఇంటి నుంచి వ్యవసాయ బావివద్దకు వెళ్లాడు. పురుగులమందు తాగి ఇంటిపక్కన ఉండే వ్యక్తికి ఫోన్‌ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. భార్య శ్రీలేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు.

నగునూరుకు చెందిన వ్యక్తి..

కరీంనగర్‌క్రైం: ఆర్థిక సమస్యలు, మానసికవేదనతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి మృతిచెందాడు. కరీంనగర్‌ వన్‌టౌన్‌ పోలీసుల వివరాలు.. నగునూరుకు చెందిన బత్తిని తిరుపతి(40) ఏడేళ్లుగా ఓ గ్యాస్‌ ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. మూడేళ్లక్రితం సయ్యద్‌మీరజ్‌ అనేవ్యక్తితో గ్యాస్‌ ఏజెన్సీలో పార్ట్‌నర్‌షిప్‌ తీసుకున్నాడు. రెండేళ్లుగా వీరికి గొడవలు జరుగుతున్నాయి. ఆ తరువాత తిరుపతిపై కరీంనగర్‌, మానకొండూర్‌ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి ఇటీవలే వచ్చాడు. కేసులు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. సోమవారం ఇంటినుంచి వెళ్లి పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. సయ్యద్‌ మీరజ్‌ వేధింపులతోనే తన భర్త మృతి చెందాడని తిరుపతి భార్య చిత్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

హమాలీ కార్మికుడు..


కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం బొమ్మకల్‌ గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణానగర్‌కు చెందిన పల్లవేణి కుమార్‌ (40) గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రూరల్‌ పోలీసుల కథనం ప్రకారం... హమాలీ పనిచేసే కుమార్‌ గతేడాది నుంచి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. గతనెల 22న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ ఢీకొని ఒకరు..

జమ్మికుంట: బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని మాచనపల్లికి చెందిన పర్లపల్లి రాజమల్లు(63) గ్రామంలోని కిరాణ షాపు వద్దకు వెళ్తున్నాడు. హుజూరాబాద్‌ మండలం ఇందిరనగర్‌కు చెందిన వారణాసి లక్ష్మణ్‌ బైక్‌తో వేగంగా ఢీకొట్టాడు. రాజమల్లుకు తీవ్రగాయాలు అయ్యాయి. వరంగల్‌ తరలిస్తుండగా చనిపోయాడు. పోలీసులు కేసు నమోదుచేశారు.

నీటిలో ముంచి.. ఊపిరి తీసి

- స్నానం కోసం వరదకాలువలోకి తీసుకెళ్లిన భర్త
- భార్యపై అనుమానంతో హత్య



షబానా బీ(ఫైల్‌)

కోరుట్ల: భార్యను అనుమానించి వరదకాలువలో ముంచి చంపాడు ఓ భర్త.. ఆ నేరం నుంచి తప్పించుకునేందుకు పుట్టింటికి పంపానని అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన ఈ ఘాతుకాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్‌ కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇర్ఫానా బేగం భర్త అజీజ్‌ కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఇళ్లలో పలు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతోంది. ఏడాదిక్రితం తన కుమార్తె షబానాబీ(21)ని కోరుట్లలోని గంగంపేటలో ఉండే జమీర్‌(28)కు ఇచ్చి వివాహం జరిపించింది. కొద్దిరోజుల తర్వాత షబానాను అనుమానిస్తూ వచ్చిన జమీర్‌.. సోమవారం ఉదయం 10 గంటలకు షబానాను జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించి పుట్టింటికి పంపానని తన అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. సాయంత్రం వరకూ కూతురు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇర్ఫానాబేగం.. కోరుట్లకు వచ్చింది. కూతురు తన ఇంటికి రాలేదని జమీర్‌ను అడిగింది.తాను బస్సు ఎక్కించానని, ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియదని తప్పించుకున్నాడు.అదేరోజు రాత్రి కోరుట్ల సీఐ ప్రవీణకుమార్‌కు ఇర్ఫానా ఫిర్యాదు చేసింది. పోలీసులు జమీర్‌ను విచారణ జరపగా.. షబానాను కోరుట్ల బస్టాండ్‌లోనే జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించానని చెప్పాడు. ఆ సమయంలో బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా ఆ దృశ్యాలేమీ లభించలేదు. దీంతో జమీర్‌ను గట్టిగా ప్రశ్నించగా.. తానే షబానాను సోమవారం ఉదయం కథలాపూర్‌ మండలం భూషణ్‌రావుపేట శివారులోని వరదకాలువ వద్దకు తీసుకెళ్లానని, స్నానం చేద్దామని లోనికి తీసుకెళ్లి నీటిలో ముంచి చంపానని అంగీకరించాడు. మంగళవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్‌, కోరుట్ల, కథలాపూర్‌ ఎస్సైలు కిరణ్‌, కిరణ్‌కుమార్‌ వరద కాలువ వద్దకు వెళ్లి నీటిలో గాలించారు. షబానా మృతదేహం లభ్యమైంది. షబానాపై అనుమానంతో భర్త జమీర్‌ చంపినట్లు సీఐ ప్రవీణకుమార్‌ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య



పూలమాల వేస్తున్న కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

- ఇన్‌చార్జి కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌

కరీంనగర్‌: తెలంగాణలో రైతులపై జరుగుతున్న ఆకృత్యాలను ఎదురించి పోరాడి అమరుడైన తొలి వ్యక్తి దొడ్డి కొమురయ్య అని ఇన్‌చార్జి కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌ అన్నారు. కలెక్టరేట్‌ సమావేశమందిరంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శిక్షణ సంయుక్త కలెక్టర్‌ నవీన్‌ నికోలస్‌, జిల్లావెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజమనోహర్‌ రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు పొనగంటి కేదారి అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో నగరసమితి ఆధ్వర్యంలో దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్‌, ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయులు దొడ్డి కొమురయ్య అని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. తెలంగాణ చౌక్‌వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. మక్కాపల్లి పూజ, తిరుపతి, పి.మురళి, కొంపల్లి అరవింద్‌, రవీందర్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల, మేకల పెంపకందార్ల ఆధ్వర్యంలో..

దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం(జీఎంపీఎస్‌) జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. జీఎంపీఎస్‌ జిల్లా కార్యదర్శి కాల్వ సురేశ్‌ యాదవ్‌, జిల్లా అధ్యక్షుడు పొనగాని మహేశ్‌, ఉపాధ్యక్షుడు వేల్పుల కొమురయ్య, భూస అయిలయ్య, దాడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌ ఆస్తుల ఆక్రమణపై సీఎం స్పందించాలి

- వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్‌ సమద్‌ నవాబ్‌



మాట్లాడుతున్న సమద్‌నవాబ్‌

కరీంనగర్‌టౌన్‌: జిల్లాలో ఆక్రమణలకు గురైన వక్ఫ్‌ బోర్డు ఆస్తులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పందించి ఆక్రమణలో ఉన్న భూములను ప్రభుత్వ పరిధిలోకి తేవాలని జిల్లా కాంగ్రెస్‌ వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్‌ సమద్‌ నవాబ్‌ డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్‌ ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేశారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్‌ ఎన్నికైన సమద్‌నవాబ్‌ మాట్లాడుతూ... 2014 తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ అసెంబ్లీ సాక్షిగా వక్ఫ్‌ ఆస్తుల రక్షణ కోసం జ్యుడీషియల్‌ పవర్‌ ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికీ వక్ఫ్‌ మంత్రిత్వశాఖ ముఖ్యమంత్రి చేతిలో ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. కరీంనగర్‌లో వక్ఫ్‌ బోర్డ్‌ కమిటీ వేయలేదని, నగరంలో వక్ఫ్‌ కమర్షియల్‌ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.8 కోట్ల కిరాయిలు రావలసి ఉందని, వక్ఫ్‌ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్‌ దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో వక్ఫ్‌ బోర్డు పరిరక్షణ కమిటీ సభ్యులు ఎండీ.తాజ్‌, ఎస్‌ఏ.మొసీన్‌, సయ్యద్‌ అఖిల్‌, సయ్యద్‌ ఖమరుద్దీన్‌, ఎండీ.నిహాల్‌అహ్మద్‌, అబ్దుల్‌ రెహమాన్‌, ఎండీ.ఇమ్రాన్‌, షేక్‌ షహెన్షా, షేక్‌ చాంద్‌, ఎండీ.నవాజ్‌, ఇర్ఫాన్‌, ఎండీ. లయాక్‌, హైమద్‌ అలీ పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలు వీడాలి

- భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పలేటి నరేశ్‌



మూఢనమ్మకాలపై ప్రదర్శన ఇస్తున్న నరేశ్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్యార్థులే పునాది అని, మూఢ నమ్మకాలు వీడి సమాజాభివృద్ధికి కృషి చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్‌ అన్నారు. కొత్తపల్లి (హెచ్‌) పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం జలజరాణి అధ్యక్షతన 'విద్య ఆవశ్యకత – మూఢనమ్మకాలు నిర్మూలన' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన సైన్స్‌ మ్యాజిక్‌ షో నిర్వహించారు. పలు ప్రదర్శనలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దొంగ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా దోపిడీ చేస్తున్నారని తెలిపారు. దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమని, సైన్స్‌ను సైనికుడిలా విద్యార్థులు ముందుకు నడవాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిలిటెంట్‌ పోరాటాలకు సిద్ధంకండి

- ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ హయంలో విద్యారంగం అధోగతిపాలైందని, విద్యావ్యవస్థను కార్పొరేట్‌ శక్తులకు దాసోహం చేసిన సీఎం కేసీఆర్‌ విధానాలపై విద్యార్థి లోకం మిలిటెంట్‌ పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్‌ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మంగళవారం మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే కామన్‌ విద్యా విధానాన్ని ప్రవేశపెడుతామని, ఆంధ్ర కార్పొరేట్‌ విద్యాసంస్థలను మూసివేస్తామని, ఏటా డీఎస్సీ పెట్టి టీచర్‌ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, తదితర హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్‌ పదేళ్లుగా విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన యూనివర్సిటీల్లో వీసీలను నియమించడం లేదని, అధ్యాపకుల నియామకాల ఊసేలేదని మండిపడ్డారు. నిధులు కేటాయించకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వాదేనని అన్నారు. ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజుల దోపిడీకి అడ్డూ, అదుపు లేకుండా పోయిందని అన్నారు. జిల్లాకో నవోదయ, ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఐఎం లాంటి అనేక విద్యాసంస్థలు తెలంగాణలో నెలకొల్పాల్సి కన్నా ఏర్పాటు చేయకుండా తెలంగాణకు రావాల్సిన విద్యాసంస్థలను గుజరాత్‌కు కేటాయిస్తున్న రాష్ట్ర బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్‌ల పాలనపై విద్యార్థులను కలుపుకొని మిలిటెంట్‌ పోరాటాలను నిర్వహించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి రామారపు వెంకటేశ్‌, మచ్చ రమేష్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు అన్వర్‌, హరీశ్‌, జిల్లా ఆఫీస్‌ బెరర్‌ మామిడిపల్లి హేమంత్‌ పాల్గొన్నారు.

అత్త పింఛన్‌ కాజేసిన కోడలు

- మూడేళ్లుగా డబ్బులు తీసుకుంటున్న వైనం
- మున్సిపల్‌ ఎదుట సొమ్మసిల్లిన అవ్వ
- తలకు తీవ్రగాయాలు

సిరిసిల్లటౌన్‌: కట్టుకున్నోడు ఏళ్ల కింద కాలం చేశాడు. పెళ్లి వయస్సు రాకముందు పెద్దకొడుకు.. పెళ్లయినంక చిన్నకొడుకు అనారోగ్యంతో చనిపోయారు. అప్పట్నుంచి చిన్న కోడలే ప్రపంచమని బతుకుతున్న ఓ అత్తను కోడలు బురిడీ కొట్టిస్తుంది. అత్త ఆస్తితో పాటు వృద్ధాప్య ఫించన్‌ను మూడేళ్లుగా కాజేస్తున్న ఘటన ఇది. బాధితురాలి వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గాంధీనగర్‌కు చెందిన పత్తిపాక అనసూయమ్మకు ఇద్దరు కొడుకులు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోగా, ఇద్దరు కొడుకులను పెంచి ప్రయోజకులను చేసింది. పెద్ద కొడుకు పెళ్లికాకముందే చనిపోగా, చిన్నకొడుక్కు పెళ్లి చేసింది. వారే లోకంగా అనసూయమ్మ బతుకుతుండగా పదేళ్ల క్రితం చిన్నకొడుకు చనిపోయాడు. ఇదే అదనుగా చిన్నకోడలు భాగ్య అత్తపేరున ఉన్న ఆస్తిని రాయించుకుని పెన్షన్‌ వచ్చే అకౌంట్‌ ఏటీఎం కార్డును తన వద్ద ఉంచుకుంది. నెలనెలా వచ్చే పింఛన్‌ డబ్బులను మూడేళ్లుగా డ్రా చేస్తుంది. పింఛన్‌ తెచ్చుకోవాలని అనసూయ అడిగితే రావడం లేదని చెబుతూ వచ్చింది. ఈక్రమంలో మందులకు డబ్బులు లేకపోవడంతో పింఛన్‌ ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆ వృద్ధురాలు బోరున విలపిస్తూ సిరిసిల్ల మున్సిపల్‌ కార్యాలయానికి వచ్చి అక్కడే గేట్‌ ముందు సొమ్మసిల్లి పడిపోగా, తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి వృద్ధురాలి బాధను విన్నాడు. అధికారులను వాకబు చేయగా, నెలనెలా అనసూయ అకౌంట్‌లో పెన్షన్‌ జమవుతుందని చెప్పడంతో కోడలు బండారం బయటపడింది. తలకు దెబ్బతాకడంతో వెంటనే అనసూయను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. టౌన్‌ సీఐ అనిల్‌కుమార్‌ కోడలుకు కౌన్సెలింగ్‌ ఇచ్చి ఇద్దరినీ ఇంటికి పంపించారు. కాగా ఆ అవ్వ బాధను విన్న స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎంపీటీసీ తిరుపతినాయక్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట రాజీవ్‌నగర్‌కు చెందిన ఉన్నీషా బేగం అనారోగ్యానికి గురై ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకోగా రూ.1లక్ష ఖర్చు అయింది. మంత్రి కమలాకర్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.60 వేల చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి ఎంపీటీసీ, సుడా డైరెక్టర్ భూక్యా తిరుపతినాయక్ అందజేశారు. అదేవిధంగా కొత్తపల్లి మున్సిపల్ 8వ వార్డుకు చెందిన సట్టు రాజుకు మంజూరైన రూ.32,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆ వార్డు కౌన్సిలర్ ఎస్కే నజియా బాబా అందజేశారు.

గృహోపకరణాలు పంపిణీ

కరీంనగర్‌టౌన్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్, వాసుదేవ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు గృహోపకరణాలు పంపిణీ చేశారు. గ్యాస్‌స్టవ్, ప్రెషర్ కుక్కర్, వాటర్ ప్యూరిఫైర్‌లను పలువురికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ గాలిపెల్లి నాగేశ్వర్, కోల అన్నారెడ్డి, ఈద కుమారస్వామి, సౌమ్య శ్రీదేవి, చీకోటి శ్రీనివాస్ గాంధీ, చెరిమల వెంకటేశ్వర్లు, సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు నగరంలోని భాగ్యనగర్ లేబర్ అడ్డాతో పాటు పలు ప్రాంతాల్లో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో నేరాలు, వాటి బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను షీటీం ఏఎస్సై తాటికొండ విజయమణి వివరించారు. సోషల్ మీడియా వేదికగా వేధింపులు జరిగితే 100 డయల్‌కు, షీటీం నంబర్ 87126 70759కు కాల్ చేయాలని సూచించారు. కళాబృందం ఇన్‌చార్జి ముల్కల కాంతయ్య టీం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్ష, కార్యదర్శుల రాజీనామా

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ కేంద్ర పార్టీ ఆదేశం మేరకు రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన సందర్భంగా బీజేపీ నగర పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి రమేశ్, 370 బూత్ అధ్యక్షుడు ఈరెడ్డి తిరుమల్‌రెడ్డిలు తమ పదవులకు రాజీనామా చేస్తూ లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి పంపించారు.

6న కాల్వ నర్సయ్య వర్ధంతి



సమావేశమైన సీపీఐ నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో ఈనెల 6న దివంగత కార్మిక నాయకుడు కాల్వ నర్సయ్యయాదవ్ 4వ వర్ధంతి నిర్వహించనున్నట్లు సీపీఐ కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన కరీంనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ నియోజకవర్గంలో సీపీఐతో పాటు కార్మిక సంఘాల బలోపేతానికి కాల్వ నర్సయ్య ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈనెల 6న నిర్వహించే వర్ధంతి కార్యక్రమానికి కార్మికులు, సీపీఐ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కె.బుచ్చన్న యాదవ్, కె.మల్లమ్మ, పైడిపల్లి రాజు, ఎన్.రాజు, కాల్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం సందర్శన

మానకొండూర్: మండలంలోని అన్నారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ డీపీవో రవీందర్ మంగళవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు, మౌలిక వసతులను పరిశీలించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బొట్ల కిషన్, ఉపసర్పంచ్ మూగల మహేందర్ రెడ్డి, వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్ర కథ

ప్రమాదకరంగా ఫుట్‌పాత్



స్మార్ట్‌సిటీలో భాగంగా నగరంలోని కరీంనగర్ డెయిరీ ఎదురుగా ఉన్న డ్రెయినేజీపై ఇటీవల ఫుట్‌పాత్ నిర్మించారు. పనులు నాసిరకంగా చేపట్టడంతో కూలుతోంది. ఫుట్‌పాత్‌పై నుంచి నడిచే పాదాచారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

రద్దయిన విభాగానికి బోర్డు?



భూ సంరక్షణ విభాగమే రద్దయి ఆరేళ్లు గడుస్తుండగా ఇంకా బోర్డు దర్శనమివ్వడం విడ్డూరం. కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో భూ సంరక్షణ విభాగం ఉండేది. దీనికో ఏడీఏ, ఇద్దరు ఏవోలు, అటెండర్, ఆపరేటర్ ఉండేవారు. వర్షాధార ప్రాంతాలను అభివృద్ధి చేయడం దీని ఉద్దేశం. కాగా 2017లో దీనిని రద్దు చేసి సదరు అధికారులను ఇతర విభాగాలకు సర్దుబాటు చేశారు. అయినా సదరు బోర్డును తొలగించకపోవడంతో చూపరులను విస్మయానికి గురిచేస్తోంది.

- కరీంనగర్ అర్బన్

సన్మానం



విస్తరక్‌ను సన్మానిస్తున్న చంద్రమౌళి

కొత్తపల్లి: మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి పట్టణంలోని 7వ వార్డుకు స్వల్పకాలిక విస్తరక్‌గా నియమితులైన తమిళనాడు రాష్ట్రం టిన్కాశీ జిల్లా వాసి జయ కొదండ రామన్‌ను మంగళవారం బీజేపీ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు అనుమండ్ల చంద్రమౌళి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్, నాయకులు ప్రదీప్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపద వనాలు

- ఎస్సారెస్పీ స్థలాల్లో పండ్లమొక్కల పెంపకం
- గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం
- నగునూరులో శ్రీకారం



నగునూరులో సంపద వనం చుట్టూ ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం హరిత తెలంగాణ లక్ష్యంగా ఏటా కోట్లాది మొక్కలు నాటి సంరక్షిస్తోంది. హరితహారంలో అన్ని వర్గాలను భాగస్వాములను చేయడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందిస్తోంది. ఈ ఏడాది సంపద వనాల పేరిట మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్సారెస్పీ స్థలాల్లో పండ్ల మొక్కలను నాటడం ద్వారా గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చే అవకాశముండగా గ్రామీణ ప్రజలకు ఆహ్లాదం లభించనుంది.

ఎస్సారెస్పీ స్థలాల్లో సంపద వనాలు

కరీంనగర్ మండలంలోని ఎస్సారెస్పీకి చెందిన ఖాళీ స్థలాల్లో సంపద వనాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా వనాల్లో ఆదాయాన్నిచ్చే పండ్ల మొక్కలను పెంచి తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నగునూరు, చామనపల్లి, చెర్లభూత్కూర్, జూబ్లీనగర్, ఎలబోతారం, ఇరుకుల్ల, మొగ్దుంపూర్, చేగుర్తి గ్రామాల్లోని ఎస్సారెస్పీ కాలువలకు ఇరువైపుల ఉన్న స్థలాలను ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు గుర్తించారు. కట్టుకాలువ పరిధిలోని చెర్లభూత్కూర్–డీ89 కాలువ పరిధిలో 1,300 మొక్కలు, డీ89 కాలువ వీరమల్లు పాలెం నుంచి కట్టుకాలువ పరిధిలో 1,300, డీ89 హన్మాన్ గుడి నుంచి ఇరుకుల్ల వరకు 600, డీ89 కాలువ మొగ్దుంపూర్–చర్లభూత్కూర్‌లో 300, డీ89 కాలువ జూబ్లీనగర్–చెర్లభూత్కూర్‌లో 600, డీ89 ప్రధాన కాలువ జూబ్లీనగర్‌లో 1300 మొక్కలు నాటాలని నిర్ణయించారు. సుమారు 12 కిలోమీటర్ల పరిధిలోని కాలువ స్థలాల్లో మొత్తం 5,400 మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధి హామీ పథకం కింద కూలీలతో తవ్విస్తున్నారు. ఇరుకుల్లలోని ఊరచెరువులో 200, మొగ్దుంపూర్‌లోని గాండ్లకుంటలో 300 మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించారు.

పండ్ల మొక్కలతో ఆదాయం

సంపద వనాల్లో తీరొక్క పండ్ల మొక్కలు నాటేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రధానంగా అల్లనేరేడు, జామ, ఉసిరి, పనస, సీతాఫలం, మామిడి, సపోట, బత్తాయి, దానిమ్మ, రేగుచెట్లను పెంచుతారు. పండ్ల మొక్కల రక్షణకు వనం చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గతనెల 19న హరితోత్సవంలో నగునూరులోని ఎస్సారెస్పీ స్థలంలో లాంఛనంగా కొన్ని మొక్కలను నాటి సంపద వనం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. 600 పండ్ల మొక్కలను నాటేందుకు వీలుగా ఉపాధికూలీలతో గుంతలను తవ్విస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మిగితా గ్రామాల్లో గుర్తించిన స్థలాల్లో ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. వర్షాలు కురువగానే మొక్కలు నాటేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పంచాయతీలకు ఆదాయం



ఎస్సారెస్పీ స్థలాల్లో ఏర్పాటు చేసే సంపద వనాల్లో ఆదాయం వచ్చే పండ్ల మొక్కలు నాటడం జరుగుతుంది. ఉపాధిహామీ పథకంలో పండ్ల మొక్కలు పెంచడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుంది. భారీ వర్షాలు కురిసిన అనంతరం గుర్తించిన స్థలాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

రూ.90వేలతో పండ్ల మొక్కలు



గ్రామాల్లో సంపద వనాలు ఏర్పాటు చేయడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుంది. రూ.90 వేలతో 600 పండ్ల మొక్కలు కొనుగోలు చేశాం. వర్షాలు పడిన అనంతరం మొక్కలు నాటేందుకు వీలుగా ఉపాధికూలీలతో గుంతలు తవ్విస్తున్నాం. వనం చుట్టూ ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం.

– ఉప్పుల శ్రీధర్, సర్పంచ్, నగునూరు

‘బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు మతిభ్రమిస్తోంది’



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ఖమ్మం జనగర్జన సభకు వచ్చిన జనాన్ని, కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న పథకాలను చూసి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నగర శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వృద్ధాప్య పింఛన్లు నెలకు రూ.4వేలు చొప్పున ఇస్తామంటే సాధ్యం కాదని అంటున్నారని కోట్ల రూపాయలు కమీషన్ల పేరు మీద దండుకోవడం మాత్రమే బీఆర్‌ఎస్ నాయకులకు తెలుసని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్నామని తెలిపారు. రాజస్తాన్‌లో రూ.500లకే గ్యాస్ సిలిండర్, కర్ణాటకలో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో రైతులకు పండించిన పంటపై క్వింటాల్‌కు 500 చొప్పున బోనస్.. ఈ విధంగా ఇచ్చిన ప్రతిహామీ నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అఖిల్, కుర్ర పోచయ్య, సయ్యద్ ఖంరొద్దీన్, దన్నసింగ్, ముక్క భాస్కర్, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, ఊరడి లత, పోరండ్ల రమేశ్, ఎండీ చాంద్, షేక్ శేహెన్ష, బాలబద్రి శంకర్, జీడి రమేశ్, మామిడి సత్యనారాయణరెడ్డి, రాజ్‌కుమార్, మహమ్మద్ బారీ, కమల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మైనార్టీలకు రుణాలు మంజూరు చేయాలి



ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో బీసీ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న బీసీ మైనారిటీలకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమాఅగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఖాలిద్ అహ్మద్, జాతీయ కోఆర్డినేటర్ సయ్యద్ మునావర్, నాయకులు మజీద్‌ఖాన్, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్లను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న ఎడ్ల రమేశ్

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రాజమహమ్మద్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. జిల్లా, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 40ఏళ్లుగా నెలకు రూ.5వేల నుంచి నేటికి రూ.5,200 నిర్ణీత వేతనంపై పూర్తిస్థాయి పనిగంటలు పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగుపడతాయనుకుంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. స్కూల్ స్వీపర్లను రెగ్యులర్ చేసి కనీస వేతనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమోషన్లు ఇచ్చి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్, అటెండర్ పోస్టుల్లో భర్తీ చేయాలన్నారు. స్వీపర్ల సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సులోచన, రాజమల్లు, బండారి శంకరయ్య, లక్ష్మి, రాజలింగు, యూసుఫ్, భూమయ్య, మొండయ్య, అలీం, భూమయ్య, రమేశ్, బాపయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ వికాస నేపథ్యమే ‘మధు కవనం’



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్, కవులు

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్: సమాజ వికాస నేపథ్యమే మధు కవనం పుస్తకమని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మంగళవారం నగరంలోని ఫిలింభవన్‌లో తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో రచయిత, కాలమిస్ట్, ఎస్సారార్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన ‘మధుకవనం’ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనేక వ్యాసాలు, 365 రోజుల విశిష్టతలు, సామాజిక రాజకీయ వర్తమాన అంశాల కథనాలను తనదైన శైలిలో అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి అభినందనీయుడన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుకు సాగుతున్నారన్నారు. మధుకవనంలోని కవితలు మార్గదర్శకాలుగా ఉన్నాయని, సామాజిక బాధ్యతతో రాస్తే బలమైన కవిత్వం వస్తుందని తెలిపారు. రచయిత తన పుస్తకాన్ని కుమారుడు ఆదిత్యరెడ్డికి అంకితమిచ్చారు. రచయిత దాస్యం సేనాధిపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత వారాల ఆనంద్, సాహితీవేత్తలు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్, కేఎస్ అనంతాచార్య, నంది శ్రీనివాస్, వైరాగ్యం ప్రభాకర్, బొమ్మకంటి కిషన్, కోశాధికారి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యూస్పైడర్ కంపెనీకి అల్ఫోర్స్ విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఇటీవల క్యూస్పైడర్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. బీబీఏ విభాగం నుంచి బి.సాయి మేఘన, పి.నిఖితరాజశ్రీ, ఆర్.దుర్గాభవాని, సీహెచ్.మణితన్మయి, సీహెచ్.సాయిప్రియ, ఇందువర్మ, బీకాం విభాగం నుంచి ఆర్.సౌమ్య, ఎం.అర్చనలు ఎంపికైన సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచే శిక్షణ, ఉపాధి పద్ధతులపై ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలు నిర్వహించడం వల్లనే విద్యార్థినులు ప్రతిభ కనబరుస్తూ దేశీయ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతుండటం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డా.బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాయిచంద్ మరణం దళిత జాతికి తీరని లోటు



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

కరీంనగర్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, కవి గాయకుడు సాయిచంద్ మరణం దళిత సమాజానికి తీరని లోటు అని మాల మహానాడు నాయకులు అన్నారు. మంగళవారం కోర్టు చౌరస్తాలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాయిచంద్ సామాన్య దళిత కుటుంబంలో జన్మించి తన పాట, మాటతో యావత్ తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచి తెలంగాణ ఉద్యమ మలిదశ పోరాటంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాలమహానాడు జిల్లా కన్వీనర్ కాడె శంకర్, నాయకులు తాళ్ల వెంకటేష్, గూడ కనుకయ్య, దామెర సత్యం, దుంపల జీవన్, నాయినిప్రసాద్, దండి రవీందర్, నల్లాల శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కమిటీ సభ్యులు మేడి మహేష్, ఎలుక ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను దత్తత తీసుకొని సేవలందిస్తాం



టేబుల్‌ను అందజేస్తున్న యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్: సీనియర్ క్లబ్‌లలో ఒకటైన శాతవాహన లయన్స్ క్లబ్ రెండు దశాబ్దాలుగా ప్రజాహిత కార్యక్రమాలు చేస్తూ పేరును గాంచిందని, ఈ ఏడాది ఆరెపల్లి గ్రామాన్ని, ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని అత్యవసర సేవలు అందిస్తామని క్లబ్ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం ఆరెపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల కోరిక మేరకు లయన్ కోట సత్యం కూతురు విజయ సారిక జన్మదినం సందర్భంగా కంప్యూటర్ టేబుల్‌ను అందజేసి మాట్లాడుతూ పాఠశాల సూచనల మేరకు పలు సేవలు చేస్తామని, విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదువుతూ ఉన్నత స్థితికి చేరాలని సూచించారు. కార్పొరేటర్ తుల రాజేశ్వరి బాలయ్య మాట్లాడుతూ మంచి మనస్సు గల లయన్స్ సభ్యులు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవడం హర్షదాయకమని తెలిపారు. ఉన్నత పాఠశాల హెచ్ఎం వొంటెల కళావతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ తమ పిల్లల కనీస అవసరాలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కార్యదర్శి బుర్ర మధుసూదన్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి కోట సత్యం, పూర్వ జెడ్‌సి సత్యనారాయణరావు, పూర్వ అధ్యక్షుడు మనోహరాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



కొత్తపల్లి: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని మంగళవారం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మ న్ రుద్ర రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు వా సాల రమేశ్, గండు రాంబాబు, చింతల సత్యనారా యణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్, ప్రభాకర్, నాయకులు స్వర్గం నర్సయ్య, కట్ల సుధాకర్, గున్నా ల రమేశ్, జె.శ్రీకాంత్, కురుమ సంఘం అధ్యక్షుడు పెద్ది బీరయ్య, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో ఈ మూడు నెలలే కీలకం

సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్

గోదావరిఖని: వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రానున్న మూడునెలలే కీలకమని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. మంగళవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 75 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని మూడు నెలల్లోనే చేరుకోవాల్సి ఉంటుందని, వర్షాకాలంలో ఓసీపీల్లో ఉత్పత్తి కుంటుపడకుండా ఇప్పటినుంచే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రోజుకు 2లక్షల టన్నులు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వర్షాలు కురిసినా ఓసీపీల్లో నీటినిల్వలు పెరగకుండా చూడాలని, ఇందుకు భారీ పంపులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రవాణాకు ఇబ్బంది లేకుండా హాల్ రోడ్లను పటిష్టం చేయాలన్నారు. వర్షాకాలంలో భూగర్భగనుల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఉండదని, ఎక్కువ ఉత్పత్తిపై కృషి చేయాలని తెలిపారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు నుంచి రోజుకు సగటున 7 వేల టన్నులు తగ్గకుండా ఉత్పత్తి చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో రోజుకు సగటున కనీసం 14.67 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీయాలన్నారు.

ఈ నెలలో ఏరియాలవారీగా లక్ష్యాలివే..

- కొత్తగూడెం ఏరియాలో రోజుకు 41 వేల టన్నులు
- మణుగూరులో 40 వేల టన్నులు
- ఆర్జీ–2లో 24 వేల టన్నులు
- శ్రీరాంపూర్ ఏరియాలో 19 వేల టన్నులు
- ఆర్జీ–3లో 14,500 టన్నులు
- బెల్లంపల్లి ఏరియాలో 14 వేల టన్నులు
- మందమర్రి నుంచి 12 వేల టన్నులు
- ఆర్జీ–1 నుంచి 11,500 టన్నులు
- భూపాలపల్లి నుంచి 10 వేల టన్నులు
- ఇల్లందు ఏరియా నుంచి 9వేల టన్నుల చొప్పున సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

రావమ్మా మహాలక్ష్మి..



ఏపీలో పెరుగుతున్న అమ్మాయిల సంఖ్య

- వెయ్యి మంది అబ్బాయిలకు 1,046 మంది అమ్మాయిల జననం
- దేశంలో కేరళ తర్వాత ఏపీలోనే అమ్మాయిలు అధికం
- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో దశాబ్దాల తరబడి అబ్బాయిలే అధికంగా ఉంటున్నారు. కానీ.. 2021 తర్వాత అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న ట్టు కేంద్ర గ ణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజా నివేదిక వెల్లడించింది. శ్రామిక శక్తికి (లేబర్ ఫోర్స్) సంబంధించి 2021– 22 నివేదిక లో ఈ విషయాలను వెల్లడించింది. గతంలో వెయ్యి మంది అబ్బాయిలకు 977 మంది అమ్మాయిలు మాత్రమే ఉండేవారు. ఇప్పుడా సంఖ్య 1,046కు పెరిగినట్టు నివేదికలో వెల్లడించింది.

ఆరోగ్య కార్యక్రమాల అమలు భేష్

రాష్ట్రంలో ఆరోగ్య కార్యక్రమాలు బాగా అమలు చేస్తుండటం వల్లే అమ్మాయిల సంఖ్య పెరుగుతున్నట్టు నివేదిక వెల్లడించింది. సాధారణంగా ఆరే ళ్లు నిండకముందే బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి మృతి చెందేవారు. కానీ.. ఈ పరిస్థితులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, క్రమం తప్పకుండా యాంటీనేటల్ చెకప్, వ్యాధి నిరోధక టీకాల అమలు అద్భుతంగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల స్థాయిలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఇటీవల చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ కూడా సత్ఫలితాలు ఇస్తోంది. అమ్మాయిల సంఖ్య పెరగడానికి ఇవి కూడా కారణాలని నివేదిక వెల్లడించింది.

కేరళ తర్వాత ఏపీలోనే అధికం

దేశంలో అమ్మాయిలు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉండటం గమనార్హం. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,114 మంది అమ్మాయిలు నమోదవుతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,046 మంది నమోదయ్యారు. అత్యల్పంగా హర్యానాలో 887 మంది అమ్మాయిలు మాత్రమే నమోదయ్యారు. ఏపీలో పట్టణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,063 మంది, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి 1,038 మంది అమ్మాయిలు ఉన్నట్టు నివేదికలో వెల్లడైంది. 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతుండటం వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని వివరించారు. ఇండియాలో సగటున ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 968 మంది అమ్మాయిలు నమోదయ్యారు.



వివిధ రాష్ట్రాల్లో వెయ్యి మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

రాష్ట్రం	కేరళ	ఆంధ్రప్రదేశ్	హిమాచల్‌ప్రదేశ్	తమిళనాడు	ఛత్తీస్‌గఢ్	జార్ఖండ్	కర్ణాటక	ఒడిశా	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
అమ్మాయిలు	1,114	1,046	1,031	1,026	1,016	1,001	991	988	971	955

ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి

జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/కారంచేడు : బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి నియమితులయ్యారు. సంస్థాగతంగా పలు రాష్ట్రాల్లో చేసిన మార్పుల్లో భాగంగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలిగా బీజేపీ నియమించింది. ఇప్పటివరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సోము వీర్రాజుకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఫోన్ చేసి బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ టీడీపీకి దగ్గరవుతుందన్న ఊహాగానాల నేపథ్యంలో పురందేశ్వరి నియామకం రాజకీయవర్గాల్లో చర్చకు దారి తీసింది. మార్చి 2004లో పురందేశ్వరి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం కాంగ్రెస్ నుంచి బాపట్ల ఎంపీగా పోటీ చేసి సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడుపై గెలుపొందారు. 2006లో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచే విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసి విజయం సాధించారు. యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా 2013 వరకు పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి రాజాంపేటలో పోటీ చేసి ఓడిపోయారు. ఆరున్నరేళ్ల నిరీక్షణ తర్వాత 2020 సెప్టెంబర్ 26న పురందేశ్వరిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బీజేపీ అధిష్టానం నియమించింది. 2020 నవంబర్‌లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఆమెకు బాధ్యతలు అప్పగించింది. ఏపీలో పార్టీ బలోపేతానికి కీలకంగా వ్యవహరిస్తారని, ఎన్టీఆర్ ఛరిష్మాతో టీడీపీ నాయకులను బీజేపీలో చేర్పించడంలో ముందుంటారని అధిష్టానం భావించింది. కానీ రాష్ట్ర వ్యవహారల్లో అధిష్టానం అంచనాలను పురందేశ్వరి అందుకోలేకపోయారన్న విమర్శలు పార్టీలో ఉన్నాయి. దీంతో ఆమెకు ఒడిశా బాధ్యతల్లో కోత విధించింది. 2022 సెప్టెంబర్ 9న ఛత్తీస్‌ఘడ్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కూడా పురందేశ్వరిని తప్పించింది. అప్పటి నుంచి ఆమె కేవలం జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలోనే ఉన్నారు. ఏపీలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సోము వీర్రాజుపై వచ్చిన ఫిర్యాదులు, ఎన్టీఆర్ ఛరిష్మాను తమకు అనుకూలంగా మార్చుకోగలమనే భావనతో బీజేపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

మాజీ ఎంపీ మాగుంట హత్య కేసులో... దోషికి బెయిల్

- నెలపాటు విడుదలకు హైకోర్టు ఆదేశం.. ఆ తర్వాత లొంగిపోవాలని స్పష్టీకరణ
- 2 దశాబ్దాలకుపైగా కారాగారంలోనే మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో దోషి, మాజీ నక్సలైట్ పీబీవీ గణేశ్‌ను నెలపాటు మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. అలాగే ఆగస్టు 4న జైలు సూపరింటిండెంట్ ముందు లొంగిపోవాలని ఆయనకు స్పష్టం చేసింది. 1995లో జరిగిన ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో పీబీవీ గణేశ్‌ను 2000 సంవత్సరంలో కోర్టు దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. దీనిపై ఆయన అప్పీల్‌కు వెళ్లినా ఉపశమనం కలగలేదు. దీంతో రెండు దశాబ్దాలకుపైగా జైల్లో ఉంటున్న గణేశ్‌ను సత్ప్రవర్తనగల ఖైదీగా పరిగణించి విడుదల చేయాలని 2016లో రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అయితే ఈ కేసులో సీబీఐ ఇంకొందరిపై దర్యాప్తు కొనసాగిస్తోందంటూ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గణేశ్ భార్య జోషి మాధవి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. సత్ప్రవర్తన నిబంధనలన్నీ గణేశ్‌కు వర్తిస్తే ఆయన్ను వారంలో విడుదల చేయాలని 2022 సెప్టెంబర్‌లో ఆదేశించారు. కానీ నెలలు గడిచినా కేంద్రం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఏప్రిల్‌లో మాధవి అప్పీల్ దాఖలు చేశారు. అలాగే తన భర్తకు బెయిల్ ఇవ్వాలని మధ్యంతర అప్లికేషన్ వేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వాదిస్తూ సీబీఐ పరిధిలోని కేసు కనుక గణేశ్ విడుదలపై కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున జీపీ సామల రవీందర్ వాదనలు వినిపిస్తూ సీబీఐ విచారణ జరిపిన కేసు అయినా సరే.. ఒకసారి శిక్ష పడిన తర్వాత దోషి విడుదల రాష్ట్ర సర్కార్‌కు సంబంధించిన అంశం అవుతుందన్నారు. చట్టప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నప్పుడు ఈ ప్రతిపాదనను తిరస్కరించే అధికారం కేంద్రానికి లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి దోషిని నెల రోజుల కోసం బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించారు.

వెన్నుపోటు వీరుడు.. ప్యాకేజీ శూరుడు!

''ఇవాళ వీళ్ల పరిస్థితి ఏమిటంటే.. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేనాయన ఓ నాయకుడు! ఎవరైనా తైలం పోస్తే కానీ గ్లాసు నిండని వ్యక్తి మరో నాయకుడు! ఒకరు వెన్నుపోటు వీరుడు, మరొకరు ప్యాకేజీ శూరుడు! వీరిద్దరికీ పేదల బతుకుల గురించి, ప్రజల కష్టాల గురించి, మాటిస్తే ఆ మాట మీద నిలబడాల్సిన అవసరం గురించి, ఒక మాటకున్న విలువ గురించిగానీ ఏమాత్రం తెలియదు. అలా బతకాలన్న ఆలోచనా లేదు. ఇద్దరూ కలసి ప్రజల్ని మోసం చేస్తూ 2014–19 మధ్య రాష్ట్రాన్ని ఏలారు. ఇద్దరూ కలసి రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలు, సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచారు''

ఓ నీతిమాలిన నాయకుడి కథ..

''ఇవాళ మనం తెరిపిస్తున్న చిత్తూరు డెయిరీ కథ ఎలాంటిదంటే.. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ఓ మనిషి తాను స్థాపించిన డెయిరీ కోసం, సొంత లాభం కోసం, సొంత జిల్లా రైతునైనా, పిల్లనిచ్చిన మామనైనా బలి పెట్టేస్తాడని చెప్పే మనిషి కథ ఇది! ఓ నీతిమాలిన రాజకీయ నాయకుడి కథ ఇదీ! ఒక గొప్ప మెడికల్ కాలేజీ మన చిత్తూరుకు వస్తుంటే అడ్డుకున్నది సాక్షాత్తూ ఈ చంద్రబాబునాయుడు, గజదొంగల ముఠా సభ్యుడైన ఈనాడు రామోజీరావు వియ్యంకుడే. స్థలాలివ్వకుండా ఈ గడ్డకు మంచి మెడికల్ కాలేజీ రాకుండా అడ్డుకున్న చరిత్ర వారిదే. వేలూరు మెడికల్ కాలేజీకి జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్దుతూ ఈరోజు అడుగులు ముందుకు వేస్తున్నా''

– చిత్తూరు బహిరంగ సభలో సీఎం జగన్

'చిత్తూరు'కు క్షీరాభిషేకం!

- దశాబ్దాల చరిత్ర కలిగిన అతిపెద్ద డెయిరీకి ప్రాణ ప్రతిష్ట
- చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ పనులకు ఏపీ సీఎం జగన్ శ్రీకారం



చిత్తూరు డెయిరీ పునరుద్ధరణ శిలాఫలకం వద్ద సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి: గత పాలకుల స్వార్థంతో రెండు దశాబ్దాలుగా మూతబడ్డ చిత్తూరు డెయిరీకి జీవం పోస్తూ అమూల్ సంస్థ రూ.385 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరులో భూమి పూజ చేశారు. అనంతరం చిత్తూరు సమీపంలోని చీలాపల్లి సీఎంసీ మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

రూ.150 కోట్లతో తొలిదశ పనులు

ఇలాంటి మంచి కార్యక్రమంలో భాగంగా రూ.150 కోట్లతో చిత్తూరు డెయిరీ తొలిదశ పనులు మొదలవుతున్నాయి. దాదాపు లక్ష లీటర్లతో మరో 10 నెలల వ్యవధిలో పాల ప్రాసెసింగ్ మొదలవుతుంది. రానున్న రోజుల్లో ఇక్కడే దశలవారీగా బటర్, పాలపొడి, యూహెచ్‌టీ పాల విభాగం, ఛీజ్, పనీర్, యోగర్ట్, స్వీట్ తయారవుతాయి. ఐదు నుంచి ఏడెనిమిదేళ్లలో 10 లక్షల లీటర్లు ప్రాసెస్ చేసే స్థాయికి డెయిరీ చేరుకుంటుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. మరో 2 లక్షల మందికి అమూల్ రాకతో అవుట్‌లెట్స్, డిస్ట్రిబ్యూషన్ చానెళ్ల ద్వారా పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. చిత్తూరు జిల్లానే కాకుండా రాయలసీమకు చెందిన పాడి రైతన్నలు, అక్కచెల్లెమ్మలకు మంచి పాల సేకరణ ధర లభిస్తుంది.

'మోడల్' టీచర్లకు శుభవార్త

- బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో 149 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు

బదిలీల షెడ్యూల్
దరఖాస్తుల స్వీకరణ : జూలై 5
ప్రొవిజినల్ ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్ల ప్రకటన : జూలై 16
తుది ఎన్‌టైటిల్ పాయింట్ల వెల్లడి : జూలై 16 నుంచి 19 వరకు
వెబ్ ఆప్షన్లు : జూలై 18– 19 వరకు
ఉత్తర్వుల జారీ : జూలై 21– 23 వరకు
అప్పీళ్లకు అవకాశం : జూలై 23 నుంచి 29 వరకు



ఆసిఫాబాద్ మోడల్ స్కూల్

ఆసిఫాబాద్‌రూరల్/బజార్‌హత్నూర్: ఆదర్శ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తున్న టీచర్లకు స్థాన చలనం కలగనుంది. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. పూర్తిగా ఆన్‌లైన్‌లో జరిగే వెబ్‌బేస్డ్ కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 5 నుంచి ప్రారంభం కానుంది. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు https:// schooledu. telangana. gov. in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 14 స్కూళ్లు

ఇంగ్లిష్ మీడియంలో ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం 2013లో మోడల్ స్కూళ్లను ప్రారంభించింది. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 14 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. దశల వారీగా ఇందులో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. అయితే రిక్రూట్ సమయంలో రోస్టర్ కమ్ మెరిట్ పాటించకపోవడంతో కొత్త సమస్యలు ఎదురయ్యాయి. ఒక్కో పాఠశాలకు ఇద్దరు సబ్జెక్టు టీచర్లను కేటాయించినా ఆ తర్వాత ఒక్కరికే పోస్టింగ్ ఇచ్చారు. మిగిలిన వారిని ఇతర జిల్లాలకు డెప్యూటేషన్‌పై పంపించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో మొత్తం 149 మంది పనిచేస్తున్నారు. పదేళ్లుగా వీరంతా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్నారు. 131 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించడంతో సుదీర్ఘ విరామం తర్వాత టీచర్లకు స్థానం చలనం కలగనుంది. అయితే బదిలీలకు తప్పనిసరిగా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. గరిష్టంగా ఎనిమిదేళ్ల సర్వీసు ఉన్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. క్యాడర్ విభజన కేసు కోర్టులో ఉన్న నేపథ్యంలో పాత జోన్ల ప్రకారమే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఆదర్శ పాఠశాలలు	ప్రస్తుతం పనిచేస్తున్న వారు	ఖాళీలు
ఆదిలాబాద్	06	66	54
మంచిర్యాల	05	62	38
కుమురం భీం	02	17	23
నిర్మల్	01	04	16

ఎట్టకేలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది



బజార్‌హత్నూర్‌లో ఆదర్శ పాఠశాల ప్రారంభించినప్పుడు నేను విధుల్లో చేరాను. పీజీటీగా, ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా. ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీల షెడ్యూల్ విడుదల చేయడం సంతోషకరం. ఇక కుటుంబానికి దగ్గరగా ఉండే అవకాశం ఏర్పడనుంది. – రాజశేఖర్, ప్రిన్సిపాల్, ఆదర్శపాఠశాల, బజార్‌హత్నూర్

హెచ్‌బీటీలను రెగ్యులర్ చేయాలి



ఈ బదిలీ ప్రక్రియతో మాకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం మానవతాదృక్పథంతో స్పందించి సొసైటీ కింద తీసుకుని ఖాళీలు ఉన్న చోట భర్తీ చేయాలి. ఆరేడేళ్లుగా విధుల్లో ఉన్నందున రెగ్యులర్ చేసేందుకు కృషి చేయాలి.

– సింగు రామకృష్ణ, హెచ్‌బీటీ, బోథ్

పొత్కపల్లి ఎస్సై సస్పెన్షన్

- మంచిర్యాల జిల్లా జైపూర్ స్టేషన్ నుంచి జేసీబీ మాయం
- గుప్త నిధులు తవ్వుతూ భీమారంలో పట్టుబడిన వైనం
- కోర్టు అనుమతి లేకుండానే వాహనం రిలీజ్ ..?
- ఇటీవలే పొత్కపల్లికి బదిలీపై వచ్చిన ఎస్సై రామకృష్ణ



ఎస్సై రామకృష్ణ

ఓదెల(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సై కె.రామకృష్ణపై సస్పెండ్ వేటు పడింది. గుప్త నిధులు తవ్వుతూ పట్టుబడగా.. సీజ్ చేసిన ఓ జేసీబీని కోర్టు అనుమతి లేకుండానే రిలీజ్ చేసినట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ ఉత్తర్వులు జారీ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలు.. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి మాంతమ్మగుడి సమీపంలో 2018లో గుప్తనిధుల కోసం తవ్వుతుండగా.. పోలీసులు ఓ జేసీబీ, బైక్‌ను సీజ్‌చేసి కోర్టుకు అప్పగించారు. భీమారం పోలీస్‌స్టేషన్‌లో స్థలం లేకపోవడంతో కేసు కొనసాగుతుండగానే రక్షణ నిమిత్తం జేసీబీని జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో జైపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న(ప్రస్తుతం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్) రామకృష్ణ కోర్టు ఉత్తర్వులు రాకుండానే జేసీబీని రిలీజ్ చేసినట్లు తెల్సింది. ఇటీవల భీమారం పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్సై సదరు కేసును పరిశీలించగా సీజ్ చేసిన జేసీబీ కనిపించలేదు. దీంతో పోలీసులు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సీజ్ అయిన జేసీబీ హర్యానా రాష్ట్రానికి చెందిందని, దానిని జైపూర్‌లో పనిచేసిన సమయంలో ఎస్సై రామకృష్ణ మాయం చేశారని నిర్ధారణకు వచ్చారు. ఈ విషయంపై రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ విచారణ చేసి స్టేషన్ నుంచి మాయమైన జేసీబీని రికవరీ చేశారు. దీనికి బాధ్యుడైన ప్రస్తుతం పొత్కపల్లిలో పనిచేస్తున్న ఎస్సై రామకృష్ణను సస్పెండ్ చేశారు. రామకృష్ణ మే 17న ఇక్కడకు బదిలీ కాగా.. గతనెల 21 నుంచి లాంగ్‌లీవ్ పెట్టినట్లు సమాచారం.

పోరాట వారసత్వంతోనే తెలంగాణ సాధించుకున్నాం

- దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో నిలబడుదాం
- విగ్రహావిష్కరణలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ



మాట్లాడుతున్న అల్లం నారాయణ

మంథని: తెలంగాణ చరిత్ర ప్రపంచంలో నిలబడిందని, పోరాట వారసత్వంగా సాధించుకున్న రాష్ట్రాన్ని కలబడైనా నిలబెట్టుకోవాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. మంథని బొక్కలవాగు వంతెనపై పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరవీరుడు దొడ్డి కొంరయ్య విగ్రహాన్ని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. వైవిధ్యంగా కాలాన్ని వెనక్కి తీసుకుపోవడానికి కేంద్రంప్రభుత్వం, కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మంథనివంటి మారుమూల ప్రాంతంలో మహా నీయుల చరిత్రను చాటేలా విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోరాటాలు, త్యాగాలతో దేశానికి ముందుచూపునిచ్చింది ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మహానీయులేనని పుట్ట మధు అన్నారు. మహనీయుల చరిత్రను మర్చిపోవడం మూలంగానే 40 ఏళ్లు బానిసలుగానే ఉన్నామన్నారు. అట్టడుగువర్గాల కోసం ఆనాడు పోరాటాలు, త్యాగాలు చేసిన మహానీయుల చరిత్ర ను చాటిచెప్పేలా విగ్రహాలు ఏర్పాటు చేయడం దేశంలో చరిత్రగా నిలుస్తుందని ఎంపీ అన్నారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, విగ్రహకమిటీ చైర్మన్ పర్స బక్కయ్య పాల్గొన్నారు.

ఇళ్లు, స్థలాల కోసం కృషి

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, నివేశన స్థలాలను ప్రభుత్వపరంగా కేటాయించేలా కృషి చేస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. మంథనికి వచ్చిన సందర్భంగా పలువురు జర్నలిస్టులు సన్మానించారు.

ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్‌పై సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల సమీకృత విధానంలో విద్య అభ్యసించడానికి ప్రొవిజినల్ లిస్టును సోమవారం విడుదల చేశారు. ఇందులో భాగంగా మంగళవారం కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ సన్నాహక సమావేశం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్‌తో కలిసి ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, ఉద్యోగులతో వెంకటరమణ పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 7 నుంచి 9వరకు జరగనున్న కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లతోపాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉద్యోగులు నిర్వర్తించాల్సిన విధులను సూచించారు. అకాడమిక్ ఇయర్ ప్రారంభమైన సందర్భంలో తరగతులు జరుగుతున్న విధానాన్ని, అధ్యాపకుల పాత్ర, విద్యార్థుల సంక్షేమం తదితర అంశాలపై ఆయా శాఖాధిపతులకు సూచనలు చేశారు.

చెక్కు అందజేత...

అనంతరం నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేలు సేకరించారు. మృతురాలు విద్యార్థిని బూర లిఖిత కుటుంబ సభ్యులకు అందజేసే విధంగా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జెట్టక్కను తరిమికొట్టిన దూలూర్‌వాసులు



ర్యాలీ నిర్వహిస్తున్న దూలూర్ గ్రామస్తులు

కథలాపూర్(వేములవాడ): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దూలూర్ గ్రామస్తులు మంగళవారం జెట్టక్కను తరిమికొట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం చీపుర్లు, చాటలు, పాతబట్టలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. 'జెట్టక్క వెళ్లిపో.. లక్ష్మీదేవిరా..' అని గ్రామ శివారు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ తుమ్మ చెట్లకు బట్టలు, చీపుర్లు, చాటలు కట్టి స్నానాలు చేసి ఇళ్లకు చేరుకున్నారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని పూజించారు. ఈ ఉత్సవాల్లో సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
బుధవారం ॥ 5-7-2023

సేవ

33 ఏళ్ల సర్వీసు. 10 వేల డెలివరీలు. విలుప్పురం ప్రభుత్వాస్పత్రి నుంచి గత నెలలో రిటైర్ అయిన నర్సు ఖతీజాబీని తమిళనాడు ప్రభుత్వం సత్కరించి మరీ వీడ్కోలు పలికింది. కారణం ఆమె మొత్తం సర్వీసులో ఒక్క శిశువు కూడా కాన్పు సమయంలో మృతి చెందలేదు. ప్రాణం పోసే పని ఎంతటి బాధ్యతాయుతమైనదో ఖతీజాను చూసి తెలుసుకోవాలంటారు సాటి నర్సులు. ఇలాంటి నర్సులే ప్రతిచోటా కావాలి.


ఖతీజాబీ

అమృత హస్తాలు

‘ఆ రోజుల్లో ప్రయివేటు ఆస్పత్రులు చాలా తక్కువ. ఎంతటి వాళ్లయినా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి రావాల్సిందే. క్షణం తీరిక ఉండేది కాదు’ అని గుర్తు చేసుకుంది 60 ఏళ్ల ఖతీజాబీ. ఆమె గత నెలలోనే విల్లుపురం ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి పదవీ విరమణ పొందింది. తమిళనాడు ఆరోగ్య శాఖామంత్రి సుబ్రమణియన్ ప్రత్యేక పురస్కారం అందించి మరీ ఆమెను సత్కరించాడు. ‘అందుకు కారణం నా మొత్తం సర్వీసులో ఒక్క పసికందు కూడా కాన్పు సమయంలో ప్రాణం పోగొట్టుకోకపోవడమే’ అంటుందామె సంతృప్తిగా.

■ **తల్లి కూడా నర్సే**

ఖతీజాబీ ఏదో వేరే పని దొరక్క నర్సు కాలేదు. ఆ వృత్తి పట్ల ప్రేమతోనే అయ్యింది. ‘మా అమ్మ జులేఖా కూడా నర్సుగా పని చేసేది. కాని ఆమె కాలంలో కాన్పు సమయాలు చాలా ఘోరంగా ఉండేవి. తల్లి, బిడ్డ క్షేమంగా బయటపడతారనేది చెప్పలేము. నేను ఆమెను చూస్తూ పెరిగాను. చిన్నప్పుడు సిరంజీలతో ఆడుకున్నాను. అమ్మ వెంట హాస్పిటల్‌కు వెళుతూ హాస్పిటల్ వాసనకు అలవాటు పడ్డాను. 1990లో నేను కూడా నర్సుగా ఉద్యోగం ప్రారంభించాను. అయితే అప్పటికే నాకు పెళ్లయ్యి ఏడు నెలల గర్భిణిగా ఉన్నాను. అలా ఉంటూనే కాన్పులు చేయడం ప్రారంభించాను. నా కాన్పు అయ్యాక కేవలం రెండు నెలలు బ్రేక్ తీసుకుని మళ్లీ డ్యూటీకి హాజరయ్యాను’ అంది ఖతీజా.

■ **స్త్రీల వేదన**

1990లలో మన దేశంలో ప్రతి లక్ష కాన్పుల్లో 556 మంది శిశువులు మరణించేవారు. నవజాత శిశువుల్లో ప్రతి 1000 మందికి 88 మంది మరణించేవారు. ‘సిజేరియన్ ఆపరేషన్లు చాలామటుకు స్త్రీలను, శిశువులను కాపాడాయి. నేను పని చేసే ఆస్పత్రిలో కేవలం ఒక డాక్టరు, ఇద్దరు నర్సులు ఉండేవాళ్లం. సిజేరియన్ చేసే సామాగ్రి మా దగ్గర ఉండేది కాదు. అందుకే కాన్పు కాంప్లికేట్ అవుతుందని డౌట్ రాగానే జిల్లా (కడలూర్) ఆస్పత్రికి పంపేసేదాన్ని. ఆ తర్వాత కూడా సిజేరియన్‌కు స్త్రీలు భయపడితే ధైర్యం చెప్పేదాన్ని. కానీ ఇవాళ మామూలు నొప్పులు వద్దని స్త్రీలు సిజేరియనే కోరుకుంటున్నారు’ అని తెలిపింది ఖతీజా. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు పెంచడం, స్త్రీల అక్షరాస్యత కోసం శ్రద్ధ పెట్టడం తదితర కారణాల వల్ల ప్రసూతి మరణాలు తగ్గుముఖం పట్టాయని ఖతీజా అంటోంది. ‘ఇవాళ మన దేశంలో ప్రతి లక్ష కాన్పుల్లో కేవలం 88 మంది పిల్లలే మరణిస్తున్నారు. నవజాత శిశువుల్లో వెయ్యికి 27 మంది మరణిస్తున్నారు’ అందామె.

■ **ఎంతో సంతృప్తి**

‘2008 మార్చి 8 నా జీవితంలో మర్చిపోలేను. ఆ రోజు డ్యూటీకి రావడంతోటే ఇద్దరు స్త్రీలు నొప్పులతో ఉన్నారు. వారి కాన్పుకు సాయం చేశాను. రోజులో ఇద్దరు సాధారణమే. కాని ఆ తర్వాత ఆరు మంది వచ్చారు. వారంతా కూడా ఆ రోజే కాన్పు జరిగి పిల్లల్ని కన్నారు. బాగా అలసటగా అనిపించింది. కాని సాయంత్రం డ్యూటీ దిగి వెళుతుంటే ఎనిమిది మంది చంటి పిల్లలు తల్లుల పక్కన పడుకుని కేరుకేరుమంటుంటే ఏడుస్తుంటే చాలా సంతోషం కలిగింది. కాన్పు సమయంలో స్త్రీలు ఎంతో ఆందోళనగా ఉంటారు. వారికి ముందుగా ధైర్యం చెప్పడంపై నేను దృష్టి పెట్టేదాన్ని. బిడ్డను కనే సమయంలో వారు ఎంత బాధ అనుభవించినా బిడ్డ పుట్టి కేర్‌మన్నాక తప్పనిసరిగా నవ్వు ముఖంతో బిడ్డవైపు చూసేవారు. వారి ఆ నవ్వు నాకు ఎంతో సంతృప్తినిచ్చేది. రిటైరయ్యానన్న మాటే గాని నా మనసు మాత్రం అలాంటి తల్లుల సేవలోనే ఉండమని చెబుతోంది’ అని ముగించింది ఖతీజా.

మారిన దృష్టి

‘నేను కాన్పులు చేసిన కొత్తల్లో రెండో సంతానంగా, మూడో సంతానంగా కూడా ఆడపిల్లే పుడితే ఆ తల్లులు అంతులేనంతగా ఏడ్చేవారు. అసలు తండ్రులు చూడ్డానికి కూడా వచ్చేవారు కాదు. ఇవాళ ఆ ధోరణిలో మార్పు వచ్చింది. అమ్మాయిలు పుట్టినా అబ్బాయిలు పుట్టినా కేవలం ఇద్దరు చాలని ఎక్కువమంది అనుకుంటున్నారు. నా మొత్తం సర్వీసులో 50 మంది కవలలకు పురుడు పోశాను. ఒక కాన్పులో ట్రిప్లెట్ పుట్టారు’ అందామె.



జీవితాన్ని అలంకరించుకుంది

అరకొర ఆర్థిక పరిస్థితులు బాల్యాన్ని సర్దుకు పొమ్మన్నాయి. ఏమీ తెలియని పసిమనసు కూడా పరిస్థితులకు తలొంచక తప్పలేదు. తన వయసుతో పాటు కుటుంబ ఆర్థికభారం పెరిగిపోతుంటే చూడలేకపోయింది. డిగ్రీలోనే సంపాదనకు నడుం బిగించి, 28 ఏళ్లకే సక్సెస్‌ఫుల్ ఎంట్రప్రెన్యూర్‌గా రాణిస్తోంది ప్రాచీ భాటియా.


ప్రాచీ భాటియా

ఘజియాబాద్‌కు చెందిన ప్రాచీ భాటియా దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది. తండ్రి జర్నలిస్టు, తల్లి గృహిణి. తండ్రికొచ్చే కొద్దిపాటి ఆదాయమే కుటుంబానికి ఆధారం. ఆ ఆదాయం ఏమూలకూ సరిపోయేది కాదు. ప్రాచీ స్కూలు ఫీజులు కట్టడం కూడా చాలా కష్టంగా ఉండేది. ఎప్పుడూ స్కూల్లో అందరికంటే ఆలస్యంగా ఫీజు చెల్లించేవారు. ఇంతటి గడ్డు పరిస్థితుల్లో సైతం ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ప్రాచీ ... తనకెంతో ఇష్టమైన డిజైనింగ్ డిగ్రీ చేయాలనుకుంది. అనుకున్నట్టుగానే ఢిల్లీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్‌ఐఎఫ్‌టీ)లో సీటు సంపాదించింది. కానీ అక్కడ హాస్టల్ ఫీజు, ఇతర ఖర్చులకు డబ్బులు లేక ఎన్‌ఐఎఫ్‌టీలో చేరలేదు. గురుగామ్‌లోని జీడీ గోయెంకా యూనివర్సిటీలో చేరింది.

■ **సంపాదిస్తూనే కాలేజీ టాపర్**

అతి కష్టంమీద డిగ్రీలో చేరిన ప్రాచీ.. ఒకపక్క చదువుకుంటూనే మరోపక్క చిన్న వ్యాపారం ప్రారంభించింది. కుటుంబానికి ఆర్థికంగా సాయపడేందుకు.. గిఫ్ట్స్ తయారు చేసి విక్రయించేది. ఫొటో ఆల్బమ్స్, ఫొటో ప్రింటెడ్ ల్యాంప్స్, హ్యాండ్‌మేడ్ కార్డ్స్, రోజెస్ వంటివి తయారు చేసి ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేసేది. ఇలా విక్రయిస్తూ నెలకు ఐదు వేల రూపాయల దాకా సంపాదించేది. వాటిలో కొంత ఇంట్లో ఇచ్చి మిగతావి దాచుకునేది. ఆర్ట్స్, క్రాఫ్ట్స్ మీద ఆసక్తి ఉండడంతో సర్టిఫికెట్ కోర్సులు చేసేది. మరోపక్క డిగ్రీ చదువుతూ వచ్చే స్కాలర్‌షిప్‌తో తన ఎడ్యుకేషన్ లోన్ కట్టేది. ఇవన్నీ చేస్తూ కూడా డిగ్రీలో కాలేజ్ టాపర్‌గా నిలిచింది ప్రాచీ.

■ **ఎంప్లాయి నుంచి ఎంట్రప్రెన్యూర్‌గా**

డిగ్రీ పూర్తవగానే ప్రాచీ గురుగామ్‌లోని ఓ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో అసిస్టెంట్ డిజైనర్‌గా చేరింది. కొన్నాళ్లు పని చేశాక.. మరో బహుళ జాతి కంపెనీలో డిజైనర్‌గా ఉద్యోగావకాశం వచ్చింది. అందులోచేరిన కొద్దిరోజులకే ‘‘ఒకరి కింద నేనెందుకు పనిచేయాలి? నేనే ఏదైనా కొత్తగా ప్రారంభించవచ్చు కదా!’’ అనుకుని వెంటనే ఉద్యోగం వదిలేసింది. అప్పటిదాకా చేసిన ఉద్యోగ అనుభవ పాఠాలతో 24 ఏళ్ల వయసులో సొంతంగా ‘చౌఖట్’ పేరిట హోండెకార్ బ్రాండ్‌ను స్థాపించింది. అప్పటివరకు దాచుకున్న లక్ష రూపాయలను పెట్టుబడిగా పెట్టి..


తమ ఉత్పత్తులను ఫొటోషూట్ చేయించి పరిశీలిస్తున్న ప్రాచీ

ఇంటి అలంకరణలో ఉపయోగించే ఉత్పత్తులను పేపర్ మీద డిజైన్ చేసి, మొరాదాబాద్, జైపూర్, నోయిడాలలోని కళాకారులతో రకరకాల కళాఖండాలను తయారు చేయించేది. తయారైన ఉత్పత్తులను ఫొటోషూట్ చేసి తన సొంత వెబ్‌సైట్‌లో పెట్టి విక్రయించడం మొదలు పెట్టింది. విక్రయాలు కాస్త మందకొడిగా ఉండడంతో.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రకటనలు ఇచ్చింది. వీటి ద్వారా చౌఖట్‌కు గుర్తింపు రావడంతో వ్యాపారం ఊపందుకుంది. దీంతో తన మార్కెటింగ్ బడ్జెట్ నెలకు యాభైవేలకు చేరింది. తొలిఏడాది మూడు లక్షలు, రెండో ఏడాది పదకొండు లక్షలు. దురదృష్టవశాత్తూ మూడో ఏడాది కరోనా కారణంగా ఆశించినంత ఆదాయం రాలేదు. దాంతో ప్రాచీ తన ఐడియాలతో వ్యాపారం పుంజుకునేలా చేయడంతో... గతేడాది (నాలుగో సంవత్సరం) ఒక్కసారిగా 35.5 లక్షలకు చేరింది. ఐదు వందల నుంచి ఇరవై వేల రూపాయల ధరల్లో ఉన్న 70 రకాల చౌఖట్ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఆర్డర్లు వస్తున్నాయి. తను డిజైన్ చేసిన వస్తువులను స్కూటీ మీద మోసుకెళ్లిన ప్రాచీ ఇటీవలే తన సొంత డబ్బులతో కారు కొనుక్కుంది.

■ **రాయి శిల్పంగా మారినట్టు..**

‘‘నేను నడిచిన దారిలో అనేక బెదిరింపులు, వయసు వివక్షలు వంటి అనేక ఇబ్బందులు, సమస్యలు, ఒత్తిళ్లు ఎదురయ్యేవి. అయితే ఉలి దెబ్బలకు రాయి శిల్పంగా మారినట్లు వీటన్నింటిని భరిస్తూనే ఈ స్థాయికి వచ్చాను. భవిష్యత్‌లో చౌఖట్ టర్నోవర్‌ను నాలుగు వందల కోట్లకు తీసుకెళ్లాలి. ఇంటి అలంకరణ వస్తువులు కావాలంటే కస్టమర్లు నా చౌఖట్‌ను ఎంచుకునే స్థాయికి ఎదుగుతాను’’ అని ప్రాచీ సగర్వంగా చెబుతోంది.

బ్యూటిప్స్

ఇలా చేస్తే...

వాతావరణంలో మార్పుల వల్ల లేదా జుట్టు స్వభావం వల్ల ఒకోసారి తలస్నానం చేసినప్పటికీ వెంట్రుకలు వాసన వస్తుంటాయి. కొంతమందిలో వాసనతోపాటు జుట్టు ఊడిపోతుంటుంది. ఈ సమస్య నివారణకు ఇంట్లోనే సులభంగా చేసుకోదగిన ఈ రెండు చిట్కాలు చక్కగా పనిచేస్తాయి.



- అలోవెరా జెల్ లేదా అలోవెరా నూనెను వారానికి ఒకసారి తలకు పట్టించి గంట తరువాత కడిగితే వెంట్రుకల నుంచి వచ్చే వాసన పోతుంది. అలోవెరాలోని విటమిన్ ఎ, సి, ఇ, బీ12 లు జుట్టుకు అంది పెరుగుదలకు దోహద పడతాయి.
- శీకా కాయ, ఉసిరిపొడి, కరివేపాకు, మందార పువ్వులను సమపాళ్లల్లో తీసుకుని రాత్రంతా నానబెట్టాలి. మరుసటిరోజు ఉదయం వీటన్నింటిని పేస్టు చేయాలి. ఈ పేస్టుని జుట్టుకి పట్టించి అరగంట తరువాత షాంపూతో కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఇలా చేయడం వల్ల కురుల నుంచి వచ్చే చెడువాసన పోవడంతోపాటు, జుట్టు కూడా పెరుగుతుంది.



యూత్ పల్స్



వయసు పైబడిన వారికి సుపరిచితమైన ‘మతిమరుపు’ ఇప్పుడు యువతకు హాయ్ చెబుతూ వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తోంది. ఆ ప్రయత్నాన్ని నివారించడానికి పురాతన రోమన్, గ్రీక్ మెమొరైజేషన్ స్ట్రాటజీ ‘మెథడ్ ఆఫ్ లోకి’ నుంచి చిన్నాచితకా బ్రెయిన్ ఎక్సర్‌సైజ్‌ల వరకు ఎన్నో చేస్తున్న వారు యూత్‌లో ఎంతో మంది ఉన్నారు...

సారీ... మీ పేరు మరచిపోయాను!

ఢిల్లీకి చెందిన 22 సంవత్సరాల శ్రుతి అగర్వాల్ ఒకప్పుడు సినిమా చూస్తే... ఆ సినిమా గురించి ఆర్డర్ తప్పకుండా సీన్ బై సీన్ చెప్పేది. ఎన్నో సంవత్సరాల క్రితం చూసిన సినిమా అయినా సరే ఈరోజే చూసినంత ఫ్రెష్‌గా చెప్పేది.

అలాంటి శ్రుతికి రెండు వారాల క్రితం చూసిన సినిమా కథ కూడా గుర్తుండడం లేదు అనేది ఒక విషయం అయితే కొత్త వారి పేర్లు త్వరగా మరచిపోవడం మరో విషయం. తనకు మతిమరుపు దగ్గరవుతుంది అని చెప్పడానికి ఈ రెండే కాదు ఇంకా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

శృతికి ఎలాంటి దురలవాట్లు లేవు. వేళకు నిద్ర పోతుంది. సరియైన ఆహారం తీసుకుంటుంది.

మరి ఎందుకు తన జ్ఞాపకశక్తి బలహీనం అవుతోంది?

తనను తాను విశ్లేషించుకునే సమయంలో ఎప్పుడో స్కూల్ రోజుల్లో చదువుకున్న ‘యూజ్ ఇట్ ఆర్ లూస్ ఇట్’ అనే సామెత గుర్తుకువచ్చింది. అందులోనే తన సమస్యకు సగం పరిష్కారం కనిపించింది. స్కూల్, కాలేజీ రోజుల్లో ఏదైనా లెక్క చేయాలంటే మనసులో క్యాలిక్యులేట్ చేసుకోవడమో, కాగితం మీద చేయడమో జరిగేది.

ఇప్పుడు మనసుతో పనిలేదు.

చిన్నాచితకా లెక్కలకైనా స్మార్ట్‌ఫోన్‌లోని క్యాలిక్యులేటర్‌పై అతిగా ఆధారపడుతుంది. ఒక శుభకార్యం లేదా ఏదైనా ముఖ్యమైన కార్యక్రమాన్ని గుర్తు పెట్టుకోవడానికి ఆ తేదీని మదిలో ముద్రించుకునేది..

ఇప్పుడు సెల్‌ఫోన్‌లోని రిమైండర్‌కు పని చెబుతోంది. తన మెదడును సరిగా ఉపయోగించుకోకపోవడం వల్లే తనకు మతిమరపు దగ్గరవుతోందని గ్రహించిందామె. తనకు ఇప్పుడు కావాల్సింది బ్రెయిన్‌కు ఎక్సర్‌సైజ్ అనే విషయం అర్థమైంది. దీని గురించిన సమాచార శోధనలో తనను ఆకట్టుకున్నది.... పురాతనమైన మెమొరైజేషన్ స్ట్రాటజీ... మెథడ్ ఆఫ్ లోకి.

మెమోరీ కోచ్, అథ్లెట్ బోరిస్ నికోలాయ్ వందల పేర్లను కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలో గుర్తు పెట్టుకొని చెబుతాడు. నికోలాయ్ నెదర్లాండ్స్‌కు చెందిన న్యూరోసైంటిస్ట్ మార్టిన్ డ్రెస్లర్‌తో కలిసి ఒక అధ్యయనం నిర్వహించాడు. అందులో భాగంగా 20 ఏళ్ల వయసు ఉన్న 51 మందిని మూడు గ్రూప్‌లుగా విభజించారు.


మొదటి గ్రూప్ చేత ‘మెథడ్ ఆఫ్ లోకి’ ప్రాక్టిస్ చేయించారు. రెండో గ్రూప్ చేత షార్ట్‌టర్మ్ మెమొరీ గేమ్స్ ఆడించారు. మూడో గ్రూప్‌కు మాత్రం ఎలాంటి కార్యక్రమం ఇవ్వలేదు. ఆరువారాల తరువాత... మొదటి గ్రూప్ మెమొరీ పవర్ పెరిగింది. రెండు, మూడు గ్రూప్‌లలో పెద్దగా మార్పు కనిపించలేదు.

పురాతనమైన ‘మెథడ్ ఆఫ్ లోకి’ ప్రాధాన్యత కోల్పోలేదు అని చెప్పడానికి ఇదొక బలమైన ఉదాహరణ. అందుకే యూత్ దీనిపై ఆసక్తి కనబరుస్తోంది. ‘మెథడ్ ఆఫ్ లోకి’ని మెమొరీ జర్నీ, మెమొరీ ప్యాలెస్... మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. ‘లోకి’ అనేది ‘లోకస్’ అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం... ప్రదేశం. సమాచారాన్ని మనసులోని ఊహాజనిత ప్రదేశాల్లో స్థిరపరుచుకోవడమే ‘మెథడ్ ఆఫ్ లోకి’ టెక్నిక్.

ఉదాహరణకు...717, 919, 862, 9199.. లను గుర్తు పెట్టుకోవాలనుకుంటే మనసులో సుపరిచితమైన ప్రదేశాన్ని ఆవిష్కరించుకోవాలి. సపోజ్ మన ఇల్లు. ఆ ఇంట్లో కిచెన్‌కు ఒక సంఖ్య, డోర్‌కు ఒక సంఖ్య, విండోకు ఒక సంఖ్య ఇచ్చుకోవాలి.

స్థూలంగా చెప్పాలంటే...

‘మెథడ్ ఆఫ్ లోకి’ని ప్రాక్టీస్ చేసినా, రకరకాల మెమొరీ గేమ్స్ ఆడినా, జ్ఞాపకశక్తికి సంబంధించిన అద్భుతమైన పుస్తకాలు చదివినా... శక్తిహీనత ప్రమాదం నుంచి బయటపడి జ్ఞాపకశక్తిని పదిలపరుచుకునే ప్రయత్నమే అవుతుంది. మంచిదే కదా!



బిల్‌గేట్స్ నుంచి యూత్ వరకు...

కోచీ(కేరళ)కు చెందిన 24 సంవత్సరాల శైష తన జ్ఞాపకశక్తి బలహీనం అవుతున్న సమయంలో చదివిన పుస్తకం ‘మూన్‌వాకింగ్ విత్ ఐన్‌స్టీన్: ది ఆర్ట్ అండ్ సైన్స్ ఆఫ్ రిమెంబరింగ్ ఎవ్రీ థింగ్’ ఎంతో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చింది. జాషువా ఫోయర్ ఎంతో పరిశోధించి, విశ్లేషించి రాసిన ఈ పుస్తకానికి యువతలో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. బిల్‌గేట్స్‌కు బాగా నచ్చిన పుస్తకం ఇది. 320 పేజీల ‘మూన్‌వాకింగ్ విత్ ఐన్‌స్టీన్’ లో ఫోయర్ రకరకాల నిమానిక్ టూల్స్ (జ్ఞాపక శక్తికి ఉపకరించేవి) నుంచి ఇంగ్లాండ్‌కు చెందిన విద్యావేత్త టోనీ బుజాన్ మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్ వరకు ఎన్నో అంశాలు ప్రస్తావించాడు.

పాచిపని చేసింది... లెక్చరర్‌గా రాణిస్తోంది

పిల్లల చదువుల కోసం ఇళ్లలో పాచిపనులు చేసిన మధు ఇప్పుడు కాలేజీలో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పాఠాలు చెబుతోంది. ఒకప్పుడు ఇంగ్లిష్ చదువులు మీరేం చదువుతారని పిల్లలకు అడ్మిషన్ ఇవ్వలేదు. అలాంటి ఆమె పిల్లలు ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారు. ఈ విజయం ఒక్కరోజుతో రాలేదు. ప్రతిరోజూ పోరాటమే అని వివరిస్తారు రాజస్థాని భిల్వారా నివాసి మధు. ఆమె గురించి అడిగితే సక్సెస్‌ని ఏ విధంగానైనా కష్టపడి సాధించుకోవచ్చు అని చెబుతుంది.

‘‘మేం ఆరు మంది తోబుట్టువులం. మా నాన్న చనిపోయినప్పుడు నాకు నాలుగేళ్లు. ఎన్నో ఇక్కట్ల మధ్య పెరిగాను. ఇంటర్మీడియెట్ పూర్తయ్యాక పెళ్లయింది. నా భర్త ఒక కంపెనీలో వర్కర్‌గా పనిచేసేవాడు. అతని జీతం ఇంటి అవసరాలకు ఏ మాత్రం సరిపోయేది కాదు. పిల్లలు పుట్టాక ఇంకా సమస్యలు పెరిగాయి. దీంతో కుట్టుపని మొదలు పెట్టాను. కొంత కాలానికి మా ఆయనకు కీళ్లనొప్పులు వచ్చి, ఆరోగ్యం బాగా క్షీణించడంతో ఆయన చేస్తున్న పనిని వదిలేయాల్సి వచ్చింది. దీంతో ఇంటి ఆర్థిక పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. ఈ కష్టకాలంలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ వారి స్కూల్‌కు దగ్గరలో కుట్టుమిషన్ పెట్టుకోవడానికి ప్లేస్ ఇచ్చాడు. అక్కడ కూర్చొని కుట్టుపని చేసేదాన్ని. అక్కడ బ్యాగులు, కవర్లు తయారు చేయడం మొదలు పెట్టినప్పుడు, ఆ స్కూల్ టీచర్ ఒకరు నేను చాలా త్వరగా వర్క్ నేర్చుకుంటానని గమనించారు. నా పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలని కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించడానికి వెళితే, ‘మీరు చదువుకోలేదు, స్కూల్ ఫీజులు కూడా కట్టలేరు, అడ్మిషన్ ఇవ్వలేం’ అన్నారు. ఈ విషయం నన్ను చాలా ఇబ్బంది పెట్టింది.

■ **ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపల్**

నేను కుట్టుపని చేస్తున్నప్పుడు బ్యాగుల తయారీ గురించి తెలుసుకోవడానికి ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపల్ వచ్చేవారు. ఆ సమయంలో పిల్లలతోపాటు నన్ను కూడా చదువుకోమని ప్రోత్సహించారు. అందుకు తగిన దూరవిద్య ఫామ్స్ కూడా తెచ్చి ఇచ్చారు. దీంతో పిల్లలు గవర్నమెంట్ స్కూల్లో, నేను కుట్టుమిషన్ దగ్గరే చదువుకునేదాన్ని. రోజూ ఉదయాన్నే నాలుగిళ్లలో పనులు చేయడం, కుట్టుమిషన్‌పై బ్యాగులు కుట్టడం, ఖాళీ సమయంలో డిగ్రీ పుస్తకాలు చదవడం... ఇలాగే నడిచేది.

■ **అడ్డంకిగా మారిన పరిస్థితులు**

నేను పట్టుదలగా చదువుకోవడం చూసిన గవర్నమెంట్ స్కూల్ టీచర్లు కూడా నన్ను ప్రోత్సహించేవారు. పిల్లలు కూడా నాకు చదువుకోవడానికి అవకాశం ఇచ్చేవారు. అయితే, మా అత్తగారు ఆపేవారు. మామగారికి మా బంధువులు వెక్కిరిస్తున్నారని చెప్పేవారు. ఆమె సాయంత్రం పూట ఎక్కడకు వెళ్తుందో, ఎక్కడి నుండి వస్తుందో అని విపరీతపు మాటలు రకరకాలుగా మాట్లాడుకునేవారు. కానీ, నా భర్త వాటన్నింటినీ పట్టించుకోవద్దని చెప్పేవారు.

నేను ఎం.ఏ. పరీక్షలు రాస్తున్నప్పుడు మా మామగారు చనిపోయారు. దీంతో చదువును వదులుకునే పరిస్థితి వచ్చింది. కానీ, స్కూల్ టీచర్ శైలజ వచ్చి మా అత్తగారికి నచ్చచెప్పి, నన్ను చదువు కొనసాగించమని ప్రోత్సహించడంతో ఆ పరిస్థితి నుంచి గట్టెక్కాను.


మధు

■ **లెక్చరర్‌గా చేస్తూనే..**

మొదటిసారి నెట్‌లో అర్హత సాధించడంతో అంతా ఆశ్చర్యపోయారు. పొలిటికల్ సైన్స్‌లో ఎం.ఏ. పూర్తిచేసి, పీహెచ్‌డీకి అడ్మిషన్ తీసుకున్నాను. పిల్లలు పెద్దవడంతో డబ్బు అవసరం కూడా పెరిగింది. దీంతో పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా చేరాను. నెలకు ఆరువేల రూపాయలు వచ్చేవి. వాటితోనే ఇల్లు గడవదని, టైలరింగ్ పనులు చేస్తూనే ఉండేదాన్ని. కానీ, మనం అనుకున్నవి అన్నీ జరగవు కదా. మా వారి ఆరోగ్యం మరీ క్షీణించడంతో ట్రీట్‌మెంట్ నెలలపాటు కొనసాగింది. దీనిని తట్టుకుంటూనే నా జీవన పోరాటం చేస్తూనే ఉన్నాను. నా కూతురు ఐఐటీలో సీటు సంపాదించి, మాస్టర్స్ కూడా చేసింది. కొడుకు ఇంకా చదువుకుంటున్నాడు. నాలుగిళ్లలో పనిచేసుకునే నేను ఇప్పుడు లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నా భర్తను అనారోగ్యం నుంచి కాపాడుకున్నాను. పిల్లలు మంచి చదువులు చదువుకుంటూ ఉన్నత అవకాశాలను అందుకుంటున్నారు. త్వరలోనే మంచి ఉద్యోగాల్లో వారిని చూడబోతున్నాను’’ అని ఆనందంగా వివరించే మధు జీవనపోరాటంలో విజయం ఒక్కరోజుతో సాధ్యం కాలేదని, ప్రతిరోజూ కఠోరశ్రమ చేస్తే వచ్చిందని చెబుతోంది మధు.



క్వార్టర్ ఫైనల్లో రష్మిక, సహజ జోడీలు

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శ్రీవల్లి రష్మిక, సహజ యామలపల్లి తమ భాగస్వాములతో కలిపి డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. థాయ్‌లాండ్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-1, 6-3తో పవిని -జులా లక్ (థాయ్‌లాండ్) జంటపై... సహజ-సోహా (భారత్) జోడీ 6-3, 3-6, 10-6తో ఆన్ యుజిన్ (కొరియా)-ఇకుమి (జపాన్) ద్వయంపై గెలిచాయి.

మిగతా 'యాషెస్' టెస్టులకు పోప్ దూరం



ఆస్ట్రేలియా చేతిలో రెండు టెస్టుల్లో ఓడిపోయి ఇబ్బందుల్లో ఉన్న ఇంగ్లండ్ జట్టుకు మరో దెబ్బ పడింది. జట్టు వైస్ కెప్టెన్ ఓలి పోప్ భుజం గాయం కారణంగా తదుపరి మూడు టెస్టులకు దూరమయ్యాడు. లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టు సందర్భంగా ఓలి పోప్ గాయపడ్డాడు. పోప్ భుజం గాయానికి శస్త్ర చికిత్స అవసరమని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. రెండు టెస్టుల్లో పోప్ మొత్తం 90 పరుగులు సాధించాడు. మూడో టెస్టు గురువారం నుంచి హెడింగ్లీలో జరుగుతుంది.

చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పురుషుల సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా అజిత్ అగార్కర్‌ను నియమించినట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు. సెలెక్షన్ ప్యానెల్‌లో ఖాళీగా ఉన్న ఒక సెలెక్టర్ పదవి కోసం అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) మంగళవారం ఇంటర్వ్యూలు చేసింది. చివరకు అగార్కర్ పేరును ఈ పదవి కోసం సీఏసీ ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. అనంతరం అగార్కర్ అనుభవందృష్ట్యా చీఫ్ సెలెక్టర్ పదవికి కూడా సీఏసీ అతని పేరునే సూచించింది. ముంబైకి చెందిన 45 ఏళ్ల అగార్కర్ భారత్ తరఫున 26 టెస్టులు, 191 వన్డేలు, నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడాడు. 2007లో ధోని సారథ్యంలో టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో అగార్కర్ సభ్యుడిగా ఉన్నాడు. వన్డేల్లో వేగవంతమైన అర్ధ సెంచరీ చేసిన భారత బ్యాటర్ రికార్డు ఇప్పటికీ అగార్కర్ పేరిటే ఉంది. 2000లో జింబాబ్వేతో జరిగిన వన్డేలో అగార్కర్ 21 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. ప్లేయర్‌గా కెరీర్ ముగిశాక అగార్కర్ ముంబై జట్టు చీఫ్ సెలెక్టర్‌గా, ఢిల్లీ క్యాపిటల్స్ అసిస్టెంట్ కోచ్‌గా పని చేశాడు.

భారత సీనియర్ సెలెక్షన్ కమిటీ: అజిత్ అగార్కర్ (చైర్మన్), శివ సుందర్ దాస్, సుబ్రతో బెనర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్.

చాంపియన్ భారత్

తొమ్మిదోసారి 'శాఫ్' టైటిల్ సొంతం ● ఫైనల్లో 'పెనాల్టీ షూటౌట్'లో కువైట్‌పై విజయం



బెంగళూరు: దక్షిణాసియా ఫుట్‌బాల్‌లో భారత జట్టు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ (శాఫ్)లో తొమ్మిదోసారి భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్లో సునీల్ ఛెత్రి కెప్టెన్సీలోని టీమిండియా 'పెనాల్టీ షూటౌట్'లో 5-4తో కువైట్ జట్టును ఓడించింది. కువైట్ పశ్చిమ ఆసియా దేశమైనా పోటీతత్వం పెరగాలనే ఉద్దేశంతో దక్షిణాసియా టోర్నీకి ఆ జట్టును ప్రత్యేకంగా ఆహ్వానించారు. లీగ్ దశలో కువైట్‌తో జరిగిన మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకున్న భారత్ తుది పోరులో మాత్రం పైచేయి సాధించింది. ఆట 14వ నిమిషంలో అల్‌బలూషి గోల్‌తో కువైట్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 39వ నిమిషంలో లాలియన్‌జులా చాంగ్టే గోల్‌తో భారత్ 1-1తో స్కోరును సమం చేసింది. ఆ తర్వాత రెండు జట్లు మరో గోల్ చేయలేకపోయాయి. అదనపు సమయంలోనూ స్కోరు సమంగానే ఉంది. దాంతో విజేతను నిర్ణయించడానికి పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. 'షూటౌట్'లో నిర్ణీత ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 4-4తో సమంగా నిలిచాయి. ఆరో షాట్‌లో భారత ప్లేయర్ మహేశ్ సింగ్ గోల్ చేయగా... కువైట్ ప్లేయర్ హాజిహ్ కొట్టిన షాట్‌ను భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ అడ్డుకోవడంతో టీమిండియా విజయం ఖాయమైంది.

విజేతగా నిలిచిన భారత జట్టుకు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు), రన్నరప్ కువైట్ జట్టుకు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'షూటౌట్' సాగిందిలా...

భారత్		స్కోరు	కువైట్	
సునీల్ ఛెత్రి	✔	1-0	అబ్దుల్లా	✘
సందేశ్ జింగాన్	✔	2-1	అలోతైబి	✔
లాలియన్‌జులా	✔	3-2	అల్దెఫీరి	✔
ఉదాంత సింగ్	✘	3-3	మహ్రాన్	✔
సుభాశ్ బోస్	✔	4-4	అల్ఖాల్ది	✔
మహేశ్ సింగ్	✔	5-4	హాజిహ్	✘

9 'శాఫ్' చాంపియన్‌షిప్ ఇప్పటివరకు 13 సార్లు జరిగింది. భారత్ తొమ్మిదిసార్లు (1993, 1997, 1999, 2005, 2009, 2011, 2015, 2021, 2023) టైటిల్ సాధించింది.

24 'శాఫ్' చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా సునీల్ ఛెత్రి అవతరించాడు. 23 గోల్స్‌తో అలీ అష్ఫాక్ (మాల్దీవులు) పేరిట ఉన్న రికార్డును 24 గోల్స్‌తో సునీల్ ఛెత్రి అధిగమించాడు.

అల్‌కరాజ్ అలవోకగా...

● రెండో రౌండ్‌లోకి టాప్ సీడ్
● ముర్రే ముందంజ



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో అల్‌కరాజ్ 6-0, 6-2, 7-5తో జెరెమీ చార్డీ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. గంటా 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ పది ఏస్‌లు సంధించి రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. చార్డీ సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసిన ఈ స్పెయిన్ స్టార్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. నెట్ వద్దకు తొమ్మిదిసార్లు దూసుకొచ్చిన అల్‌కరాజ్ ఏడుసార్లు పాయింట్లు గెలిచాడు. 38 విన్నర్స్ కొట్టిన అతను 14 అనవసర తప్పిదాలు చేశాడు. మరో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కూడా అలవోక విజయంతో రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. రియాన్ పెనిస్టన్ (బ్రిటన్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ముర్రే 6-3, 6-0, 6-1తో విజయం సాధించాడు. వర్షం కారణంగా రెండో రోజు పలు మ్యాచ్‌లకు అంతరాయం కలిగింది. పైకప్పు కలిగిన సెంటర్ కోర్టు, నంబర్‌వన్ కోర్టులోని మ్యాచ్‌లు సజావుగా సాగాయి. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) కష్టపడి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. రిబాకినా 4-6, 6-1, 6-2తో షెల్బీ రోజర్స్ (అమెరికా)పై నెగ్గింది. మరో మ్యాచ్‌లో ఆరో సీడ్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 6-3తో మగ్దలీనా ఫ్రెచ్ (పోలాండ్)ను ఓడించింది. సోమవారం ఆలస్యంగా ముగిసిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ఏడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 4-6, 6-4, 2-6తో 2020 ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

రజతం గెలిచిన వ్రితి



సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి వ్రితి అగర్వాల్ మూడో పతకం సాధించింది. గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం జరిగిన మహిళల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి రజత పతకం గెలిచింది. వ్రితి 9ని:17.62 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. భవ్య సచ్‌దేవ (ఢిల్లీ; 9ని:15.59 సెకన్లు) స్వర్ణం, అనన్య (మహారాష్ట్ర; 9ని:24.67 సెకన్లు) కాంస్యం నెగ్గారు.

భారత 'ఎ' జట్టులో నితీశ్ రెడ్డి



న్యూఢిల్లీ: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన భారత 'ఎ' జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల నితీశ్ కుమార్ రెడ్డికి స్థానం లభించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి 2018 బీసీసీఐ వార్షిక పురస్కారాల్లో అండర్-16 విభాగంలో 'బెస్ట్ క్రికెటర్' అవార్డు గెల్చుకున్నాడు. ఎనిమిది ఆసియా దేశాల మధ్య వన్డే ఫార్మాట్‌లో జరిగే ఎమర్జింగ్ కప్ టోర్నీ ఈనెల 13 నుంచి 23 వరకు కొలంబోలో జరుగుతుంది. గ్రూప్ 'బి'లో భారత్, నేపాల్, యూఏఈ, పాకిస్తాన్... గ్రూప్ 'ఎ'లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, ఒమన్ జట్లున్నాయి. భారత్ తమ లీగ్ మ్యాచ్‌లను 13న యూఏఈతో... 15న పాకిస్తాన్‌తో... 18న నేపాల్ జట్లతో ఆడుతుంది. సెమీఫైనల్స్ 21న, ఫైనల్ 23న జరుగుతాయి.

భారత 'ఎ' జట్టు: యశ్ ధుల్ (కెప్టెన్), అభిషేక్ శర్మ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, నికిన్ జోస్, ప్రదోశ్ రంజన్ పాల్, రియాన్ పరాగ్, నిశాంత్ సింధు, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ధ్రువ్ జురేల్, మానవ్, యువరాజ్ సింగ్ డోడియా, హర్షిత్ రాణా, ఆకాశ్ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, రాజ్‌వర్ధన్ హంగార్గేకర్.

జింబాబ్వేకు మళ్లీ నిరాశ

● వరుసగా రెండోసారి దక్కని వన్డే ప్రపంచకప్ బెర్త్
● స్కాట్లాండ్ చేతిలో పరాజయం

బులవాయో: తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో తడబడటంతో... జింబాబ్వే జట్టు వరుసగా రెండోసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించలేకపోయింది. వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా మంగళవారం స్కాట్లాండ్ జట్టుతో జరిగిన తమ 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో జింబాబ్వే 31 పరుగుల తేడాతో ఓడిపోయింది. ముందుగా స్కాట్లాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 234 పరుగులు సాధించింది. మైకేల్ లీస్క్ (48; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మాథ్యూ క్రాస్ (38; 2 ఫోర్లు), బ్రెండన్ మెక్‌ములెన్ (34; 6 ఫోర్లు) రాణించారు. జింబాబ్వే బౌలర్లలో సీన్ విలియమ్స్ మూడు వికెట్లు, చటారా రెండు వికెట్లు తీశారు. అనంతరం 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 41.1 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. రియాన్ బర్ల్ (83; 8 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (34; 2 ఫోర్లు, 1 సిక్స్), మధెవెరె (40; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్రిస్ సోల్ (3/33) జింబాబ్వేను దెబ్బ కొట్టాడు. మెక్‌ములెన్, లీస్క్ రెండు వికెట్ల చొప్పున తీశారు. 2019లోనూ జింబాబ్వే క్వాలిఫయింగ్ టోర్నీలోనే వెనుదిరిగింది.

జింబాబ్వేపై విజయంతో స్కాట్లాండ్ దాదాపుగా ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈనెల 6న నెదర్లాండ్స్‌తో జరిగే తమ చివరి 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో స్కాట్లాండ్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా మెగా ఈవెంట్‌కు అర్హత పొందుతుంది. ఒకవేళ ఓడిపోయినా నెదర్లాండ్స్ కంటే రన్‌రేట్ తక్కువ కాకుండా చేసుకుంటే స్కాట్లాండ్‌కే ప్రపంచకప్ బెర్త్ ఖరారవుతుంది. నెదర్లాండ్స్ ప్రపంచకప్‌కు అర్హత సాధించాలంటే స్కాట్లాండ్‌పై భారీ విజయం సాధించాల్సి ఉంటుంది.



డాక్టర్ పుల్లెల గోపీచంద్!

భారత బ్యాడ్మింటన్ కోచ్‌కు గౌరవ డాక్టరేట్




బెంగళూరు: భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్‌కు మరో గౌరవం దక్కింది. కర్ణాటకకు చెందిన శ్రీ సత్య సాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. మంగళవారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆయనకు ఈ పురస్కారాన్ని అందించారు. జాతీయ అభివృద్ధిలో క్రీడల ద్వారా తనదైన పాత్ర పోషించినందుకు గోపీచంద్‌ను డాక్టరేట్ కోసం ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ ప్రకటించింది. గోపీచంద్‌తో పాటు మరో నలుగురు కూడా దీనిని అందుకున్నారు.

సినిమా

యాక్షన్.. పరేషాన్







స్క్రీన్‌పై విలన్లను హీరో రఫ్ఫాడిస్తుంటే ఫ్యాన్స్‌కి కిక్కో కిక్కు.. కానీ ఆ యాక్షన్ సీన్స్ చేసేటప్పుడు స్టార్స్‌కి తగిలే గాయాలు ఒక్కోసారి ఆపరేషన్‌కి దారితీస్తాయి. ఇక ఇటీవల యాక్షన్ షూట్‌లో పరేషాన్ అయిన స్టార్స్ గురించి తెలుసుకుందాం.

టైగర్‌కి గాయం

ఐదు కేజీల డంబెల్‌ని అమాంతంగా ఎత్తగలిగే సల్మాన్ ఖాన్‌కి ఇటీవల ఐదు కేజీల కన్నా తక్కువ బరువు ఉన్న వస్తువులు ఎత్తడం కష్టమైంది. దానికి కారణం 'టైగర్ 3' సినిమా. ఈ చిత్రం కోసం నెలన్నర క్రితం ఓ రిస్కీ యాక్షన్ సీన్ చేస్తుండగా సల్మాన్ గాయపడ్డారు. ''ప్రపంచాన్నే మన భుజం మీద మోస్తున్న ఫీలింగ్‌లో ఉన్నప్పుడు.. ఆ ప్రపంచాన్ని వదలండి.. ఇప్పుడు కనీసం ఐదు కిలోల డంబెల్ ఎత్తడం కూడా కష్టమవుతోంది'' అని భుజానికి అయిన గాయం తాలూకు నొప్పిని తగ్గించే పట్టీ వేయించుకుని ఉన్న ఫొటోను షేర్ చేశారు సల్మాన్. అంతే.. 'టైగర్ (సల్మాన్‌ని ఉద్దేశించి)కి ఏమీ కాదు... తగ్గిపోతుంది' అంటూ ఫ్యాన్స్ స్పందించారు.

కింగ్ ఖాన్.. నోస్ సర్జరీ

షారుక్ ఖాన్‌ని ఆయన ఫ్యాన్స్ కింగ్ ఖాన్ అని పిలుచుకుంటారు. ఈ కింగ్ ఖాన్ ఫ్యాన్స్‌కి కిక్ ఇవ్వడానికి రిస్కీ ఫైట్స్ చేస్తుంటారు. తాజాగా అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో ఓ చిత్రం కోసం యాక్షన్ సీన్ చేస్తూ, గాయపడ్డారు షారుక్. ముక్కుకి బలమైన గాయం కావడంతో సర్జరీ జరిగిందనే వార్త మంగళవారం వెలుగులోకి వచ్చింది. అమెరికాలో శస్త్ర చికిత్స జరిగిన అనంతరం షారుక్ ముంబై చేరుకున్నారట. ''రక్త స్రావం ఆగడానికి ముక్కుకి చిన్నపాటి శస్త్ర చికిత్స చేశాం. కంగారుపడాల్సిన అవసరం లేదు'' అని షారుక్ వ్యక్తిగత సిబ్బందికి డాక్టర్లు తెలియజేశారని బాలీవుడ్ టాక్.

విక్రమ్.. రిస్కీ పోరాటమ్

విలక్షణ పాత్రలకు చిరునామా విక్రమ్. తాజాగా విక్రమ్ ఓ కొత్త లుక్‌లో నటిస్తున్న చిత్రం 'తంగలాన్'. ఈ చిత్రం కోసం రిస్కీ ఫైట్ షూట్‌లో పాల్గొనే ముందు విక్రమ్ రిహార్సల్స్ చేశారు. అప్పుడు జరిగిన ప్రమాదంలో ఆయన పక్కటెముక విరిగింది. వెంటనే విక్రమ్‌ను ఆస్పత్రికి తరలించారు. రెండు నెలల క్రితం ఈ ప్రమాదం జరిగింది. కోలుకున్నాక ఆయన తిరిగి షూట్‌లో పాల్గొనడంతో సినిమా పూర్తయింది.

పృథ్వీ.. మూడు నెలల విశ్రాంతి

మలయాళ పరిశ్రమలో ఓ స్టార్ హీరోగా, దర్శకుడిగా దూసుకెళుతున్నారు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'విలయత్ బుద్ధ'. పది రోజుల క్రితం ఈ సినిమా కోసం ఒక యాక్షన్ సీన్‌ని ఆర్టీసీ బస్సులో చిత్రీకరిస్తున్నప్పుడు పృథ్వీరాజ్ కింద పడటంతో దెబ్బ తగిలింది. బలమైన గాయం కావడంతో కాలికి సర్జరీ చేయాలని వైద్యులు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం దాదాపు మూడు నెలల పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని పృథ్వీరాజ్‌కి సూచించారు.

వరుణ్.. మూడు వారాల విశ్రాంతి

వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది కానిస్టేబుల్'. ఈ చిత్రం కోసం ఇటీవల ఓ ఫైట్ సీన్ తీస్తున్న సమయంలో గాయపడ్డారు వరుణ్ సందేశ్. ఈ ప్రమాదంలో వరుణ్ సందేశ్ కాలికి బలమైన గాయం అయింది. దీంతో ఆయన్ని హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స అనంతరం మూడు వారాలు విశ్రాంతి తీసుకోవాలంటూ వరుణ్‌కి సూచించారు వైద్యులు. వరుణ్ సందేశ్ గాయపడటంతో 'ది కానిస్టేబుల్' సినిమా షూటింగ్ ప్రస్తుతానికి వాయిదా పడింది.



● విక్రమ్ ● పృథ్వీ ● వరుణ్ సందేశ్


డిసెంబర్‌కి రెడీ



● వరుణ్‌తేజ్

వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతోన్న 13వ చిత్రం 'వీటీ 13' (వర్కింగ్ టైటిల్). శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వంలో తెలుగు, హిందీ భాషల్లో సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్‌పై సందీప్ ముద్ద ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో ఈ సినిమాలోని ఓ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఐఏఎఫ్ అధికారిగా యుద్ధ విమానం ముందు నిలబడి ఉన్న వరుణ్ ఫొటోని చిత్రబృందం విడుదల చేసింది. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'వీటీ 13'. త్వరలో టైటిల్ అనౌన్స్ చేస్తాం. డిసెంబర్‌లో సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లార్ రాడార్ ఆఫీసర్ పాత్ర చేస్తున్నారు.

ఇది నా టైమ్ అనిపిస్తోంది! - దర్శకుడు నీలకంఠ



''కాన్సెప్ట్, కమర్షియల్ అంశాలను బాగా బ్యాలెన్స్ చేయాలి. అయితే నా గత చిత్రాలకు ఈ బ్యాలెన్స్‌ను మిస్సయ్యానని అనుకుంటున్నా. బాలచందర్‌గారివంటి పెద్ద దర్శకుల కమర్షియల్ చిత్రాలు ఆడియన్స్‌ను అలరిస్తూనే కాన్సెప్ట్ ఓరియంటెడ్‌గా ఉండేవి. 'సర్కిల్' సినిమాకి ఆ బ్యాలెన్స్ మిస్ కాకుండా జాగ్రత్త తీసుకుని, చేశాను'' అన్నారు దర్శకుడు నీలకంఠ. సాయిరోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. ఎమ్‌వీ శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో నీలకంఠ మాట్లాడుతూ– ''సర్కిల్' ఎమోషనల్ థ్రిల్లర్ ఫిల్మ్. విధి వందమందిని ఓ సర్కిల్‌లోకి తీసుకొచ్చి వారి జీవితాలను ఎలా అల్లకల్లోలం చేసింది? అన్నదే కాన్సెప్ట్. ఈ చిత్రంలో ఫొటోగ్రాఫర్ పాత్రలో నటించిన సాయి రోనక్ అనూహ్యమైన ఘటనల్లో ఎలా చిక్కుకున్నాడు? అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఆడియన్స్ సినిమాలను చూసే విధానంలో మార్పు వచ్చింది. నా తరహా సినిమాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. సో.. ఇది నా టైమ్ ఏమో అనిపిస్తోంది. 'సర్కిల్' ప్రేక్షకులకు నచ్చుతుందనే అనుకుంటున్నాను. ఇక నా కెరీర్‌లో నేను గ్యాప్ ఇవ్వలేదు... ఇవ్వబడింది. 'మాయ' సినిమాను మహేశ్ భట్‌గారు హిందీలో తీయాలనుకున్నారు.. కుదర్లేదు. ఓ రెండు ప్రాజెక్ట్స్ సెట్స్‌కు వెళ్లే టైమ్‌లో ఆగిపోయాయి. స్వామి వివేకానందగారి జీవితంతో వెంకటేశ్‌గారితో ఓ ప్రాజెక్ట్ అనుకున్నాను.. కుదర్లేదు. కానీ ఆయన నటించిన 'ఈనాడు'కు డైలాగ్స్ రాశాను. హిందీ 'క్వీన్' మలయాళ రీమేక్ చేశాను. ఓ సోషల్ డ్రామా, పీరియాడికల్ సబ్జెక్ట్స్‌తో వెబ్ సిరీస్‌ల ప్లాన్ ఉంది'' అన్నారు.

ఇప్పట్లో రీమేక్ చేయను - నిర్మాత అర్జున్ దాస్యన్



శ్రీ సింహా కోడూరి, నేహా సోలంకి జంటగా నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'భాగ్ సాలే'. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వంలో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అర్జున్ దాస్యన్ మాట్లాడుతూ– ''కష్టపడకుండా తక్కువ టైమ్‌లో జీవితంలో ఎదగాలనుకునే అర్జున్ అనే ఓ కుర్రాడి లైఫ్ ఫైనల్‌గా ఏమైంది? అన్నదే కాన్సెప్ట్. అర్జున్ పాత్రలో శ్రీ సింహా నటించారు. దర్శకుడు ప్రణీత్ కథ చెప్పినదాని కంటే పదిరెట్లు బాగా తీశాడు. 'కార్తికేయ 2'లోలా ఈ చిత్రంలోనూ కృష్ణుడి కాన్సెప్ట్ ఉంటుంది. ఆ సినిమాకి ఇచ్చినట్లే ఈ సినిమాకి కూడా కాలభైరవ మంచి మ్యూజిక్ ఇచ్చారు. ఇక నేను నిర్మించిన 'డియర్ మేఘ' చిత్రం కన్నడ 'దియా'కు రీమేక్. కారణాలు తెలియదు కానీ 'డియర్ మేఘ' విడుదలైన రోజే 'దియా' యూట్యూబ్‌లో విడుదలైంది. మాకు బాగా నష్టం కలిగింది. సో.. ఇప్పట్లో రీమేక్ మూవీ చేయకూడదనుకుంటున్నాను. అలాగే కొందరు నిర్మాతల అసోసియేషన్‌తోనే ప్రొడక్షన్ చేద్దామని అనుకుంటున్నాను. ప్రియదర్శి హీరోగా ఓ సినిమా తీస్తున్నాం. హిందీలో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం'' అన్నారు.

కామెడీ.. యాక్షన్



● 'ఇద్దరు' వేడుకలో ఓ దృశ్యం

అర్జున్ సర్జా, జేడీ చక్రవర్తి, రాధికా కుమారస్వామి, ఫైజల్ ఖాన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఇద్దరు'. ఎస్ఎస్ సమీర్ దర్శకత్వంలో డీఎస్ రెడ్డి సమర్పణలో ఫర్హీన్ ఫాతిమా నిర్మించారు. ఈ నెల 7న రిలీజవుతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అతిథిగా హాజరై, 'ఇద్దరు' మంచి విజయం సాధించాలన్నారు. ''యాక్షన్, కామెడీతో సాగే చిత్రమిది'' అన్నారు ఎస్ఎస్ సమీర్. ''ఈ సినిమాలో హీరో ఎవరు? విలన్ ఎవరన్నది చివరివరకూ ఊహించలేరు'' అన్నారు ఫర్హీన్ ఫాతిమా.

రైజ్ టు రూల్



● కమల్‌హాసన్

జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు హీరో కమల్‌హాసన్. వరుసగా సినిమాలు సైన్ చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్ 2'తో కమల్ బిజీగా ఉంటున్నారు. కాగా 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') తర్వాత మణిరత్నంతో మళ్లీ ఓ సినిమా చేయడానికి కమల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది కమల్‌హాసన్ కెరీర్‌లో 234వ సినిమాగా ప్రకటించారు. దీంతో ఆయన 233వ సినిమా చర్చనీయాంశమైంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఈ సినిమా ఉంటుందనే టాక్ వినిపించింది. ఫైనల్‌గా అదే నిజమైంది. హీరో కమల్‌హాసన్, దర్శకుడు హెచ్. వినోద్ కాంబినేషన్‌లో సినిమాను మంగళవారం ప్రకటించారు. ''అండ్ ఇట్ బిగిన్స్. రైజ్ టు రూల్' అంటూ ఈ సినిమాను ఉద్దేశించి ట్వీట్ చేశారు కమల్.


కళ్లలో భయం!



● పాయల్ రాజ్‌పుత్

'ఆర్ఎక్స్ 100' తర్వాత హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, దర్శకుడు అజయ్ భూపతి కాంబినేషన్‌లో రూపొందిన డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్ 'మంగళవారం'. స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి 'ఎ' క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామి. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. కాగా 'ఫియర్ ఇన్ ఐస్ (కళ్లలో భయం) అంటూ 'మంగళవారం' సినిమా టీజర్‌ను మంగళవారం చిత్ర యూనిట్ విడుదల చేశారు. ''ఈ సినిమాలో 30 పాత్రలు ఉన్నాయి. ఇందులోని ప్రతి పాత్ర హైలైట్ అవుతుంది'' అన్నారు అజయ్ భూపతి.

నిజమే నే చెబుతున్నా..



● సందీప్ కిషన్, వర్ష

సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా వీఐ ఆనంద్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రం కోసం సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచగా, సిద్ శ్రీరామ్ పాడిన 'నిజమే నే చెబుతున్నా..' పాట మార్చిలో విడుదలైంది. ''ఈ పాట లిరికల్ వీడియోకు శ్రోతల నుంచి మంచి రెస్పాన్స్ లభిస్తోంది. ఈ పాట ఇప్పటికే 3 కోట్ల వ్యూస్ సాధించింది. 'బాగుంటుంది నువ్వు నవ్వితే', 'ప్రియతమా ప్రియతమా, 'మనసు దారి తప్పెనే'... వంటి పాటల తర్వాత సిద్ శ్రీరామ్, నా కాంబినేషన్‌లో వచ్చిన ఈ పాట హిట్ కావడం హ్యాపీగా ఉంది. సందీప్ కిషన్, వీఐ ఆనంద్, గీత రచయిత శ్రీమణిలకు థ్యాంక్స్'' అని అన్నారు.

తొలి ప్రేమ కథతో...



● ఆర్యన్, మిస్టీ

ఆర్యన్ గౌర, మిస్టీ చక్రవర్తి జంటగా నటించిన లవ్‌స్టోరీ 'ఓ సాథియా'. దివ్య భావన దర్శకత్వంలో చందన కట్టా, సుభాష్ కట్టా నిర్మించారు. యూఎఫ్ఓ మూవీస్ సంస్థ ఈ సినిమాను ఈ నెల 7న విడుదల చేయనుంది. ''లవ్‌స్టోరీలో ఓ డిఫరెంట్ యాంగిల్‌ను తీసుకుని ఈ సినిమాను తెరకెక్కించాం. ప్రతి వ్యక్తి జీవితంలో మెమొరబుల్‌గా నిలిచే ఫస్ట్ లవ్ కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	274	65,479
నిఫ్టీ ▲	66	19,389

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు సోమవారం ముగింపు)			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్ఈ 100	7,520	▼	7
డాక్స్	16,039	▼	42
షాంఘై	3,245	▲	1
నికాయ్	33,203	▼	3

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	58,522
బంగారం (22 క్యారెట్)	58,288
వెండి (కిలో)	69,949

హార్లే డేవిడ్సన్ ఎక్స్440 బుకింగ్స్ షురూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హార్లే డేవిడ్సన్ ఎక్స్440 బైక్ బుకింగ్స్‌ను ప్రారంభించినట్టు హీరో మోటోకార్ప్ మంగళవారం ప్రకటించింది. అక్టోబర్ నుంచి డెలివరీలు ఉంటాయి. హార్లే డేవిడ్సన్ షోరూంలు, ఎంపిక చేసిన హీరో మోటోకార్ప్ ఔట్‌లెట్స్, ఆన్‌లైన్‌లో రూ.5,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. 440 సీసీ ఇంజిన్‌తో కూడిన ఈ బైక్స్‌ను నీమ్రానా ప్లాంటులో హీరో మోటోకార్ప్



తయారు చేస్తోంది. 440 సీసీ విభాగంలోకి ఇరు కంపెనీలు ఎంట్రీ ఇవ్వడం ఇదే తొలిసారి. మూడు వేరియంట్లలో ఎక్స్440 లభిస్తుంది. ఎక్స్‌షోరూం ధర రూ.2.29 లక్షల నుంచి ప్రారంభం. 2020 అక్టోబర్‌లో హీరో మోటోకార్ప్, హార్లే డేవిడ్సన్ చేతులు కలిపాయి. ఈ ఒప్పందం ప్రకారం భారత్‌లో హార్లే డేవిడ్సన్ బ్రాండ్ ప్రీమియం మోటార్‌సైకిళ్లను హీరో మోటోకార్ప్ అభివృద్ధి చేయడంతోపాటు విక్రయిస్తుంది.

నిఫ్టీలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ

హెచ్‌డీఎఫ్‌సీ స్థానంలో చోటు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ–50లో ఎల్‌టీఐమైండ్‌ట్రీ చోటు సాధించనుంది. మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ స్థానే ఇండెక్స్‌లో చేరనుంది. ఈ నెల 13 నుంచి ఇండెక్స్‌లో ప్రాతినిధ్యం వహించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ దిగ్గజాల విలీనం నేపథ్యంలో నిఫ్టీ–50తోపాటు.. నిఫ్టీ 100, నిఫ్టీ–500 ఇండెక్స్‌లలోనూ సవరణలు చేపట్టినట్లు ఎన్ఎస్ఈ



వెల్లడించింది. నిఫ్టీ–100లో హెచ్‌డీఎఫ్‌సీకి బదులు జిందాల్ స్టీల్ అండ్ పవర్‌కు చోటు లభించనుంది. ఎన్ఎస్ఈ ఇండెక్సుల నిర్వహణ ఉపకమిటీ(ఈక్విటీ) ఈ మేరకు మార్పులు చేపట్టినట్లు ఎన్ఎస్ఈ పేర్కొంది. ఈ బాటలో నిఫ్టీ–500లో హెచ్‌డీఎఫ్‌సీ స్థానంలో మ్యాన్‌కైండ్ ఫార్మా, ఎల్‌టీఐమైండ్‌ట్రీ స్థానంలో జిందాల్ స్టీల్ అండ్ పవర్ ప్రాతినిధ్యం వహించనున్నాయి. తాజా సవరణలు 2023 జూలై 13 నుంచి అమలుకానున్నట్లు ఎన్ఎస్ఈ తెలియజేసింది.

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఆస్తులు జూమ్

- రూ.8 లక్షల కోట్ల మైలురాయి చేరిక
- ఏడాదిలో రూ.10 లక్షల కోట్లకు...
- సంస్థ డిప్యూటీ ఎండీ సింగ్ వెల్లడి

ముంబై: దేశంలోనే మ్యూచువల్ ఫండ్ నిర్వహణ ఆస్తుల (ఏయూఎం) పరంగా ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ కొత్త రికార్డు నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) రూ. 90 వేల కోట్ల మేర ఆస్తులను పెంచుకుంది. దీంతో సంస్థ నిర్వహణలోని మొత్తం ఏయూఎం మార్చి నాటికి ఉన్న రూ.7.10 లక్షల కోట్ల నుంచి, జూన్ చివరికి రూ.8 లక్షల కోట్లకు చేరుకుంది. వచ్చే 12 నుంచి 18 నెలల్లో మొత్తం నిర్వహణ ఆస్తులు రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్టు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ డిప్యూటీ ఎండీ, చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డీపీ సింగ్ తెలిపారు. రూ.10 లక్షల కోట్ల మైలురాయిని చేరుకోవాలనే లక్ష్యాన్ని అంతర్గతంగా విధించుకున్నట్టు చెప్పారు. మార్కెట్లో ఏదైనా తీవ్ర పతనాన్ని చూస్తే తప్పితే, తాము దీన్ని చేరుకుంటామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 43



మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం ఏయూఎం జూన్ చివరికి రూ.43.2 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం.

8 శాతం మార్కెట్ వాటా: మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నిర్వహణ ఆస్తులు రూ.43.2 లక్షల కోట్ల ప్రకారం చూస్తే, ఎస్‌బీఐ ఫండ్ ఏయూఎం వాటా 18%. ఇందులో రూ.5.5 లక్షల కోట్ల ఆస్తులు ఈక్విటీలకు సంబంధించినవిగా సింగ్ వెల్లడించారు. ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో తమ పథకాల్లోకి రూ.2,200 కోట్లు వస్తున్నట్టు తెలిపారు. ఎక్కువ పెట్టుబడులు టాప్–30 పట్టణాల నుంచి ఉన్నాయన్నారు. ఎస్‌బీఐ నిర్వహణలోని ఫోలియోల్లో (పెట్టుబడి ఖాతా) 35% చిన్న పట్టణాలవేనని తెలిపారు.

దూకుడు పెంచిన కియా ఇండియా

- 2025 నాటికి 3 కొత్త మోడళ్లు
- వీటిలో రెండు ఎలక్ట్రిక్ కార్లు
- ఏపీ ప్లాంటులోనే తయారీ
- కంపెనీ ఎండీ టే–జిన్ పార్క్
- సెల్టోస్ అప్‌డేటెడ్ వెర్షన్ విడుదల

న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న దక్షిణ కొరియా సంస్థ కియా.. భారత మార్కెట్లో 2025 నాటికి మరో మూడు మోడళ్లను ప్రవేశపెట్టనుంది. వీటిలో రెండు ఎలక్ట్రిక్ వెహికల్స్ ఉంటాయని కియా ఇండియా ఎండీ, సీఈవో టే–జిన్ పార్క్ మంగళవారం వెల్లడించారు. సెల్టోస్ అప్‌డేటెడ్ వెర్షన్ విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కియా 2.0 వ్యూహంలో భాగంగా సమీప భవిష్యత్తులో భారత ప్యాసింజర్ వెహికల్స్ మార్కెట్లో కంపెనీ వాటాను 10 శాతానికి చేర్చాలని లక్ష్యంగా చేసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కియాకు సుమారు 7% వాటా ఉందన్నారు. 2030 నాటికి మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 20%కి చేరుతుందని అంచనా వేశారు.

అనంతపురం ప్లాంటులో: ప్రపంచంలో మూడవ



అతిపెద్ద వాహన మార్కెట్ అయిన భారత్ విషయంలో దీర్ఘకాలిక లక్ష్యంతో ఉన్నట్టు టే–జిన్ పార్క్ తెలిపారు. 'ఇక్కడి వృద్ధి తీరుకు అనుగుణంగా వాటాను పెంచుకోవాలంటే కంపెనీ ప్రస్తుతం ఆఫర్ చేస్తున్న మోడళ్లు సరిపోవు. అందుకే కొత్త కార్లను ప్రవేశపెట్టనున్నాం. కొత్తగా వచ్చే మూడు మోడళ్లు కూడా ప్రపంచవ్యాప్తంగా కియా అభివృద్ధి చేసిన రీక్రియేషనల్ (వినోద) వెహికల్స్. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ ప్లాంటులో వీటిని అసెంబుల్ చేస్తాం' అని వివరించారు. పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఈ ఏడాది వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 3.5 లక్షల యూనిట్లకు పెంచుకుంటున్నట్టు వెల్లడించారు. ఇది ఏడాదికి 4.3 లక్షల యూనిట్లకు చేరుకోగలదని అన్నారు. డిమాండ్ బలంగా కొనసాగితే అనంతపురం ప్లాంటులో కొత్త లైన్ ఏర్పాటును కియా పరిశీలించవచ్చని పేర్కొన్నారు.

మరో 15 ఏళ్లు..

భారత్‌లో 2025 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వేగవంతం అవుతుందని కంపెనీ అంచనా వేస్తోంది. అయితే యూరప్ మార్కెట్‌లా కాకుండా ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో (ఐసీఈ) కూడిన వాహనాలు మరో 10–15 సంవత్సరాలపాటు ఇక్కడ కొనసాగుతాయని పార్క్ అన్నారు.

డీజిల్ మోడళ్లు సైతం..: డిమాండ్ కొనసాగుతున్నందున దేశంలో డీజిల్ వాహనాల విక్రయాన్ని కొనసాగిస్తామని కంపెనీ ఎండీ తెలిపారు. ఉద్గార నిబంధనలు కఠినతరం అయితే హైబ్రిడ్, ఇతర సాంకేతికతలను పరిగణిస్తామని వివరించారు. కాగా, కంపెనీ భారత మార్కెట్‌పై దృష్టి సారించడంతో ఎగుమతులు మొత్తం ఉత్పత్తిలో ప్రస్తుతం ఉన్న 25 నుండి 20%కి తగ్గవచ్చని అన్నారు.

నాలుగోరోజూ నాన్‌స్టాప్'బుల్స్'

- మరోకొత్త గరిష్టాలకు సూచీలు
- ఆల్‌టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తూ పరుగులు పెడుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉండటం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల పరంపర కొనసాగడం ర్యాలీకి తోడ్పడ్డాయి. సూచీలు నాలుగోరోజూ ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డ్‌లను నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 299 పాయింట్ల లాభంతో 65,504 వద్ద, నిఫ్టీ 84 పాయింట్లు పెరిగి 19,407 వద్ద మొదలయ్యాయి. తొలి గంటలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడంతో సూచీలు కొంతమేర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి మళ్లాయి. బ్యాంకింగ్, ఆర్థిక, ఐటీ రంగాల్లో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా నాలుగోరోజూ సెన్సెక్స్ 468 పాయింట్లు పెరిగి 65,673 వద్ద, నిఫ్టీ 111 పాయింట్లు బలపడి 19,434 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 274 పాయింట్ల లాభంతో 65,479 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా అయిదోరోజూ లాభాల ముగింపు. నిఫ్టీ మార్కెట్



ముగిసేసరికి 66 పాయింట్లు బలపడి 19,389 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్యతరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.22%, 0.05 % చొప్పున లాభపడ్డాయి. ఇంధన, ఆటో, కన్జూమర్, కమోడిటీ, టెలికం షేర్లు నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,134 కోట్లు ఈక్విటీ షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.785 షేర్లు అమ్మేశారు. డాలర్ మారకంలో రూపాయి 11 పైసలు బలపడి 82.02 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

అయిదురోజుల్లో రూ.7.90 లక్షల కోట్లు

సెన్సెక్స్ వరుస రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడిచిన అయిదు రోజుల్లో ఈ సూచీ 2,500 పాయింట్లకు పైగా బలపడటంతో బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో రూ.7.90 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. మంగళవారం ఒక్క రోజే ఇన్వెస్టర్లు రూ.44,898 కోట్లను ఆర్జించారు. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల రికార్డు స్థాయి రూ.2,98.57 లక్షల కోట్లకు చేరింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఫ్రోజెన్ మాంసం ఎగుమతిదారు హెచ్ఎంఏ ఆగ్రో ఇండస్ట్రీస్ షేరు లిస్టింగ్ నిరాశపరిచింది. ఇష్యూ ధర(రూ.585)తో పోలిస్తే బీఎస్ఈలో 5% ప్రీమియంతో రూ.615 వద్ద లిస్టయ్యింది. తొలి సెషన్‌లో 15% ర్యాలీ రూ.670 స్థాయికి చేరింది. ఆఖరికి 0.04% స్వల్ప నష్టంతో రూ.584.75 వద్ద ఫ్లాటుగా ముగిసింది.
- ఐడీఎఫ్‌సీ విలీనానికి బోర్డు ఆమోదం తెలపడంతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 4% నష్టపోయి రూ.79 వద్ద స్థిరపడింది. అయితే ఐడీఎఫ్‌సీ షేరు మాత్రం 6 శాతం పెరిగి రూ.116 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 2% పెరిగి రూ.111 వద్ద స్థిరపడింది.

స్టార్టప్ వ్యవస్థ బలోపేతానికి కృషి

- ప్రభుత్వం ప్రోత్సహిస్తుందే తప్ప నియంత్రించదు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

గురుగ్రామ్: అంకుర సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. స్టార్టప్‌ల వ్యవస్థను ప్రోత్సహించేందుకే తప్ప నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రయత్నించబోదని ఆయన స్పష్టం చేశారు. ఆ వ్యవస్థలో భాగమైన వర్గాలే స్వీయ నియంత్రణ పాటించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్టార్టప్20 సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. అంకుర సంస్థల పురోగతికి అవరోధాలు కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశం కాదనే స్పష్టమైన సందేశం స్టార్టప్‌లకు చేరాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. భారత్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని అంకుర సంస్థలను ఆహ్వానించారు. 2030 నాటికి అంకుర సంస్థల వ్యవస్థలోకి జీ20 దేశాలన్నీ కలిసి ఏటా 1 లక్ష కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టేలా చూసేందుకు స్టార్టప్20 గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు సాకారమైతే స్టార్టప్‌లకు మరిన్ని ప్రయోజనాలు చేకూరగలవని గోయల్ చెప్పారు.



పీయూష్ గోయల్

మంచి స్టార్టప్‌లకు నిధుల కొరత లేదు: అమితాబ్ కాంత్

సరైన అంకుర సంస్థలకు పెట్టుబడుల కొరతేమీ లేదని జీ20 షెర్పా అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు. పటిష్టమైన వ్యాపార విధానాలున్న మంచి స్టార్టప్‌లకు నిధుల లభ్యత బాగానే ఉందని ఆయన చెప్పారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కార మార్గాలను కనుగొనేందుకు స్టార్టప్ వ్యవస్థ చురుగ్గా పని చేస్తోందని స్టార్టప్20 శిఖర్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. భారత్‌లో 1,00,000 పైచిలుకు స్టార్టప్‌లు, 108 యూనికార్న్‌లు (బిలియన్ డాలర్లకు పైగా విలువ చేసే అంకురాలు) ఉన్నాయని అమితాబ్ కాంత్ తెలిపారు.

భవిత

జాబ్ పాయింట్

ఏపీఎస్ఎఫ్‌సీ, విజయవాడలో 20 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్(ఏపీఎస్ఎఫ్‌సీ).. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ లేదా బీఈ/బీటెక్, పీజీడీఎం, డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.07.2023.
» **వెబ్‌సైట్:** esfc.ap.gov.in

ఏపీ హైకోర్టు, అమరావతిలో 26 లా క్లర్క్ పోస్టులు

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన లా క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 26
» **అర్హత:**న్యాయశాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
» **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్(రిక్రూట్‌మెంట్),హైకోర్టు ఆఫ్ ఏపీ,అమరావతి,నేలపాడు, గుంటూరు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.07.2023.
» **వెబ్‌సైట్:** hc.ap.nic.in

పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, న్యూఢిల్లీలో 183 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 183
» **పోస్టుల వివరాలు:** ఐటీ ఆఫీసర్, లా మేనేజర్, సీఏ, సెక్యూరిటీ ఆఫీసర్, మార్కెటింగ్ రిలేషన్‌షిప్ మేనేజర్, ఫారెక్స్ డీలర్, ట్రెజరీ డీలర్, ఎకనమిస్ట్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్ డిగ్రీ/ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ /బీటెక్/బీఈ/సీఏ /ఎంసీఏ/పీజీ డిగ్రీ/ఎంబీఏ/పీజీడీబీఎం/పీజీడీబీఏ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.36,000 నుంచి రూ.78,230 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష, షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**12.07.2023.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
» **వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in

ఎన్‌హెచ్‌ఎం, తూర్పు గోదావరి జిల్లాలో 61 ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్ నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 61
» **పోస్టుల వివరాలు:**గైనకాలజిస్ట్,పీడియాట్రిషన్స్, సైకియాట్రిస్ట్, ఫిజిషియన్, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, డెంటల్ టెక్నీషియన్, హాస్పిటల్ అటెండెంట్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఇంటర్/డిప్లొమా/బ్యాచిలర్స్ డిగ్రీ/డీఎంఎల్‌టీ/ఎంబీబీఎస్/పీజీ డిగ్రీ/ఎంఫిల్ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రోస్టర్ పాయింట్లు/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** డీఎంహెచ్‌వో, తూర్పు గోదావరి, కాకినాడ.
» **ఇంటర్వ్యూ తేది:** 07.07.2023.
» **వెబ్‌సైట్:** eastgodavari.ap.gov.in

ఇస్రో తిరువనంతపురంలో 66 సైంటిస్ట్ పోస్టులు

తిరువనంతపురంలో ఇస్రో ఆధ్వర్యంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ).. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 66 » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌డీ, ఎస్‌సీ).

అర్హతలు-వేతనం

» **సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌డీ):** సంబంధిత స్పెషలైజేషన్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.**వేతనం:** నెలకు రూ.67,700నుంచి రూ.2,08,700 చెల్లిస్తారు.
» **సైంటిస్ట్/ఇంజనీర్(ఎస్‌సీ):** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ /బీటెక్ /ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.07.2023.
» **వెబ్‌సైట్:** www.vssc.gov.in

కాలేజ్, బ్రాంచ్.. ఏది ముఖ్యం!

» మొదలైన ఇంజనీరింగ్ ప్రవేశాల సందడి
» జోసా, టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం
» ఏపీలోనూ మరికొద్ది రోజుల్లో కౌన్సెలింగ్
» కోర్సు ఎంపికలో ఆసక్తి కీలకం అంటున్న నిపుణులు

బీటెక్.. దేశ వ్యాప్తంగా లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇంజనీరింగ్‌లో చేరేందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి ఎంట్రన్స్‌ల్లో ర్యాంకు కోసం విద్యార్థులు ఎంతో శ్రమిస్తారు. అలా సాధించిన ర్యాంకుతో.. తమకు నచ్చిన బ్రాంచ్‌లో.. మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో చేరాలని కోరుకుంటారు! కాని పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు.. వందల సంఖ్యలో కాలేజీలు!! దీంతో బ్రాంచ్‌కు ప్రాధాన్యమివ్వాలా? లేదా.. ఇన్‌స్టిట్యూట్ ముఖ్యమా అనే సందిగ్ధత ఎదురవుతోంది. ఇటీవల జోసా, టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. ఏపీలోనూ మరికొద్ది రోజుల్లో కౌన్సెలింగ్ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో.. బీటెక్‌లో బ్రాంచ్, కాలేజ్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు.. బ్రాంచ్ ఎంపికలో ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం క్రేజ్ కోణంలోనే బ్రాంచ్‌లను ఎంపిక చేసుకోవడం సరి కాదంటున్నారు. ఆసక్తి లేని బ్రాంచ్‌లో చేరితే.. భవిష్యత్‌లో అకడమిక్‌గా రాణించలేకపోవచ్చు. ఇది భవిష్యత్తు గమ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారముంది. కాబట్టి ఆయా బ్రాంచ్‌ల సిలబస్, కరిక్యులం స్వరూపాన్ని పరిశీలించి.. తమ సహజ ఆసక్తికి అనుగుణంగా ఉండే విభాగాన్ని ఎంపిక చేసుకోవడం మేలు.

ఇన్‌స్టిట్యూట్ ఎంపిక

విద్యార్థులు బ్రాంచ్‌తోపాటు ఇన్‌స్టిట్యూట్ ఎంపిక కూడా కీలకమని గుర్తించాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ సీట్లను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు అందరికీ సీట్లు లభిస్తాయి. అందుకే టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో సీటు కోసం విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించాలని ప్రయత్నిస్తుంటారు. కాలేజీ ఎంపికలో ఆయా ఇన్‌స్టిట్యూట్‌లో నిబంధనలకు అనుగుణంగా ప్రమాణాలు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కళాశాలలో ఫ్యాకల్టీ నుంచి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వరకూ.. వివిధ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు.

ఎన్‌బీఏ గుర్తింపు

విద్యార్థులు తాము చేరాలనుకుంటున్న బ్రాంచ్‌కు, ఇన్‌స్టిట్యూట్‌కు ఎన్‌బీఏ గుర్తింపు ఉందా? లేదా? అనే విషయం కూడా పరిగణించాలి. కారణం.. ఎన్‌బీఏ గుర్తింపు బ్రాంచ్‌ల వారీగా ఉంటుంది. కొన్ని కళాశాలలు మొత్తం బ్రాంచ్‌లలో ఒకట్రెండు బ్రాంచ్‌లకే ఎన్‌బీఏ గుర్తింపు ఉన్నా.. ఎన్‌బీఏ అక్రెడిటెడ్ అని వెబ్‌సైట్లలో ఆకర్షణీయంగా ప్రకటనలిస్తున్నాయి. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.



విద్యార్థులు కాలేజ్ ఎంపికలో సదరు ఇన్‌స్టిట్యూట్‌కు ఇండస్ట్రీ వర్గాల్లో ఉన్న గుర్తింపు గురించి తెలుసుకోవాలి. దీంతోపాటు గతేడాది ఆయా కాలేజీలో సీట్ల భర్తీ పరంగా ఓపెనింగ్–క్లోజింగ్ ర్యాంకుల సమాచారం సేకరించాలి. ఉదాహరణకు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, అదే విధంగా కొన్ని ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో ఈసీఈ, సీఎస్ఈ, ట్రిపుల్‌ఈ వంటి బ్రాంచ్‌లలో లాస్ట్ ర్యాంకు 1500 నుంచి 2000లోపే ఉంటోంది. అంటే.. ఆ కళాశాలలు తమ నాణ్యత ప్రమాణాల ఆధారంగా టాపర్స్ ఆదరణ పొందుతున్నాయని చెప్పొచ్చు.

బోధన విధానాలు

విద్యార్థులు కాలేజ్ ఎంపికలో బోధన పద్ధతుల పైనా దృష్టి పెట్టాలి. టీచింగ్‌లో అనుసరిస్తున్న విధానం, ప్రాక్టికల్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యం, అందులో విద్యార్థులను మమేకం చేస్తున్న తీరుతెన్నులను పరిశీలన చేయాలి. ఇప్పటికే ఆ కాలేజీలో చదువుతున్న విద్యార్థులను అడిగి ఈ వివరాలు తెలుసుకోవచ్చు. కొన్ని కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనల మేరకు తమ కళాశాలలో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ ఉన్నారని ప్రకటనలిస్తుంటాయి. వాస్తవానికి సదరు పీహెచ్‌డీ ఫ్యాకల్టీ క్లాస్ రూంలో స్టూడెంట్‌తో ఇంటరాక్షన్ ఎంత మేరకు ఉంటుందనేది ముఖ్యం.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

కళాశాలలో గత నాలుగేళ్ల ప్లేస్‌మెంట్ రికార్డ్స్ ఎలా ఉన్నాయి. ఎలాంటి కంపెనీలు వస్తున్నాయి. వచ్చిన కంపెనీలు ఎలాంటి ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి తదితర వివరాలను పరిశీలించాలి. ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాయని పలు కాలేజీలు విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాని ఇలా వచ్చిన సంస్థలు కోర్ ప్రొఫైల్స్‌లో ఎంతమందికి అవకాశాలు ఇస్తున్నాయో అడిగి తెలుసుకోవాలి.

ఈ బ్రాంచ్‌లకే క్రేజ్

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకర్‌లు మొదలు ఎంసెట్ టాపర్ల వరకూ.. ప్రతి ఒక్కరు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)ను తమ తొలి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నారు. గత మూడు, నాలుగేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో ఫస్ట్ ర్యాంక్ పొందిన అభ్యర్థులు సీఎస్ఈ బ్రాంచ్‌లోనే చేరారు. జనరల్ కేటగిరీలో 1500లోపు ర్యాంకుతోనే అన్ని ఐఐటీల్లో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవడమే సీఎస్ఈ పట్ల విద్యార్థుల క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు. రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఎంసెట్ ర్యాంకర్లది సైతం ఇదే ఆలోచన. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్–10, 20 ఇన్‌స్టిట్యూట్‌లలో జనరల్ కేటగిరీలో 5వేలలోపు ర్యాంకుతోనే ఈ బ్రాంచ్ సీట్లు భర్తీ అవుతున్నాయి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో సీఎస్ఈకి ఉజ్వల అవకాశాలు అందుబాటులో ఉండటమే ఇందుకు కారణంగా చెప్పొచ్చు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్

బీటెక్‌లో విద్యార్థులు ఆసక్తి చూపుతున్న మరో బ్రాంచ్.. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ). ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో గత రెండేళ్లుగా మూడున్నర వేలలోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్‌లో సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇదే ట్రెండ్ ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు, కౌన్సెలింగ్‌లలోనూ ప్రతిబింబిస్తోంది. జాబ్ మార్కెట్ పరిస్థితులు, ఉన్నత విద్య కోణంలో లభిస్తున్న అవకాశాలే ఇందుకు కారణం. ఇంటర్నెట్, బ్రాడ్ బ్యాండ్, స్మార్ట్ టెక్నాలజీస్, 5జీ టెక్నాలజీ స్థాయికి టెలికం రంగం విస్తరిస్తోంది. దీంతోపాటు డిజిటల్ ఇండియా, డిజిటలైజేషన్, డిజిటల్ లిటరసీ మిషన్ వంటి వాటితో ఈ రంగంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.

సివిల్ ఇంజనీరింగ్

మౌలిక రంగం, నిర్మాణ రంగంలో కట్టడాలు, డిజైన్లకు సంబంధించి మూల భావనలు, నైపుణ్యాలు అందించే కోర్సు ఇది. ఇటీవల కాలంలో ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా జీపీఎస్, అర్బన్ డెవలప్‌మెంట్ వంటి పలు స్పెషలైజేషన్లకు రూపకల్పన జరిగినప్పటికీ.. వీటికి ఆధారం సివిల్ ఇంజనీరింగ్‌లోని మౌలిక సూత్రాలే. రియల్టీ రంగంలో కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడం కూడా ఈ బ్రాంచ్ భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తోంది. ఈ బ్రాంచ్‌లో రాణించాలంటే.. డిజైన్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ పరమైన అంశాలపై పట్టు సాధించడం ముఖ్యం.

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

దశాబ్దాలుగా 'వెలుగు'లీనుతున్న మరో బ్రాంచ్.. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్. ఈఈఈగా సుపరిచితమైన ఈ బ్రాంచ్ కూడా విద్యార్థుల ప్రాథమ్యతల క్రమంలో రెండు, మూడు స్థానాల్లో నిలుస్తోంది. ఈ బ్రాంచ్ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్తు పరంగా ఆశాజనక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మెకానికల్ ఇంజనీరింగ్

బీటెక్‌లో మరో ఎవర్ గ్రీన్ బ్రాంచ్.. మెకానికల్ ఇంజనీరింగ్. ఇది బెస్ట్–5 బ్రాంచ్‌ల జాబితాలో నిలుస్తోంది. ఆటో రిక్షా నుంచి బోయింగ్ విమానాల తయారీ వరకూ.. ప్రతి విభాగంలోనూ మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యాల అవసరం ఎంతో ఉంది. ఫలితంగా ఈ బ్రాంచ్ నిత్య నూతనంగా వెలుగులీనుతోంది. ఐఐటీల్లో జనరల్ కేటగిరీలో సగటున నాలుగు వేల లోపు ర్యాంకుతో ఈ బ్రాంచ్ సీట్లు భర్తీ అవుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ విభాగంలో ఆధునికత దిశగా అడుగులు పడుతున్నాయి. రోబోటిక్స్, అన్–మ్యాన్డ్ వెహికిల్స్ వంటి వాటిని వీటికి ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొనొచ్చు. అకడమిక్ స్థాయిలోనే రోబోటిక్స్, క్యాడ్, క్యామ్, 3–డి డిజైన్ టెక్నాలజీస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ నైపుణ్యాలు సొంతం చేసుకుంటే.. అవకాశాలకు ఢోకా ఉండదు.

ఇండస్ట్రీ 4. 0 బ్రాంచ్‌లు

ఇటీవల ఏఐసీటీఈ మార్గదర్శకాల ప్రకారం–దేశంలోని ఐఐటీలు సహా అనేక ఇన్‌స్టిట్యూట్‌లు అందుబాటులోకి తెస్తున్న కొత్త బ్రాంచ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్. ఈ బ్రాంచ్ ద్వారా ఇండస్ట్రీ 4.0గా స్కిల్స్‌గా పేర్కొంటున్న ఏఐ, ఎంఎల్‌తోపాటు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, 5జీ టెక్నాలజీస్‌పై అవగాహన లభిస్తుంది.

మరికొన్ని బ్రాంచ్‌లు

కెమికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్/ మెరైన్‌ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ తదితర బ్రాంచ్‌ల్లోనూ విద్యార్థులు చేరుతున్నారు.



ఊబకాయం, హైబీపీ ఎక్కువే...

రాష్ట్రంలో దాదాపు 25 % మంది జీవనశైలి వ్యాధుల బాధితులే

మద్యం, మాంసం వినియోగం అధికంగా ఉండటమూ కారణం

లాన్సెట్ తాజా అధ్యయన నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే జీవనశైలి వ్యాధుల సూచికల్లో తెలంగాణ పరిస్థితి అత్యంత పేలవంగా ఉందని తాజా అధ్యయనం తేల్చింది. అలాగే స్థూలకాయం, రక్తపోటు కేసుల సంఖ్య సైతం రాష్ట్రంలోనే ఎక్కువగా నమోదవుతున్నాయని వెల్లడించింది. 'మెటబాలిక్ నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ హెల్త్ రిపోర్ట్ ఆఫ్ ఇండియా: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్–ఇండియా డయాబెటిస్ (ఐసీఎంఆర్ ఐఎన్డీఐఏబీ) పేరిట లాన్సెట్ రూపొందించిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో 25 శాతం మంది సెంట్రల్ ఒబేసిటీ, హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నారు. దేశవ్యాప్తంగా 2008 అక్టోబర్ 18 నుంచి 2020 డిసెంబర్ 17 మధ్య మొత్తం 1,13,043 మంది (గ్రామీణ ప్రాంతాల నుంచి 79,506 పట్టణ ప్రాంతాల నుంచి 33,537 మంది)పై నిర్వహించిన అధ్యయన ఫలితాలను లాన్సెట్ ఇటీవల ప్రచురించింది. ఊబకాయం కేసులలో తెలంగాణ రాష్ట్రం.. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, మణిపూర్, మిజోరం, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, చండీగఢ్, హరియాణా, ఢిల్లీల సరసన నిలుస్తోంది. దీనికి కారణం ఉదర ఊబకాయం, ట్రైగ్లిజరైడ్స్‌కు మధ్య దగ్గరి సంబంధం ఉండటమేనని వైద్య నిపుణులు అంటున్నారు.



హైపర్ టెన్షన్... స్లీప్ అప్నియాలకూ దోహదం..

'పన్నీర్, జంక్ ఫుడ్, మాంసాహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక స్థాయి కొలెస్ట్రాల్ సమస్యలు వస్తున్నాయి. దీనికితోడు డెస్క్ జాబ్‌లు సెంట్రల్ ఒబేసిటీకి దారితీస్తున్నాయి. ఊబకాయంతో గుండె జబ్బులు, మధుమేహమే కాకుండా హైబీపీ, స్లీప్ యాప్నియా వంటి ఇతర జబ్బులు కూడా ఎక్కువగా వస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సమస్యలకు అధిక మద్యపానం కూడా ఒక ప్రధాన కారణం' అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

అలవాట్లను కట్టడి చేస్తేనే..

పొత్తికడుపు ప్రాంతంలో కొవ్వు అధికంగా చేరడాన్నే సెంట్రల్ ఒబేసిటీగా పేర్కొంటారు. పెరిగిన విసరల్ ఫ్యాట్ పోర్టల్ బ్లడ్ సిస్టమ్ ద్వారా సరఫరా అవుతుంది కాబట్టి ఈ ప్రాంతంలోని అదనపు కొవ్వు రక్తప్రవాహంలోకి కొవ్వు నిల్వలను విడుదల చేస్తుందని... ఇది అనారోగ్య సమస్యలను కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యాయామం, శారీరక శ్రమను జీవనశైలిలో భాగం చేసుకోవడం తోపాటు ఆహారపు అలవాట్లను నియంత్రించుకోవడం తప్పనిసరని వారు సూచిస్తున్నారు.

శారీరక శ్రమ లేకపోవడం.. ప్రాసెస్డ్ ఫుడ్ తినడం..

లాన్సెట్ నివేదిక ప్రకారం తెలంగాణ ప్రజల్లో ఊబకాయం, రక్తపోటు, ట్రైగ్లిజరిడెమియా సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. 'ఇది తక్కువస్థాయి శారీరక శ్రమతోపాటు ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తినడం వల్ల పెరుగుతున్న సమస్య. ట్రైగ్లిజరైడ్స్, యూరిక్ యాసిడ్ స్థాయిలు ఎక్కువగా ఉన్న రోగులను ఇప్పుడు తరచుగా చూస్తున్నాం. ఇవి మెటబాలిక్ సిండ్రోమ్ సంకేతాలు. చికిత్స తీసుకోకుంటే గుండె, మూత్రపిండాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి" అని నిజామాబాద్ మెడికల్ కాలేజీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ మాదల వివరించారు.



నేడు, రేపు భారీ వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే మరికొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆవర్తనం మంగళవారం ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ తీరం పరిసరాల్లోని, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు మధ్య కొనసాగుతూ ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశ వైపు వంగి ఉందని పేర్కొంది. కాగా, గత 24 గంటల్లో జనగాం జిల్లా నర్మెట్ట, ఖమ్మం జిల్లా వైరాలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

90ఎం.ఎల్. పోయట్లేదు

బెల్ట్‌షాప్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యువకుడు

జగిత్యాలక్రైం



జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామంలోని బెల్ట్‌షాపు నిర్వాహకుడు మద్యం పోయడం లేదని ఓ వ్యక్తి మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హబ్సీపూర్ గ్రామానికి చెందిన చిరంజీవి మంగళవారం ఉదయం గ్రామంలోని రవికి చెందిన బెల్ట్‌షాపులోకి వెళ్లాడు. తనకు 90 ఎం.ఎల్.మద్యం పోయాలని కోరగా.. అందుకు నిర్వాహకుడు నిరాకరించాడు. అయితే, తనను కులం పేరుతో తిట్టడమే కాక తనకు మద్యం పోయకుండా అవమానించాడని బాధితుడు రాత్రి పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. చిరంజీవి ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

భద్రాద్రి రామాలయంలో ఆన్‌లైన్ సేవలు

భద్రాచలం (కొత్తగూడెం జిల్లా)


ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో భక్తులకు మంగళవారం నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన www.bhadradritemple.telangana.gov.in ను ఈఓ ఎల్.రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ... వెబ్‌సైట్ ద్వారా భక్తులు ఆన్‌లైన్‌లోనే ఆర్జిత సేవల టికెట్లు పొందొచ్చన్నారు. ఇందులో భద్రాచలం, పర్ణశాల రామాలయ విశిష్టతలు, అనుబంధ ఆలయాల వివరాలు పొందుపర్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే దేవస్థానం ఆధ్వర్యాన ఉన్న వసతి, కాటేజీ వివరాలను కూడా ఇందులో చేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రవీందర్, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, వెబ్‌సైట్ రూపకర్తలు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.